శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 137 | శుక్రవారం | 17-04-2026 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బిజెపి ఎంపి వక్రభాష్యం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై బిజెపి ఎంపి తేజస్వి సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించే ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బ్రిటీషర్ల కన్నా నీచమైన రీతిలో వ్యవహరించినట్లు ఆరోపించారు. ఇండియా , పాకిస్థాన్‌ను విడగొట్టినట్లుగా ఆంధ్రా, తెలంగాణను విభజించారని ఎంపి సూర్య ఆరోపించారు. దీనిపై తెలంగాణ ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. ఎంపి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### మహిళా రిజర్వేషన్ అమలు, డీలిమిటేషన్ బిల్లులపై

# లోక్‌సభలో వాడీవేడి చర్చ

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు తోడ్పాటు
## డీ లిమిటేషన్‌కు తీవ్ర వ్యతిరేకత



### రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ప్రవేశపెట్టేందుకు ఓటింగ్

**న్యూఢిల్లీ :** మూడురోజులపాటు (16–18) జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశం తొలిరోజున ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతదేశ ఎన్నికల పటాన్ని మార్చుచేసే మూడు బిల్లులను ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్య లోక్‌సభలో ప్రవేశపెట్టింది. లోక్‌సభ, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన చట్టం (నారీ శక్తి వందన్ అధినియం) అమలును 2029 ఎన్నికల నుంచి అమలు జరిపేందుకు వీలుగా నియోజకవర్గాల సంఖ్యను పెంచే రాజ్యాంగ 131వ సవరణ బిల్లును, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టగా, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026ను హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం, 1963 నేషనల్ కాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ చట్టం, 1991, జమ్మూ–కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ చట్టం, 2019లను సవరించటానికి ఈ బిల్లు ఉద్దేశించబడింది. ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లును బలపరుస్తూనే, దాన్ని డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రశ్నించాయి. దక్షిణాది రాష్ట్రాలకు, చిన్న రాష్ట్రాలకు హాని జరుగుతుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. లోక్‌సభ సీట్లను 543 నుంచి 850కి పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అదే సమయంలో, అన్ని రాష్ట్ర లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపుదలపై అస్పష్టతను ప్రతిపక్షాలు ప్రశ్నించగా, తప్పక 50 శాతం పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని, వాటి సీట్లూ 50 శాతం పెరుగుతాయని హోంమంత్రి అమిత్‌షా గణాంకాలు చదివి గట్టి హామీయిచ్చారు. చర్చలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జోక్యం తరువాయి 2లో

### మూడు బిల్లులపై నేడు 4 గంటలకు ఓటింగ్

మహిళల రిజర్వేషన్ల చట్టాన్ని సవరించడానికి మరియు నియోజకవర్గాల పునర్విభజన సంఘాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన మూడు బిల్లులపై లోక్‌సభలో ఓటింగ్ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ బిల్లులపై సుమారు 15 నుండి 18 గంటల పాటు చర్చ జరుగుతుందని బిర్లా పేర్కొన్నారు. ఈ బిల్లులపై 12 గంటల పాటు చర్చ జరపాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించారు. అయితే, ఆ చర్చా సమయాన్ని పొడిగించే నిర్ణయాన్ని స్పీకర్ తీసుకుంటారని ఆయన తెలిపారు.

## ఏ రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్ల నిష్పత్తి తగ్గదు : మోదీ



**న్యూఢిల్లీ :** మహిళా చట్టం చట్టం అమలుకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజనలో చిన్నదైనా, ఉత్తరమైనా, దక్షిణమైనా, తూర్పు అయినా, పశ్చిమమైనా ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపబడదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ సంస్కరణను వ్యతిరేకించే వారిని దేశ మహిళలు క్షమించరని ఆయన హెచ్చరించారు. మహిళా కోటా చట్ట సవరణకు, పునర్విభజన కమిషన్ ఏర్పాటుకు ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో జోక్యం చేసుకుంటూ, పునర్విభజన ప్రక్రియ ఫలితంగా ఏ రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్ల నిష్పత్తి తగ్గదని మోదీ స్పష్టం చేశారు. 'ఆ నిష్పత్తిలో (లోక్‌సభ సీట్ల) కూడా ఎలాంటి మార్పు ఉండదు, పెరుగుదల కూడా అదే నిష్పత్తిలో ఉంటుంది' అని ఆయన అన్నారు. 2029లో మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు అధికార పక్షం క్రెడిట్ కోరుకోవడం లేదని, ఆ ఘనతను ప్రతిపక్షానికే ఇస్తామని మోదీ అన్నారు. 'మీరు దీనిని వ్యతిరేకిస్తే, నాకు రాజకీయ లబ్ధి చేకూరడం సహజం, కానీ మీరు నాతో పాటు నడిస్తే, ఎవరికీ ఎలాంటి రాజకీయ ప్రయోజనం చేకూరదు' అని ఆయన అన్నారు. శాసనసభలలో రిజర్వేషన్ అనేది మహిళల హక్కు కాబట్టి, తాము ఈ దేశ మహిళలకు ఏదో ఇస్తున్నామనే భ్రమలో ఎవరూ ఉండకూడదని ప్రధానమంత్రి అన్నారు. 'మాకు గుర్తింపు అక్కర్లేదు. మీరు నన్ను 'హామీ' అనే తరువాయి 2లో

## దక్షిణాదిలో ఎంపి స్థానాలు 195కి పెరుగుతాయ్

### జనగణనతో పాటు కుల గణన : అమిత్ షా

**న్యూఢిల్లీ :** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి, ఎపిలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా తరువాయి 2లో

**దక్షిణాది రాష్ట్రాలు**
**129 – 195**

| | ప్రస్తుత సీట్ల సంఖ్య | పెరిగే సీట్లతో కలిపి |
|---|---|---|
| తెలంగాణ | 17 | 26 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 38 |
| తమిళనాడు | 39 | 59 |
| కర్నాటక | 28 | 42 |
| కేరళ | 20 | 30 |

## మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ బుల్డోజ్

### బిల్లులపై ప్రారంభ చర్చలో కాంగ్రెస్ ఫైర్



**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనను 'బుల్డోజ్' చేయాలని చూస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. మహిళా కోటా చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం నిజంగా కట్టుబడి ఉంటే, లోక్‌సభ ప్రస్తుత బలాల ఆధారంగా తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేసింది. బిజెపి తన ప్రభావాన్ని పెంచుకోవడానికి నియోజకవర్గాల పునర్విభజనను ఒక రాజకీయ ఆయుధంగా వాడుకుంటోందని కూడా ప్రతిపక్షం ఆరోపించింది. మహిళా కోటా చట్టాన్ని సవరించడానికి, పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై చర్చను ప్రారంభిస్తూ, గొగోయ్ ఆ బిల్లులు మహిళా వ్యతిరేకమైనవి, కుల గణన వ్యతిరేకమైనవి, రాజ్యాంగ వ్యతిరేకమైనవి, దేశ సమాఖ్య నిర్మాణానికి వ్యతిరేకమైనవి అని అన్నారు. మహిళా కోటా చట్టాన్ని సవరించే రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును గురువారం లోక్‌సభలో ఓట్ల విభజన అనంతరం ప్రవేశపెట్టారు. చర్చలో పాల్గొన్న గొగోయ్ మాట్లాడుతూ డీలిమిటేషన్, గెర్రీమాండరింగ్ ద్వారా ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 'జమ్ముకశ్మీర్, అసోంలో డీలిమిటేషన్ ద్వారా వారు ఏమి చేశారో, దానినే మహిళా రిజర్వేషన్ పేరుతో దేశమంతటా చేయాలనుకుంటున్నారు' అని సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు అన్నారు. ప్రభుత్వ చర్యలు సిగ్గుచేటు అని మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు సమయం పడుతుంది కాబట్టి సవరణలు అవసరమని ప్రభుత్వ బిల్లులో పేర్కొన్నారని తరువాయి 2లో

### మహిళా రిజర్వేషన్‌ను బిజెపి

## 'కపట నాటకం'గా వాడుకుంటోంది



### వామపక్షపార్టీల ధ్వజం

మహిళా రిజర్వేషన్లకు మూలాలు రేణు చక్రవర్తి, గీతా ముఖర్జీలే

ఇది 'ఒక దుష్ట రాజకీయ కుట్ర' : డి.రాజా

కేంద్రానిది 'కుటిల చర్య' : ఎం.బేబి

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్‌ను కొత్త నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాలన్న కేంద్రం నిర్ణయాన్ని గురువారం వామపక్ష నాయకులు తీవ్రంగా విమర్శించారు. సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ 'మహిళా రిజర్వేషన్‌ను కమ్యూనిస్టు పార్టీ ఒక గర్వించదగిన వారసత్వం' అని, దాని మూలాలు రేణు చక్రవర్తి, గీతా ముఖర్జీ వంటి నాయకుల వరకూ విస్తరించి ఉన్నాయని గుర్తుచేశారు. భారతదేశ రాజకీయ, భౌగోళిక స్వరూపాన్ని మార్చి కేంద్రీకరించడానికి బిజెపి మహిళా రిజర్వేషన్‌ను ఒక 'కపట నాటకం'గా వాడుకుంటోందని కూడా రాజా ఆరోపించారు. 2023లో ఆమోదించబడినది ఆ సుదీర్ఘ పోరాటానికి ప్రతిబింబమని, కుట్రపూరిత మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దానిని డీలిమిటేషన్ సెన్సస్‌కు బంధించి దాని అమలును అనిశ్చితంగా మార్చిందని, రాజ్యాంగ సవరణను పక్కనపెట్టి ఇప్పుడు సాధారణ పార్లమెంటరీ మెజారిటీతో నిర్ణయించాల్సిన జనాభా లెక్కలు, కులగణన, భవిష్యత్ నియోజకవర్గాల పునర్విభజనకు ప్రాతిపదికపై ఇంకా స్పష్టత లేదని రాజా తరువాయి 2లో

## లోక్‌సభ సీట్లు 815కు పెంపు



### 272 స్థానాలు మహిళలకే

కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

**న్యూఢిల్లీ :** లోక్‌సభ సభ్యుల సంఖ్యను 815కు పెంచుతామని, ఇందులో 272 స్థానాలు మహిళలకు కేటాయించబడతాయని, ఈ కోటాను అమలు చేయడం వల్ల పురుషులకో లేదా ఏ రాష్ట్రానికో ఎటువంటి నష్టం వాటిల్లదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ గురువారం తెలిపారు. మహిళల కోటా చట్టాన్ని సవరించడానికి, నియోజకవర్గాల పునర్విభజన సంఘాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన మూడు బిల్లులపై లోక్‌సభలో తన ప్రారంభోపన్యాసంలో మేఘవాల్ మాట్లాడుతూ, సభలోని మొత్తం 815 స్థానాల్లో 272 స్థానాలను మహిళలకు కేటాయించడం అనేది మహిళలకు 33 శాతం స్థానాలను రిజర్వు చేసే సరళమైన సూత్రమేనని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం, తరువాయి 2లో



## దక్షిణాదికి అన్యాయం చేసే డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా

# 18న నిరసన ప్రదర్శన

తక్షణమే బిల్లును ఉపసంహరించుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులతో కూడిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

'రాజ్యాంగ 131వ సవరణ'ను ఖండిస్తూ, డీలిమిటేషన్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, పలువురు మేధావులతో కూడిన రౌండ్ టేబుల్ సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా ఉన్న డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి నిజాం కళాశాల వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రావు విగ్రహం వరకు ప్రదర్శనను నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాదిలో సీట్ల సంఖ్య తరువాయి 12లో

## మఖ్దూంభవన్‌కు కూనంనేని సాంబశివరావు

కాలుకు శస్త్ర చికిత్స చేసుకున్న తర్వాత సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూ నంనేని సాంబశివరావు తొలిసారిగా గురువారం హైదరాబాదులోని మఖ్దుమ్ భవన్‌కు వచ్చారు. ఈనేపథ్యంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు సాంబశివరావును పరామర్శించారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్, రాష్ట్ర మహిళా సమాఖ్య నాయకురాలు కొరిమి సుగుణ, సింగరేణి నాయకులు ఉన్నారు.




### గతంలో ఆమోదించిన మహిళా కోటా బిల్లును

## తక్షణమే అమలుచేయాలి

### జాతీయ మహిళా సంఘాలు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా రిజర్వేషన్ బిల్లు – 2023 లో జనాభా లెక్కలు, డీలిమిటేషన్‌కు సంబంధించిన షరతులను తొలగించి, గతంలో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని జాతీయ మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో నారీ శక్తి వందన్ చట్టం ( ఎన్ఎస్‌విఎ) సవరణలను ప్రజాస్వామ్య ప్రక్రియ కు విరుద్ధంగా తొందరపాటుతో ఆమోదించాలన్న ప్రతిపాదిత చర్యను నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ ( ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), ఆల్‌ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఎఐడిడబ్ల్యుఎ), ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్ ( ఎఐపిడబ్ల్యుఎ) తీవ్రంగా వ్యతిరేకించాయి. ఎంతో ప్రాధాన్యత గలఈ బిల్లును, తరువాయి 2లో

### ఒప్పందానికి అంగీకరించకపోతే

# మళ్ళీ దాడులు

ఇరాన్‌కు అమెరికా మంత్రి హెగ్సెత్ హెచ్చరిక

ఇరాన్ జెండా నౌకను ఎక్కడైనా వెంటాడతాం : డాన్ కైన్

దిగ్బంధనం తొలగించకపోతే ఎర్ర సముద్రాన్ని అడ్డుకుంటాం : ఇరాన్

### ఎంతకాలమైనా దిగ్బంధనం కొనసాగిస్తాం

**వాషింగ్టన్:** కాల్పుల విరమణ పొడిగించేందుకు, శాశ్వత శాంతి యత్నాలకు మధ్యవర్తి దేశం పాకిస్థాన్ తన దౌత్య చర్యలను ఉధృతం చేయగా, మరోవైపు, ఒప్పందాన్ని తిరస్కరిస్తే మళ్ళీ దాడులు చేస్తామని అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ ఇరాన్‌కు హెచ్చరించారు. దిగ్బంధనం ఎత్తివేయకపోతే ఎర్రసముద్రంలో నౌకా రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిపై దిగ్బంధనం ఎత్తివేసేందుకు జరుగుతున్న చర్చల్లో అమెరికా కూడా భాగస్వామిగా చేరిందని టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపుల విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఒక్కటే మధ్యవర్తిగా వ్యవహరిస్తోందని అమెరికా స్పష్టం చేయగా, తమ ఓడరేవులపై దిగ్బంధన చర్యలు విరమించుకోకపోతే ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకల రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ప్రపంచంలో ఎక్కడైనా ఇరాన్ జెండా ఉన్న నౌకలను, వాటికి భౌతిక మద్దతు అందించే నౌకలను తమ దళాలు చురుగ్గా వెంటాడతాయని అమెరికా త్రివిధ బలగాల సంయుక్త ప్రధానాధిపతి జనరల్ డాన్ కైన్ హెచ్చరిక చేశారు. ఇరాన్ ప్రాదేశిక జలాల్లో, అంతర్జాతీయ జలాల్లో ఇరాన్,సంబంధిత నౌకలపై తీవ్ర దిగ్బంధనం అమలు జరుగుతోందని పెంటగాన్‌లో గురువారం ఆయన ప్రకటించారు. ఏ క్షణంలోనైనా యుద్ధం తిరిగి ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. హోర్ముజ్‌లో తరువాయి 12లో

### రోడ్డు ప్రమాదం...

## ముగ్గురు కార్మికులు మృతి

### ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఘటన

ప్రజాపక్షం/ అశ్వారావుపేట



అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాడిస్ ఫ్యాక్టరీలో కార్మికులుగా పనిచేస్తున్న చిట్టూరి కృష్ణయ్య(57) అనే కంపెనీ ట్రాక్టర్ డ్రైవర్ ఉదయం సమయంలో కార్మికులను ట్రాక్టర్లు ఎక్కించుకుని ఫ్యాక్టరీకి సంబంధించిన ముడి పద్దారాల తరువాయి 12లో

## ఆస్ట్రేలియాలో కీలకమైన రిఫైనరీ దగ్ధం



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా విక్టోరియా రాష్ట్రంలో ఉన్న అత్యంత కీలకమైన చమురు శుద్ధి కర్మాగారంలో బుధవారం రాత్రి పొద్దుపోయాక తీవ్ర అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ రిఫైనరీ రోజుకు 1.20 లక్షల బ్యారెల్స్ చమురును ఈ రిఫైనరీ శుద్ధి చేస్తుంది. అగ్నిమాపకదళ సిబ్బంది 13 గంటలపాటు కష్టపడి మంటలను అదుపు చేశారు. ప్రస్తుతం రిఫైనరీ బాగానే పనిచేస్తోందని కానీ చాలా తక్కువ స్థాయిలో చమురు శుద్ధి అవుతోందని సంబంధిత అధికారులు చెప్పారు. గీలాంగ్ శివారు ప్రాంతం కోరియోలోని వివా ఆయిల్ రిఫైనరీలో అర్ధరాత్రి సాంకేతిక లోపం కారణంగా మంటలు చెలరేగాయి.రిఫైనరీలోని మోగాస్ యూనిట్ దెబ్బతింది. పెట్రోల్,డీజిలు, జెట్ ఫ్యూయల్ ఉత్పత్తి బాగా తగ్గిపోయింది.

## రష్యా దాడులు: ఉక్రేన్‌లో 16 మంది మృతి

### 659 డ్రోన్లు, 44 క్షిపణులతో దాడి



**మాస్కో:** రష్యా చేసిన భారీస్థాయి దాడుల్లో పలుచోట్ల మొత్తంగా 16 మంది మరణించారని ఉక్రేన్ పేర్కొంది. ఇటీవలి వారాల్లో రష్యా చేసిన అతిపెద్ద దాడి ఇదే. 659 డ్రోన్లు, 44 క్షిపణులతో రష్యా సైనికులు తీవ్ర దాడులు చేశారు. ఈ దాడులను ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఖండించారు. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం, చర్చల ప్రక్రియలో నిండా మునిగిపోయిన ట్రంప్‌కు ఉక్రేన్ సమస్యపై దృష్టి కేంద్రీకరించేందుకు సమయం చాలడం లేదని అన్నారు. రాత్రికి రాత్రే పౌర ప్రాంతాలపై గంటల తరబడి రష్యా ఈ దాడులు చేసిందని పేర్కొంది. రష్యా దాడులు చేసిన ప్రతిసారీ ఉక్రేన్ రక్షణ బలగాలు కూడా ప్రతిదాడులు చేస్తున్నాయి. కాగా, 207 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ వ్యవస్థ ప్రకటించింది. దక్షిణ నగరమైన తువాప్సేలో జరిగిన దాడిలో ఇద్దరు చిన్నారులు మరణించినట్లు టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. రెండు దేశాలూ అంగీకరించిన 32 గంటల ఆర్థోడాక్స్ ఈస్టర్ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ దాడులు మొదలయ్యాయి. ఈ ఒప్పందాన్ని కూడా ఉల్లంఘించారని రెండు దేశాలు పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. బెల్గోరోడ్, కుర్స్క్, స్మోలెన్స్క్, ఓరియాల్, బ్రయాన్స్క్, క్రిమియా తదితర ప్రాంతాలలో డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. తన ఇంటిని రెండు క్షిపణులు ధ్వంసం చేశాయని టెటినియా సోకోల్ అనే 54 ఏళ్ళ ఉక్రేన్ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికి మూడుసార్లు దాడులు జరిగాయని ఆమె చెప్పారు. అధ్యక్షుడు జెలెన్స్కీ జర్మనీ, నార్వే, ఇటలీ దేశాలలో ఈ వారంలో రెండు రోజుల పర్యటన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. ఉక్రేన్ కూడా తనదైన దేశీయ ఆయుధ పరిశ్రమను అభివృద్ధి చేసింది. డ్రోన్లు, క్షిపణులను ఉత్పత్తి చేస్తోంది. కానీ అమెరికా తరహా మెరుగైన క్షిపణి వ్యవస్థ ఉక్రేన్ వద్ద లేదు.

# లెబనాన్‌పై ట్రంప్ మాటలు నిజం కాదు!

● నెతన్యాహూ– జోసఫ్ ఔన్ ఫోన్ సంభాషణ జరగలేదు ● ఇరాన్ తరహాలోనే కాల్పుల విరమణ: ఘాలిబాఫ్ ఉద్ఘాటన ● ఇజ్రాయెల్ రక్షణ బలగాలపై హెజ్బొల్లా డ్రోన్ దాడులు ● బెంట్ జెబైల్‌లో 70 హెజ్బొల్లా స్థావరాలు ధ్వంసం ● దక్షిణ లెబనాన్‌లో ముగ్గురు పారా మెడిక్స్ మృతి





**వాషింగ్టన్:** ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య ఒక ఒప్పందం కుదిరే అవకాశాలు కనిపిస్తున్నాయని, ఈ మేరకు గురువారం సాయంత్రం ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ మధ్య ప్రత్యక్ష ఫోన్ సంభాషణ జరుగుతుందని ట్రంప్ చెప్పిన మాటలన్నీ బూటకంగా మారాయి. ఆ నాయకులు ఇద్దరిమధ్యా ఎలాంటి చర్చలూ జరగలేదు. దీంతో లెబనాన్‌లో కాల్పుల విరమణ చర్చలపై అస్పష్టత, అనిశ్చితి ఇంకా కొనసాగుతోంది. లెబనాన్‌లో హెజ్బొల్లా–ఐ.డి.ఎఫ్ మధ్య హోరాహోరీ పోరాటం జరుగుతున్నప్పటికీ, వాషింగ్టన్‌లో అమెరికా సారథ్యంలో లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య ఏప్రిల్ 14న ముఖాముఖీ చర్చలు జరిగిన తర్వాత సానుకూల సంకేతాలు కనిపించాయి. ఈ చర్చలకు ముందుగా లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ మాట్లాడుతూ, కాల్పుల విరమణే తమ ప్రధాన ధ్యేయమని చెప్పారు. కాల్పుల విరమణ జరగాలని మొదట తాము కోరడం ద్వారా రెండు దేశాలమధ్యా ముఖాముఖీ చర్చలకు బీజం పడిందన్నారు. కానీ ఈ చర్చలను హెజ్బొల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో ఈ చర్చలకు అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నారు.1948లో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ఆవిర్భవించిన ప్పటినుండీ సాంకేతికంగా లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య ఎలాంటి అధికారిక దౌత్య సంబంధాలు లేవు. 1993లో ఒకసారి ఈ రెండు దేశాలమధ్యా ముఖాముఖీ సంభాషణలు జరిగాయి. ఈ తర్వాత మళ్ళీ ఇదే. అదేవిధంగా ఇరాన్ పార్లమెంటు స్పీకర్,అమెరికాతో చర్చల్లో ప్రధాన ప్రతినిధి మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ గురువారం సాయంత్రం లెబనాన్ పార్లమెంటు స్పీకర్ నబీహ్ బెర్రీతో ఫోన్ సంభాషణ చేస్తూ, ఇరాన్‌లో కాల్పుల విరమణ ఎంత ముఖ్యమో లెబనాన్‌లో కూడా కాల్పుల విరమణ అంతే ముఖ్యమని ఉద్ఘాటించారు. అమెరికాతో చర్చల సందర్భంగా అన్ని సంఘర్షణ ప్రాంతాలలోనూ యుద్ధాన్ని ముగించే విధంగా ఆ దేశ ప్రతినిధులపై ఇరాన్ తీవ్రమైన ఒత్తిడి తీసుకువస్తోందని ఘాలిబాఫ్ అన్నారు. ఈ మేరకు టెలిగ్రామ్‌లో ఆయన పోస్టింగ్ పెట్టారు. మా లెబనాన్ సోదరులను ఇరానీయులు మరచిపోలేదు, వారిని మాలో ఒకరిగానే భావిస్తాం అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గురువారం హెజ్బొల్లా దళాలు ఉత్తర ఇజ్రాయెల్‌లోని నహరియా ప్రాంతంలో డ్రోన్ దాడులు చేశాయి. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ రక్షణ బలగాల కేంద్రాలను దెబ్బతీశామని హెజ్బొల్లా ప్రకటించింది. లెబనాన్‌లో పాలస్తీనియన్లు ఉన్న గ్రామాలు,హెజ్బొల్లాస్థావరాలు,పట్టణాలు బాంబు దాడుల్లో నేలమట్టమవుతున్నాయి. 45 రోజులుగా జరుగుతున్న దాడుల్లో 1,400 భవంతులు నేలమట్టమయ్యాయి. ఒక్క తేబెహ్ పట్టణంలోనే వందల భవంతులను ఐ.డి.ఎఫ్ ధ్వంసం చేసింది. శాటిలైట్ చిత్రాలు వీటి తీవ్రతను తెలియజేస్తున్నాయి. గురువారం దక్షిణ లెబనాన్ బింట్ జెబైల్‌లో ఇజ్రాయెల్ దళాలు భయంకరమైన హింసకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో హెజ్బొల్లాకు చెందిన 70 స్థావరాలను ఐ.డి.ఎఫ్ దళాలు ధ్వంసం చేశాయి. లెబనాన్‌లో హెజ్బొల్లాకు చెందిన బలమైన కేంద్రాలను ధ్వంసం చేస్తున్నామని ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. లెబనాన్ నుండి డ్రోన్ దాడులను అడ్డుకుంటున్నట్లు ఇజ్రాయెల్ దళాలు చెబుతున్నాయి.ఇదేసమయంలో ఇజ్రాయెల్ మాజీ ప్రధానమంత్రి ఎహుద్ ఓల్మెర్ట్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, హెజ్బొల్లా ఆయుధాలను నిర్మూలించేందుకు లెబనాన్ కట్టుబడి ఉండటం ఇజ్రాయెల్‌తో సంబంధాల్లో ఒక కొత్త మలుపు కాగలదని అన్నారు. ఒకవేళ పరిస్థితులు విషమిస్తే, లెబనాన్,ఇజ్రాయెల్,అమెరికా,యూరప్ కలిసి హెజ్బొల్లాను నిర్మూలించాలని, కానీ అలాంటి పరిస్థితి ఇంకా రాలేదని అన్నారు.మార్చి రెండో తేదీన లెబనాన్‌పై ఇజ్రాయెల్ భూతల, గగనతల యుద్ధం ప్రారంభించిన తర్వాత ఈనాటి వరకూ లెబనాన్‌లో 2,100 మంది మరణించారు. మరో 1500 మంది గాయపడ్డారు. అదేవిధంగా ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. ఇజ్రాయెల్ దాడులవల్ల లెబనాన్‌లో ఏర్పడిన మానవతా సంక్షోభాన్ని పరిష్కరించాలని లెబనాన్ డిమాండ్ చేస్తోంది. లెబనాన్‌లో యుద్ధం ముగించాలని, హెజ్బొల్లాను నిర్మూలించాలని ఇరుపక్షాలు ఎవరి డిమాండ్లు వారు చేస్తున్నారు. అసలు శత్రుదేశంలో చర్చలు జరపవద్దని లెబనాన్ నాయకత్వంపై హెజ్బొల్లా నాయకులతో పాటు ఇరాన్ కూడా ఒత్తిడి తెస్తున్నది.

## హెగ్సెత్‌పై డెమోక్రాట్ల నేరాభియోగాలు

### అభిశంసన తీర్మాన యత్నాలు



**వాషింగ్టన్:**అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్‌పై ప్రతిపక్ష డెమోక్రాట్లు ఏడు పేజీలతో నేరాభియోగాలు చేశారు. ఆయనపై పార్లమెంటులో అభిశంసన తీర్మానానికి వారు సిద్ధపడుతున్నారు. ఇరాన్‌లో అనధికార యుద్ధం, డ్రగ్స్ బోట్లపై మానవత్వం మరచిపోయి ఘోరమైన దాడులు చేయడం,అధికార దుర్వినియోగం, కాంగ్రెస్‌కు అడ్డుపడటం, సాయుధ బలగాలను రాజకీయాకరణ చేయడం, దుష్ప్రవర్తన వంటి అనేక ఆరోపణలు వారు చేశారు. ఇరాన్ మినాబ్‌లోని పాఠశాలపై దాడిలో 175 మంది పిల్లలు మరణించిన ఘటనను కూడా వారు ఈ అభియోగంగా ప్రముఖంగా ముందుకు తెచ్చారు. ఐతే ఈ అభిశంసన తీర్మానం సభలో వీగిపోతుందా? అందరి ఆమోదం పొందుతుందా? అనే విషయం పక్కన పెడితే, ఖచ్చితంగా ఈ అభిశంసన తీర్మానం ఈ ఏడాదిలో సభలోకి వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే ప్రస్తుతం అటు దిగువసభలో, ఎగువసభలోనూ అధికార రిపబ్లికన్ పార్టీ ఎంపీలే అధికంగా ఉన్నారు. ఈ ఏడాది చివర నవంబరులో జరిగే ద్వైవార్షిక ఎన్నికల్లో గనుక రిపబ్లికన్‌పార్టీ మెజార్టీ కోల్పోతే ఖచ్చితంగా హెగ్సెత్‌పై ఈ అభిశంసన తీర్మానం ప్రముఖంగా చర్చలకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ట్రంప్ చర్యలవల్ల అమెరికాలో రిపబ్లికన్ పార్టీ ప్రజాదరణ కోల్పోయింది. 65 శాతం ప్రజలు అనేక విధాలుగా ట్రంప్‌ను వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం మనకు అవసరం లేని అమెరికన్లు భావిస్తున్నారు. ధరల పెరుగుదల, టారిఫ్‌లు, వలస విధానం, కోర్టులో ట్రంప్‌కు వ్యతిరేకంగా వచ్చిన తీర్పులు, యూరప్ మిత్రులు దూరం కావడం, అంతర్జాతీయ వ్యతిరేకత వంటివన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి.

**ఇజ్రాయెల్‌కు బుల్‌డోజర్లు, బాంబులు**
**రెండు తీర్మానాలకు సెనేట్‌లో ప్రతిఘటన**

ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సరఫరా చేయకూడదని అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టిన రెండు తీర్మానాలు ఆమోదం పొందకుండా వీగిపోయాయి. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా డెమోక్రాట్లు ఎక్కువమంది ఓట్లు వేయలేదు. దీంతో తీర్మానం వీగిపోయింది. గతంలో ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా ఉపసంహరణపై ఎక్కువమంది డెమోక్రాట్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. కానీ ఒకవైపు లెబనాన్‌తో కాల్పుల విరమణ, హెజ్బొల్లా నిర్మూలపై చర్చలు జరుగుతున్న తరుణంలో ప్రవేశపెట్టిన ఈ తీర్మానం వీడిపోయింది. ఇజ్రాయెల్‌కు ఆయుధాల విక్రయాలను నిలిపివేయాలనే విషయంలో ప్రతిపక్ష డెమోక్రాట్స్‌లో చాలా మార్పు వచ్చిందని ఇజ్రాయెల్ పత్రిక వ్యాఖ్యానించింది. 295 మిలియన్ డాలర్లతో బుల్‌డోజర్లు ఇజ్రాయెల్ కొనుగోలు చేసే ఒప్పందానికి అడ్డుకునే తీర్మానానికి 47 మంది డెమోక్రాట్స్‌లో 40 మంది అనుకూలంగా ఓటు వేశారు. 59 మంది రిపబ్లికన్లు మాత్రం ఈ బుల్‌డోజర్లను అడ్డుకునే తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గాజా, వెస్ట్‌బ్యాంక్, లెబనాన్‌లలో ఇళ్ళు కూల్చివేసేందుకు ఈ బుల్‌డోజర్లను ఉపయోగిస్తారని ఈ తీర్మానం ప్రవేశపెట్టిన సాండర్స్ విమర్శించారు. అదేవిధంగా 152 మిలియన్ డాలర్లు విలువైన 1000 పౌండ్ల బాంబులను ఇజ్రాయెల్‌కు విక్రయించడాన్ని అడ్డుకునే మరో తీర్మానానికి 36 మంది ప్రతిపక్ష డెమోక్రాట్లు మాత్రమే మద్దతు తెలియజేయగా, మొత్తంగా చూసినప్పుడు 63 మంది సెనేటర్లు వ్యతిరేకించారు.

## లష్కరే తోయిబా సహ వ్యవస్థాపకుడు

### అమీర్ హమ్జాపై కాల్పులు



**లాహోర్:** లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ సహ వ్యవస్థాపకుడు, ఆ సంస్థలో పేరుమోసిన ఉగ్రవాద నాయకుడు అమీర్ హమ్జాపై గుర్తు తెలియని వ్యక్తులు కొందరు లాహోర్‌లో కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన హమ్జా చావు బ్రతుకులమధ్య కొట్టామిట్టాడుతున్నాడు. అతడిని ఆసుపత్రికి తరలించారు. ఒక న్యూస్ ఛానల్ కార్యాలయం వెలుపల అతడిపై కొందరు కాల్పులు జరిపి పారిపోయారు. ఒక్క ఏడాదికాలంలోనే హమ్జాపై రెండోసారి కూడా కాల్పులు జరిగాయి. గత ఏడాది మే నెలలో అతడి ఇంటివద్దనే కొందరు ఆయనపై కాల్పులు జరిపారు. ఈ ఘటన నుండి హమ్జా కోలుకుని బయటపడ్డాడు. అప్పటి నుండీ అతడి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. 1959లో గుజ్రన్‌వాలాలో జన్మించిన హమ్జా అఫ్ఘనిస్థాన్ జీహదీ ప్రముఖుడు, లష్కరే వ్యవస్థాపకులలో ఒకడు.

## సీట్లు 815కి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ సభ్యుల సంఖ్య 815కు పెరుగుతుంది, ఇందులో మహిళల కోటా కింద 272 స్థానాలు ఉంటాయి అని మంత్రి తెలిపారు. ప్రతిపాదిత చట్టాల ప్రకారం, లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్యలో 50 శాతం పెరుగుదల ఉంటుందని, మహిళల కోటా అమలు తర్వాత పురుషులకో లేదా ఏ రాష్ట్రానికో ఎటువంటి నష్టం వాటిల్లదని ఆయన అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలోని మహిళల కోటాలో భాగంగానే, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన మహిళలకు కూడా రిజర్వేషన్ ఉంటుందని మేఘవాల్ తెలిపారు. 'నారీ శక్తి వందన్ అధినియం, 2023' ప్రస్తుత రూపంలోనే కొనసాగితే, 2029లో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు నియోజకవర్గాల రిజర్వేషన్ కల్పించడం సాధ్యం కాదని మంత్రి పేర్కొన్నారు. ఎందుకంటే ఇది 2026 తర్వాత అందుబాటులోకి వచ్చే జనాభా గణన వివరాలపై ఆధారపడి ఉంటుంది. అందుకే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. మహిళలకు వారికి దక్కాల్సిన హక్కులను కల్పించడమే ఈ బిల్లు యొక్క ప్రధాన ఉద్దేశ్యమని మేఘ్‌వాల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలతో పోలిస్తే, భారతదేశంలోనే మహిళలకు సమాన ఓటు హక్కు చాలా ముందుగానే కల్పించబడిందని మేఘవాల్ తెలిపారు. అమెరికాలో పురుషులకు ఓటు హక్కు లభించిన 144 సంవత్సరాల తర్వాతే మహిళలకు ఓటు హక్కు లభించిందని, అలాగే యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)లో 1918లో కొన్ని షరతులతో మహిళలకు ఓటు హక్కు కల్పించారని, ఆ తర్వాత పదేళ్లకు అంటే 1928లో మాత్రమే వారికి పూర్తిస్థాయి ఓటు హక్కు లభించిందని ఆయన వివరించారు. భారతదేశంలో మాత్రం, మొదటి ఎన్నికల నుంచే పురుషులతో పాటే మహిళలకు ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపి, సభలో ఆమోదించాలని మేఘ్వాల్ అన్ని పార్టీలకు, సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## డీలిమిటనేషన్ బుల్డోజ్

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. దాని అర్థం ఏమిటంటే, మీరు వాస్తవానికి మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా లేరు, పదేపదే అడ్డంకులు సృష్టిస్తున్నారని గొగోయ్ ఆరోపించారు. బిజెపి ప్రతీకాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఈ మూడు బిల్లులు మహిళా రిజర్వేషన్ల కోసం కాదని, దొడ్డిదారి పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజనను పూర్తి చేయడానికేనని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనను బలవంతంగా ముందుకు నెడుతోందని గొగోయ్ ఆరోపించారు. గతంలో బిజెపి తన రాజకీయ ఆశయాలను నెరవేర్చుకోవడానికి నియోజకవర్గాల పునర్విభజనను ఒక ఆయుధంగా ఉపయోగించుకుందని ఆ కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. 'మా పార్టీ మహిళా రిజర్వేషన్లకు అనుకూలమే, కానీ మీరు దీనిని సరళంగా రూపొందించాలి. దీనిని సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య (543) ఆధారంగానే అమలు చేయాలి తప్ప, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టకూడదు' అని గొగోయ్ స్పష్టం చేశారు. 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తే తమ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే దీనిని నియోజకవర్గాల పునర్విభజనతో మాత్రం అనుసంధానించకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కుల గణనకు అనుకూలంగా లేదని, దానిని అమలు చేయడానికి ఇష్టపడటం లేదన్నదే తమకున్న మరో సందేహమని ఆయన తెలిపారు.ప్రభుత్వం రాజ్యాంగాన్ని క్రమంగా బలహీనపరుస్తోందని గొగోయ్ ఆరోపించారు.న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌పై పరోక్ష విమర్శలు చేస్తూ, మహిళా రిజర్వేషన్ల బిల్లు గురించి చర్చించడం, దానిని పరిశీలించడం ఇదే మొదటిసారి అన్నట్లుగా మంత్రి ప్రసంగం ఉందని గొగోయ్ వ్యాఖ్యానించారు.

## 'కపట నాటకం'గా వాడుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. మూడు బిల్లులను కలిపి ముందుకు తీసుకెళ్లడం కోసం రూల్ 66ను నిలిపివేయాలని కోరుతూ ప్రభుత్వం పార్లమెంట్‌పై ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు. ఈ దుష్ట, సమాఖ్య వ్యతిరేక విభజనకు వ్యతిరేకంగా వేసే ఏ ఓటైనా ఈ చర్యను మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వేసిన ఓటుగా చిత్రీకరించేలా చేస్తున్నారని రాజా మండిపడ్డారు. దీనిని ఒక 'దుష్ట రాజకీయ కుట్ర'గా ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశ రాజకీయ, భౌగోళిక స్వరూపాన్ని మార్చి అధికారాన్ని కేంద్రీకరించి, తద్వారా దక్షిణ, చిన్న ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు నష్టం కలిగించేందుకు బిజెపి మహిళా కోటాను ఒక 'కపట నాటకం'గా వాడుకుంటోందని సిపిఐ అగ్రనేత ఆరోపించారు. దశాబ్దకాలంపాటు మహిళా రిజర్వేషన్‌ను నిలిపివేసి, దాని తీవ్రతను తగ్గించి, ఇప్పుడు తన అజెండాను బలవంతంగా రుద్దడానికి పార్లమెంటరీ నిబంధనలను వక్రీకరిస్తున్న ప్రభుత్వం మహిళా వ్యతిరేకమైనదని ప్రజలు ఈ కుట్రను గ్రహించి, నిజాన్ని గుర్తించాలన్నారు. జనాభా గణన, మహిళా సంక్షేమం విషయంలో వెనకబడిన రాష్ట్రాలలో వివక్ష చూపడం అనేది, ఆరాష్ట్రాలలో, దేశవ్యాప్తంగా మహిళల పట్ల చూపుతున్న పూర్తిస్థాయి వివక్షేనని, దీనిని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి ఎం.ఏ.బేబీ మాట్లాడుతూ శాసనసభల్లో మహిళా రిజర్వేషన్లను అమలుచేయడానికి ఇప్పటికే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించిన గత ప్రయత్నాలకు ప్రస్తుత ప్రతిపాదన భిన్నంగా ఉందని ఆరోపించారు. గీతా ముఖర్జీ నివేదికను ప్రస్తావిస్తూ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే విషయలో మనం ఎలా ముందుకు వెళ్లాలనే విషయం ఆ నివేదికలో స్పష్టంగా ఉందని బేబీ పేర్కొన్నారు. 2010లో రాజ్యసభ ఆమోదించిన రాజ్యాంగ సవరణను ముందుకు తీసుకెళ్లి ఉండవచ్చని గుర్తుచేశారు. అదే నిర్మాణాన్ని అనుసరించి ఉండవచ్చని, మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టే ముసుగులో ప్రభుత్వం తీసుకుంటున్న ప్రస్తుత చర్య చాలా కుటిలమైన ప్రయత్నమని సిపిఐ(ఎం) అగ్రనేత ఆరోపించారు.

## 195కి పెరుగుతాయ్

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. ''తెలంగాణలో ప్రస్తుత లోక్‌సభ సీట్లు 3.13శాతంగా ఉన్నాయి. 26కు పెంచాక మొత్తం సీట్లలో తెలంగాణ శాతం 3.18కు పెరుగుతుంది. దక్షిణాదిలో మొత్తం ఎంపి స్థానాలు 129 (23.76శాతం) నుంచి 195 (23.97శాతం)కు పెరుగుతాయి. దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుందో సభ్యులు చెప్పాలి. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. మొత్తం సీట్లలో 33శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయి. జనరల్ స్థానాల్లోనూ మహిళలకు అవకాశమిస్తే వారి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది'' అని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు జనాభా లెక్కల్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, ఇటీవల ప్రారంభమైన జనాభా గణన ప్రక్రియ 2027 నాటికి పూర్తవుతుందన్నారు. అలాగే, కుల గణన కూడా చేపడతామన్నారు. అయితే, మతం ఆధారంగా సీట్లు కేటాయించడం, చట్టసభలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగా వ్యతిరేకం అన్నారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం అంగీకరించబోదన్నారు.

## తక్షణమే అమలుచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, సంబంధిత వర్గాలతో సంప్రదించకుండా ఆమోదించరాదని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నాయిమహిళా రిజర్వేషన్ల అమలుకు పొందపర్చిన అన్ని సవరణలను తిరస్కరిస్తున్నట్లు జాతీయ మహిళా సంఘాలు ప్రకటించాయి.ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశాయి. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం కోసం 30 ఏళ్లకు పైగా సాగిన నిరంతర పోరాటం ఫలితమని పేర్కొన్నారు. దీనినినీరుగార్చడం గానీ, వాయిదా వేయడం గానీ సాధ్యం కాదని,అమలుకు ముందస్తు షరతుగా ఈ దశలో హడావిడిగా సీట్లను పెంచాలన్న ఏ ప్రతిపాదననూ తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు.పెంచిన సీట్లను ఎలా విభజిస్తారనే దానిపై స్పష్టత లేదని, ఇలాంటి చర్య అధికార పార్టీల పితృస్వామ్య మనస్తత్వానికి స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. ఇది మహిళా ప్రాతినిధ్యాన్ని కల్పించకుండా వాస్తవంగా సాకారం చేయడాన్ని వాయిదా వేయడానికి వేసిన ఎత్తుగడ అన్నారు. .మహిళా రిజర్వేషన్‌కు జనాభా లెక్కలతో సంబంధం లేదని, అందువల్ల, రిజర్వేషన్ల అమలును ఎప్పుడో జరగబోయే జనాభా లెక్కలతో ముడిపెట్టడం అనిశ్చితిని సృష్టించి, నిరవధిక జాప్యాలకు దారితీస్తుందని తెలిపారు.ఈ దేశ మహిళలు శాసనసభలలో తమ న్యాయమైన హక్కు కోసం చాలా కాలంగా తీవ్ర పోరాటాలు చేస్తున్నామని, మరోసారి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, నిర్ణయాధికార సంస్థలలో మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ఎన్నికల ప్రయోజనాలు పొందేందుకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు.సెప్టెంబర్ 2025లో మోదీ ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని పిలిచి, బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు వివరాలు వెల్లడించకుండానే ఎస్ఎస్‌విఎను ఆమోదించిందని, ఇప్పుడు సవరణ బిల్లును తీసుకురావడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం మరోసారి ఏర్పాటు చేసిందన్నారు. ఈ కొత్త బిల్లు, జనగణన, డీలిమిటేషన్‌కు సంబంధించిన ముందు నిబంధనలలో సవరణలను ప్రతిపాదించడం ప్రభుత్వ ఉద్దేశం స్పష్టమైందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లపై స్టాండింగ్ కమిటీకి అధ్యక్షత వహించిన మాజీ ఎంపి గీతా ముఖర్జీ, ఈ బిల్లు ఆమోదం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని, ఈ బిల్లును వ్యూహాత్మకంగా కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయాలని చూస్తోందన్నారు. అయితే ఈ చారిత్రాత్మక పోరాటాన్ని తాము వృథా కానివ్వబోమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును యథావిధిగా ఆమోదించడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, రిజర్వేషన్లను చేర్చడంతో పాటు ఒబిసి మహిళల రిజర్వేషన్ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాని డిమాండ్ చేశాయి. మహిళా రిజర్వేషన్ జనాభాపై ఆధారపడి ఉండదు కాబట్టి, డిలిమిటేషన్‌తో దీనిని ముడిపెట్టడం పూర్తిగా తప్పని, మహిళా రిజర్వేషన్ అనేది ఒక ప్రత్యేకమైన అంశం, దీనిని ఇతర అజెండాల నుండి వేరు చేయాలన్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా సంబంధిత వర్గాలన్నిటితో సంప్రదింపులు జరపాలని తొందరపాటుతో బిల్లును ఆమోదించే ప్రయాత్నాని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి.

## కోర్టుకు హాజరైన ఐఎఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీశైలం ప్రాజెక్టు నుంచి చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాలకు మిషన్ భగీరథ కింద తాగునీటి పథకాల నిర్మాణం, నిర్వహణకు సంబంధించి ఎన్‌సిసికి చెల్లించాల్సిన రూ.180 కోట్ల బకాయిలను ఈనెల 23లోగా 30 శాతం చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు చెప్పింది. ఈ మేరకు స్వయంగా హైకోర్టుకు హాజరైన ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా తెలియజేశారు. ఈ హామీని అమలు చేయకపోవతే తదుపరి విచారణకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు. అమలు చేస్తే హాజరు నుంచి మినహాయింపునకు అనుమతించారు. విచారణను 28కి వాయిదా వేశారు.

## లోక్‌సభలో వాడీవేడి చర్చ

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుని, ముప్పదేళ్లుగా కొలిక్కిరాని మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించటాన్ని గుర్తుచేశారు. దాని అమలును ముందుకు తెస్తుంటే కుశంకలు సరికాదన్నారు. మహిళలను అభివృద్ధి, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యుల్ని చేయాలన్నారు. మహిళలకు రిజర్వేషన్‌ను వ్యతిరేకించిన పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అందువల్ల తాజా బిల్లుల ఆమోదానికి అందరి సహకారం కోరారు. బిల్లులు ప్రవేశపెట్టడంపై 40 నిమిషాల పాటు వాడివేడిగా చర్చ జరిగింది. అనంతరం రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును ప్రవేశపెట్టేందుకు ఓటింగ్ జరపాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఆ తర్వాత 251 మంది సభ్యులు మద్దతు తెలపగా, 185 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. మహిళా కోటా చట్టంలో ప్రతిపాదిత మార్పులను, పార్లమెంటు గతంలో ఆమోదించినప్పుడే ఎందుకు చేర్చలేదని కాంగ్రెస్ నాయకుడు కె.సి. వేణుగోపాల్ ప్రశ్నించారు. 'మహిళా కోటా చట్టంలో మార్పులు చేసేందుకు, డీలిమిటేషన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన బిల్లులు రాజ్యాంగ విరుద్ధం' అని ఆయన అన్నారు. బిల్లులను ప్రవేశపెట్టడంలో ఎందుకంత తొందరపాటు అని సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. 'శాసనసభలో మహిళా కోటాకు మేం మద్దతు ఇస్తాం, కానీ జనగణన ఎందుకు నిర్వహించరు? అని ఆయన ప్రశ్నించారు. 2027 జనగణన కొనసాగుతోందని, కుల గణన చేపట్టాలని కేంద్రం కూడా నిర్ణయించిందని, కానీ మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎదురుదాడికి దిగారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణలకు నిరసనగా లోక్‌సభలో డిఎంకె సభ్యులు నల్ల దుస్తులు ధరించి ప్రదర్శన చేశారు. '2023 మహిళా కోటా చట్టానికి మేం అనుకూలంగా ఉన్నాం, కానీ ప్రస్తుత బిల్లు నియోజకవర్గాల పునర్విభజన కోసమే ఉద్దేశించబడింది' అని డిఎంకెకు చెందిన టి.ఆర్.బాలు అన్నారు. మహిళా కోటా చట్ట సవరణ రిజర్వేషన్ల కోసం కాదని, నియోజకవర్గాల పునర్విభజన కోసమేనని ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ వ్యతిరేకించారు. రాజ్యాంగ సవరణ బిల్లును ఇతర సాధారణ బిల్లులతో కలిపి చర్చించలేమని వేణుగోపాల్ అన్నారు. అయితే, అలా చేయవచ్చని చెబుతూ షా ఆయన అభ్యంతరాన్ని తోసిపుచ్చారు. రాజ్యాంగ సవరణ బిల్లు, ఇతర బిల్లులు ఒకే విషయానికి సంబంధించినవి కాబట్టి, వాటిపై కూడా చర్చించవచ్చని స్పీకర్ ఓం బిర్లా పూర్వపు తీర్పులను ఉదహరించారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ప్రకారం, 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను అనుసరించి, 2029 పార్లమెంటరీ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి లోక్‌సభ సీట్లను ప్రస్తుత 543 నుండి గరిష్టంగా 850కి పెంచనున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభలలో కూడా సీట్లను పెంచనున్నారు. కాగా, శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్‌కు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూనే, రాజ్యాంగ సవరణ బిల్లులోని పునర్విభజన నిబంధనలకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఐక్యంగా ఓటు వేయాలని బుధవారం పలు ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి.

## సీట్ల నిష్పత్తి తగ్గదు

(మొదటి పేజీ తరువాయి)

పదం వాడమంటే, నేను 'హామీ' అనే పదాన్ని వాడతాను. వాగ్దానం చేయమంటే, 'వాగ్దానం' అనే పదాన్ని వాడతాను. ఎందుకంటే ఉద్దేశం స్పష్టంగా ఉన్నప్పుడు, మాటలతో ఆటలు ఆడాల్సిన అవసరం లేదు,' అని ఆయన అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై, ముఖ్యంగా దక్షిణ, తూర్పు ప్రాంతాల రాష్ట్రాల్లో నెలకొన్న భయాన్ని తొలగిస్తూ, ఈ చర్య వల్ల ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపబడదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'దక్షిణం, ఉత్తరం, తూర్పు, పశ్చిమం, చిన్న రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాలు అనే తేడా లేకుండా, ఈ నిర్ణయ ప్రక్రియ ఏ రాష్ట్రానికీ వ్యతిరేకంగా వివక్ష చూపదు లేదా ఎవరికీ అన్యాయం చేయదు అని ఈ సభ తరఫున గొప్ప బాధ్యతా భావంతో చెప్పాలనుకుంటున్నాను' అని ఆయన అన్నారు. గతంలో మహిళలకు ఈ హక్కు కల్పించడాన్ని వ్యతిరేకించిన వారిని, ఈ దేశ మహిళలు క్షమించలేదని, వారు తగిన పర్యవసానాలను ఎదుర్కొన్నారని మోదీ అన్నారు. 'దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు మనల్ని గమనిస్తున్నారు; వారు మన నిర్ణయాలను చూస్తారు. అయితే, కేవలం నిర్ణయం కంటే కూడా, వారు మన ఉద్దేశాన్ని బేరీజు వేస్తారు. మన ఉద్దేశంలో ఏమాత్రం లోపం ఉన్నా, ఈ దేశ మహిళలు మనల్ని ఎప్పటికీ క్షమించరు' అని ఆయన పేర్కొన్నారు.

**మోదీ ప్రసంగంలో డీలిమిటేషన్ ప్రస్తావన లేదు : కాంగ్రెస్**

మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ తన ప్రసంగంలో నియోజకవర్గాల పునర్విభజన అనే కీలక అంశం మినహా మిగతా అన్ని విషయాలపై మాట్లాడారని ఎద్దేవా చేసింది. దక్షిణాది, తూర్పు, ఈశాన్యం, ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల ఆందోళనలను తన ప్రసంగంలో మోదీ ఉద్దేశపూర్వకంగా విస్మరించారని ఆరోపించింది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులపై ఓటింగ్‌కు పెట్టినప్పుడు అది వీగిపోతుందని తెలిపింది. రాజ్యాంగాన్ని అణగదొక్కడానికి, వ్యవస్థను హైజాక్ చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత ప్రయత్నం లోక్‌సభలో నిస్సందేహంగా ఓటమిని చవిచూస్తుందని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

# ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి



## మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్తాన్ విభనతో పోల్చిన ఎంపి తేజస్వి సూర్య పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి బర్తరఫ్ చేయాలని కోరుతూ స్పీకర్ ఓం బిర్లాకు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. తేజస్వి వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలని కోరారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తెలంగాణపై బిజెపి ఎంపి తేజస్వి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అమరవీరులకు అవమానపరచడమే కాదు ఉద్యమస్ఫూర్తికి విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. లోక్ సభ , రాజ్యసభలో పాస్ చేసిన బిల్లులను అవమానపరుస్తుంటే తెలంగాణ నుండి ఎంపికైన 8 మంది బిజెపి పార్లమెంట్ సభ్యులు చీము నెత్తురు లేకుండా వాటిని వింటూ ఎంజాయ్ చేసే దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్,లక్ష్మణ్ మిగిలిన ఎంపిలు తెలంగాణ బిడ్డలు అయితే తెలంగాణ తల్లిని అవమానపరుస్తుంటే చూస్తూ ఊరుకుకోవడమంటే తల్లికి ద్రోహం చేయడమే అన్నారు. గతంలో హోం మంత్రి అమిత్ షా, ఇటివల టిడిపి ఎంపి, ఇప్పుడు బిజెపి ఎంపి తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా రాష్ట్రం నుంచి ప్రతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన తెలంగాణపై ఇంత అక్కసు వివక్ష మంచిది కాదని, ప్రజాస్వామిక ఫెడరల్ విధానంలో ఏర్పడిన తెలంగాణ విభజనను అవహేళన చూస్తుంటే ఇక్కడి బిజెపి ఎంపిలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నరన్నారు .బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బిజెపి ఎంపిలు ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే మంచిది కాదని, తెలంగాణ ఏర్పాటును అవమానపరుస్తుంటే వారికి చట్ట రీత్యా బుద్ధి చెప్పాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు టి.కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపి వ్యాఖ్యలు అజ్ఞానానికి పరాకాష్ట: జూపల్లి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్ పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం.. అనేది వందలాది మంది యువకుల బలిదానాలు, దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితం. రాజ్యాంగ బద్ధంగా పార్లమెంటు ఆమోదించిన ప్రక్రియను దేశ విభజనతో పోల్చడం ఎంపి అజ్ఞానానికి పరాకాష్ట. గతంలో ప్రధాని మోదీ కూడా 'తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు' అని మాట్లాడారు. ఆ విద్వేష భావజాలమే ఇప్పుడు ఎంపి తేజస్వీ సూర్య మాటల్లో ప్రతిబింబిస్తోంది అని మంత్రి దుయ్యబట్టారు. తక్షణమే సూర్య తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని మంత్రి హెచ్చరించారు.

### అమరులను బిజెపి అవమానిస్తోంది : ఇటి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య తక్షణమే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహా డిమాండ్ చేశారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా తెలంగాణ ఏర్పాటును కించపర్చుతూ తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణపై అక్కస్‌ను వెలగక్కగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై పదేపదే బిజెపి నాయకులు తీవ్రమైన విమర్శలు చేయడమే కాకుండా తమ వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును కోరుతూ వేలాదిమంది తమ జీవితాలను త్యాగాలు చేశారని, తిరిగిరాని తమ ప్రాణాలను తృణప్రాయంగా రాష్ట్ర సాధన కోసం అర్పించిన అమరవీరులను బిజెపి అవమానపర్చుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో సాధారణ ప్రజలు భూస్వాములకు వ్యతిరేకంగా వెట్టి చాకిరీ రద్దు చేయాలని దొరగడీలను కూల్చుతూ సాయుధ పోరాటం ద్వారా సమరశీల ఉద్యమాన్ని నడిపి తెలంగాణను విముక్తి చేశారని, ఇంతటి త్యాగాలతో కూడిన తెలంగాణ చరిత్ర తెలియని బిజెపి మూర్ఖులు చేస్తున్న వ్యాఖ్యలపై ప్రజలందరూ రోడ్ల మీదకు వచ్చి తమ నిరసన గళాన్ని విప్పాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కోట్లాది రూపాయలు పన్నులు కేంద్రానికి కడుతున్నప్పటికీ రాష్ట్రాలకు కేటాయిస్తున్న నిధులలో తెలంగాణకు అతి తక్కువ నిధులు కేటాయిస్తూ వివక్షకు గురిచేసినప్పటికీ ఇక్కడనుంచి ప్రతినిధ్యం వహిస్తున ఇద్దరు కేంద్ర మంత్రులు 6 మంది ఎంపిలు కనీసం నోరు విప్పకుండా ప్రధాని మోదీకి గులాంగిరిగా ఉంటూ తమ బానిసత్వాన్ని ప్రదర్శించుకోవడం అత్యంత సిగ్గుచేటు అని విమర్శించారు. భూస్వాముల, మతోన్మాద రాజకీయ ప్రతినిధులైన బిజెపి, ఎంఐఎం లాంటి పార్టీలు మత విద్వేషాలకు రెచ్చగొడుతూ తమ రాజకీయ ప్రాబల్యాన్ని కాపాడుకుంటున్నారన్నా రు. బిజెపి నాయకులు , కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేకపోతే భవిష్యత్తులో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఈటి నరసింహా హెచ్చరించారు.

### విద్వేషపూరిత విభజనతో పోల్చడం చరిత్రను అవమానించడమే : హరీశ్‌రావు

రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలవడాన్ని బిజెపి తట్టుకోలేకపోతుందనేందుకు ఆ పార్టీకి చెందిన ఎంపి తేజస్వీసూర్య చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలే నిదర్శనమని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించినందుకు తేజస్వీ సూర్య క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశా రు. బిజెపి అధిష్టానం వెంటనే ఈ వ్యాఖ్యలను ఖండిం చి, దీనిపైన తన పార్టీ వైఖరిని స్పష్టం చేయాలని, లేదం టే ఇది బిజెపి అధికారిక ధోరణిగానే ప్రజలు భావిస్తారని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇండియా, పాకిస్థాన్ విభజన లాంటిదే అయితే ఆనాడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విభజన బిల్లుకు బిజెపి ఎందుకు మద్దతుగా నిలిచిందని ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితమని గుర్తు చేశారు. అలాంటి మహోన్నత ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం చరిత్రను అవమానించడమేనని, అమరుల త్యాగాలను తక్కువ చేసి చూపించడమేనని అన్నారు.

# జనాభా దామాషా ప్రకారం చట్ట సభల్లో మహిళలకు ప్రాతినిధ్యం ఉండాలి

**33% మహిళా రిజర్వేషన్ల బిల్లులో 2026 జనగణన ఆధారంగా తీసుకోవాలి • ఎన్ఎఫ్ఐడబ్ల్యు తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జనాభా దామాషా ప్రకారం చట్ట సభలలో మహిళల ప్రాతినిధ్యం ఉండాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) నాయకురాలు, ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంటేరియన్ గీతా ముఖర్జీ నిర్వహించిన పోరాటాల ఫలితమే నారీ శక్తి వందన్ ఆదినీయం మహిళా రిజర్వేషన్ బిల్లు అని ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, అధ్యక్షురాలు ఉస్తెల సృజన, కార్యనిర్వహక అధ్యక్షురాలు ఎం.సదాలక్ష్మి అన్నారు. హైదరాబాదులోని హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద గురువారం మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణలను వ్యతిరేకస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ జనాభా లెక్కలు 2011 కాకుండా 2026 జనాభా ఆధారంగా తీసుకోవడంతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సి, ఎస్‌టి కోటా మాదిరిగా ఒబిసిలకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్ బిల్లును జత కట్టడం సరైందికాదని పేర్కొన్నారు, పురుషాధిపత్యానికి నష్టం జరగకుండా బిజెపి ప్రభుత్వం రాజకీయ కుట్రలో భాగంగా 50 శాతం సీట్లు పెంచి 33శాతం మహిళా రిజర్వేషన్ కల్పించడం ఆక్షేపణీయమని, ప్రస్తుతము ఉన్న సీట్లలోనే 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉస్తెల సృజన మాట్లాడుతూ నియోజకవర్గాలు పునర్విభజనలో 50శాతం పెంచి జనాభాలో 50 శాతం ఉన్న మహిళా లోకానికి 33శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయమన్నారు. ఐదు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు ఉన్నందునే కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ లబ్ధి కోసం కనీసం ప్రతిపక్షాలతో గాని, మేధావులతోగాని చర్చించకుండానే ఏకపక్షగా మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టి ఆమోదించుకునేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజిస్తే ఇది జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారుతుందన్నారు. ఎం.సదాలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2023 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చేదన్నారు. పార్లమెంట్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపక్షాలతో సంప్రదించి మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా న్యాయబద్ధంగా సీట్ల పెంపు మహిళా రిజర్వేషన్ కోటా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి.ఫైమీద, కోశాధికారి జె.లక్ష్మి , కౌన్సిల్ సభ్యులు ఉజ్జిని హైమావతి, రొయ్యల గిరిజ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను ఆపండి

## లేదంటే సమ్మె తప్పదు
## ప్రభుత్వాన్ని హెచ్చరించిన ఎఐటియుసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు ప్రభుత్వంలో ఆర్‌టిసిని వెంటనే విలీనం చేసి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆర్‌టిసి కార్మికుల సమ్మెను నివారించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021 సంవత్సరం వేతన సవరణ 30శాతం ఫిట్మెంట్ వెంటనే అమలు చేయాలని వారు కోరారు. ఆర్‌టిసిలో మహాలక్ష్మి పథకం పేరుతో ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.350 కోట్లను ఎలాంటి మినహాయింపు లేకుండా ఆర్‌టిసికి జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. సంక్షేమ పాలనలో భాగంగా పాత బకాయిలను రూ.2500కోట్లను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ట్రేడ్ విన్నర్ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని తక్షణమే పర్మినెంట్ చేయాలని వారు కోరారు. ట్రేడ్ యూనియన్లపై, వాటి కార్యక్రమాలపై చట్టబద్ధమైన కార్మిక హక్కులను కాపాడేందుకు, ట్రేడ్ యూనియన్లపై వాటి కార్యక్రమాలపై ప్రభుత్వ ఆంక్షలు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు వారికి అప్పచెప్పకుండా, ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వాలే కొనుగోలు చేయాలని వారు కోరారు. ఆర్‌టిసిలో మహిళా కార్మికులను జనరల్ షిప్టులలో కొనసాగించాలని, రాత్రి 11 గంటల వరకు పనిచేసి డిపోల వద్ద తమ గమ్య స్థానాలకు వెళ్ళేందుకు రవాణ సౌకర్యం ఆర్‌టిసి కల్పించక అవస్థలు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి యాజమాన్యం బస్సుల సంఖ్యను, డిపోలలో సిబ్బందిని పెంచి ఆర్‌టిసి బస్సులను నడుపాలని, తక్షణమే ఖాళీ పోస్టులలో నూతన సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. జీవిత కాలం ఆర్‌టిసికి సేవలు అందించి వృద్ధాప్యంలో పదవి విరమణ పొందితే, రిటైర్మెంట్ డే నాడే అన్ని సర్వీస్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని వారు కోరారు. పదవీ విరమణ పొంది హయ్యర్ పెన్షన్ చెల్లించకుండా రిజెక్టు అయిన వారందరికి ప్రభుత్వం, యాజమాన్యం హయ్యర్ పెన్షన్ పొందేందుకు మరో అవకాశం ఇచ్చి కార్మికులకు మేలు చేయాలని వారు కోరారు.న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించకుంటే రాష్ట్రంలోని ఆర్‌టిసి డిపోలలో, బస్టాండ్లలో నిరవధిక సమ్మె 22 ఏప్రిల్ నుండి కొనసాగుతుందని వారు ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలను ఏకంచేసి ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా, అండగా నిలబడి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

# కౌలు రైతులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలి

## ప్రజా సంఘాల నాయకులు, మేధావులు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కౌలు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు, పలువురు మేధావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2011 చట్టం అమలు చేసి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో గురువారం వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులతో విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈసమావేశంలో ప్రొఫెసర్ . హరగోపాల్, ప్రొ. కోదండరామ్, జస్టిస్ చంద్రకుమార్, కొండవీటి సత్యవతి (భూమిక), పి.శంకర్ (దళిత బహుజన ఫ్రంట్), ప్రొఫెసర్. అరిబండి ప్రసాదరావు (తెలంగాణ రైతు సంఘం), అంబటి నాగయ్య (తెలంగాణ విద్యావంతుల వేదిక), రవిచందర్ (తెలంగాణ పీపుల్స్ జెఎసి), మీరా సంఘమిత్ర (ఎన్‌ఎపిఎం), ఎం. ఆంజనేయులు (సోషల్ డెమోక్రటిక్ ఫోరం), సోమిడి శ్రీనివాస్ (తెలంగాణ రైతు సంఘం), జక్కుల వెంకటయ్య (తెలంగాణ రైతాంగ సమితి), ఎం.స్వప్న (స్వర భారతి మహిళా సంఘం,), ఈశ్వరమ్మ (తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్), కె.అమృత, దాసరి శ్రీనివాస్ (దళిత బహుజన శ్రామిక యూనియన్), ఎం.జనార్ధన్ (పిలుపు), సంగెపు బొర్రన్న , సదానందం (ఆర్‌ఎస్‌వి)చుక్కమ్మ (డిడిఎస్ మహిళా రైతుల సంఘం), డా. శరత్ బాబు (వ్యవసాయ శాస్త్రవేత్త), న్యాయవాది మహమ్మద్ సాదిక్ అలీ, రైతు స్వరాజ్య వేదిక నాయకులు బి. కొండల్, కన్నెగంటి రవి, ఎస్. ఆశాలత, విస్సా కిరణ్ కుమార్, శ్రీ హర్షలు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా వ్యక్తలు మాట్లాడు తూ తెలంగాణలో 22 లక్షలకు పైగా ఉన్న కౌలు రైతులు (36 శాతం) ఉన్నారని, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందక అత్యంత దుస్థితిలో ఉన్న వీరంతా అప్పులలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలలో 80 శాతం కౌలు రైతులవేనని, దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి, గ్రామ సభల ద్వారా నిర్ధారణ చేసి గుర్తింపు కార్డులు (ఎల్.ఈ.సి.) ఇచ్చి అన్ని పథకాలకు, పంట ఋణాలకు అర్హత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

# అలెన్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

## కోచింగ్ సెంటర్ పేరుతో ఇంటర్ తరగతులను నిర్వహిస్తున్న కళాశాలను సీజ్ చేయాలి : ఎఐవైఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ కోచింగ్ పేరుతో అక్రమంగా ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహిస్తున్న అలెన్ విద్యాసంస్థపై చర్యలు తీసుకుని , ఇంటర్ బోర్డు అధికారులు తక్షణమే ఈవిద్యాసంస్థను సీజ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. గురువారం ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని అనధికారికంగా తరగతులను నిర్వహిస్తున్న అలెన్ విద్యాసంస్థ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ కోచింగ్ సెంటర్ పేరుతో విద్యార్థులను ఆకర్షించి, ఇంటర్మీడియట్ విద్యను పరోక్షంగా నిర్వహించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ముఖ్యంగా నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ వేసవి కాలంలో కూడా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఉదయం నుంచి సాయంత్రం వరకు క్లాసుల్లో ఉంచుతూ, అసలు జూనియర్ కళాశాల హాజరు కేవలం కాగితాలపై మాత్రమే చూపించే డమ్మీ కాలేజీ విధానాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. అలెన్‌పై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, డమ్మీ కాలేజీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, సమితి సభ్యులు కాంపల్లి కళ్యాణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'దేశ్ తోడో' యాత్ర చేస్తోంది

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాహుల్ గాంధీ 'దేశ్ జోడో' అంటుంటే, రేవంత్ రెడ్డి 'దేశ్ తోడో' యాత్ర చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో దేవెగౌడ, మన్మోహన్ సింగ్ హయాంలో మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలు, ఇప్పుడు ప్రధాని మోదీకి క్రెడిట్ వస్తుందనే భయంతో అడ్డంకులు సృష్టిస్తున్నాయన్నారు. 1996లో కేవలం జనాభా ప్రాతిపదికన బిల్లు తేవాలని చూశారని, కానీ ఇప్పుడు రాహుల్ గాంధీ ఓబిసి కోటా పేరుతో కొత్త పల్లవి అందుకుంటున్నారని విమర్శించారు. గతంలో ములాయం సింగ్ యాదవ్ వంటి నేతలు మహిళలను కించపరిచేలా మాట్లాడినా కాంగ్రెస్ మౌనంగా ఉందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తరాది కంటే దక్షిణాదిలోనే సీట్ల సంఖ్య ఎక్కువగా ఉందని, పెంపు తర్వాత కూడా అదే నిష్పత్తి కొనసాగుతుందన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో సీట్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందా లేదా అని ఆయన ప్రశ్నించారు. జిఎస్‌డిపి ఆధారంగా సీట్లు పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదన హాస్యాస్పదమని, మద్యం ఆదాయంతో సీట్లు పెంచుతారా అని ప్రశ్నిం చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన, ఎన్యూమరేషన్ ప్రక్రియ అంతా త ప్పుల తడకగా ఉందని రాంచందర్ రావు ఆరోపించారు. కేవలం ఎంఐఎం, ము స్లిం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే కాంగ్రెస్ పాకులాడుతోందని విమర్శించారు. ఈ ఇష్టాగోష్టిలో రాంచందర్ రావుతో పాటు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్ తదితరులు ఉన్నారు.

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం,గూడెం గుట్ట.**
గూడెం గ్రామం, దండేపల్లి మండలం, మంచిర్యాల జిల్లా.
Rc. No.76/2026 — సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము ప్రకటన-2 — తేదీ: 16.04.2026
ఈ క్రింద తెలిపిన టెండర్ హక్కుల గూర్చి తేదీ: 27.04.2026 రోజున ఉదయం 10:00 గంటల నుండి దేవస్థాన కార్యాలయం వద్ద సీల్డ్ టెండర్ -కం- బహిరంగ వేలములు నిర్వహించబడును. **1.** టెంకాయలు అమ్ముకొను హక్కు, **2.** ధాన్యం, వ్రత పూజ సామాగ్రి ప్రోగు చేసుకొను హక్కు, **3.** కిరాణం సామాగ్రి & ఆట బొమ్మలు అమ్ముకొను హక్కు, **4.** వంట చెరుకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు, **5.** హోటల్ నడుపుకొను హక్కు, **6.** కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకొను హక్కు. పూర్తి వివరములకు కార్యాలయం నందు లేదా సెల్ నెం. 8790121962 ద్వారా సంప్రదించగలరు.
DIPR R.O. No. : 776-PP/CL/ADVT/2026-27, Date: 16-04-2026
సం / - కార్యనిర్వహణాధికారి

**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**

**ఫారం-VII**
(చట్టం 30/2013 లోని సెక్షన్ 19 (1) మరియు
నియమము 25 లోని ఉపనియమము (1) ప్రకారం)

ఆర్‌డిఓ గారి ఫైల్ నెం. I/LA/2518/2025-6 — తేది: 08.04.2026
కలెక్టర్ ఫైల్ నెం. G2/3036/2025 — తేది: 13.04.2026
గెజిట్ నం. 72 — తేది: 08.04.2026

**డిక్లరేషన్**

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, రంగారెడ్డి గారు రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, కాచారం గ్రామ పరిధిలో ప్రజా ప్రయోజనార్థం అనగా **ఎన్‌హెచ్ 167ఎన్** (ఫేజ్ **I 0+000 నుండి 25+000 వరకు) వద్ద బుద్వేల్ నుండి నాచారం వరకు ఔటర్ రింగ్ రోడ్‌కు (ఓఆర్ఆర్) కలుపుటకు 75 మీటర్ల** నిడివి **(ROW)** రేడియల్ **రోడ్-2** నిర్మాణం నిమిత్తం **మొత్తం ఎ.18.15** గుంటల భూమి అవసరమై ఉన్నదని భావిస్తున్నారు.

అందువల్ల రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, కాచారం గ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద కొద్ది హెచ్చు తగ్గులతో **ఎ.18.15 గుంటల** ప్రామాణిక కొలతలు గల భూమి సేకరణ కొరకు ప్రకటన జారీ చేయనైనది.

**షెడ్యూలు**

జిల్లా : రంగారెడ్డి — మండలం : శంషాబాద్ — గ్రామం: కాచారం

| క్రసం | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి స్వభావము | భూసేకరణ (ఎ. గుం.లలు) | ఆసక్తి గల పేరు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లు/కట్టడాలు | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్ల రకం | సం. | రకం | విస్తీర్ణం |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 33/2/1 | పట్టా | మెట్ట | 0.06 | V R ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం. 150 | కాచారం లోని సర్వే నెం.33 | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం. 150 | కాచారం లోని సర్వే నెం.31 | టేకు | 210 | - | - |
| 2 | 33/2/2 | పట్టా | మెట్ట | 0.06 | V R ప్యాకింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం. 150 | కాచారం లోని సర్వే నెం.33 | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం. 150 | కాచారం లోని సర్వే నెం.31 | వేప దర్పణం తాటి | 141 02 04 | - | - |
| 3 | 31/2/1 | పట్టా | మెట్ట | 5.00 | V R ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ | కాచారం లోని సర్వే నెం. 31/ భాగం | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.33 | కాచారం లోని సర్వే నెం.32 | - | - | - | - |
| 4 | 31/2/2 | పట్టా | మెట్ట | 1.10 | ఇందిరా పూసపాటి రాజు భర్త శ్రీధర్ | కాచారం లోని సర్వే నెం. 31/ భాగం | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.33 | కాచారం లోని సర్వే నెం.32 | - | - | - | - |
| 5 | 31/2/3 | పట్టా | మెట్ట | 0.04 | ఇందిరా పూసపాటి రాజు భర్త శ్రీధర్ | కాచారం లోని సర్వే నెం. 31/ భాగం | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.33 | కాచారం లోని సర్వే నెం.32 | - | - | - | - |
| 6 | 32/1/2 | పట్టా | మెట్ట | 0-33 | V R ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ Pvt Ltd | కాచారం లోని సర్వే నెం.31 | కాచారం లోని సర్వే నెం.38 | కాచారం లోని సర్వే నెం.31 | కాచారం లోని సర్వే నెం.27 | - | - | - | - |
| 7 | - | ప్రభుత్వ భూమి | మెట్ట | 0-31 | కాలువ (ప్రభుత్వ) | కాచారం లోని సర్వే నెం.28 | కాలువ | కాలువ | కాలువ | - | - | - | - |
| 8 | 30/2/1 | పట్టా | మెట్ట | 0-01 | వి ఆర్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.28 | - | - | - | - |
| 9 | 30/2/2 | పట్టా | మెట్ట | 0.32 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.28 | తాటి | 2 | రేకుల షెడ్డు | 630 చ.అ. |
| 10 | 30/2/3 | పట్టా | మెట్ట | 0.20 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.28 | వేప | 2 | - | - |
| 11 | 30/2/4 | పట్టా | మెట్ట | 1.18 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.28 | వేప | 2 | - | - |
| 12 | 30/2/5 | పట్టా | మెట్ట | 0-01 | నర్జిత్ కౌర్ భర్త దల్జీద్ సింగ్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.32 | కాచారం లోని సర్వే నెం.28 | - | - | - | - |
| 13 | 28/2/1 | పట్టా | మెట్ట | 0.21 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | కాచారం లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.27 | కాచారం లోని సర్వే నెం.27 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 14 | 28/2/2 | పట్టా | మెట్ట | 1.01 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | కాచారం లోని సర్వే నెం.30 | కాచారం లోని సర్వే నెం.27 | కాచారం లోని సర్వే నెం.27 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 15 | 28/2/3 | పట్టా | మెట్ట | 0.22 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | కాచారం లోని సర్వే నెం. 30 | కాచారం లోని సర్వే నెం.27 | కాచారం లోని సర్వే నెం.27 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 16 | 28/2/4 | పట్టా | మెట్ట | 2.02 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | కాచారం లోని సర్వే నెం. 30 | కాచారం లోని సర్వే నెం.27 | కాచారం లోని సర్వే నెం.27 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 17 | 28/2/5 | పట్టా | మెట్ట | 0.21 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | కాచారం లోని సర్వే నెం. 30 | కాచారం లోని సర్వే నెం.27 | కాచారం లోని సర్వే నెం.27 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 18 | 29/2/1 | పట్టా | మెట్ట | 0.05 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.75 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.30 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 19 | 29/2/2 | పట్టా | మెట్ట | 0.07 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.75 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.30 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 20 | 29/2/3 | పట్టా | మెట్ట | 0.32 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.75 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.30 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 21 | 29/2/4 | పట్టా | మెట్ట | 0.07 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.75 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.30 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 22 | 29/2/5 | పట్టా | మెట్ట | 0.25 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె లోని సర్వే నెం.75 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.30 | నాలా (కెనాల్) | - | - | - | - |
| 23 | 29/2/6 | పట్టా | మెట్ట | 0.30 | విమల్ కుమార్ నహర్ తండ్రి జీరా రాజ్ నహర్ | సుల్తాన్ పల్లె సర్వే నెం.75 | కాచారం లోని సర్వే నెం.28 | కాచారం లోని సర్వే నెం.30 | నాలా (కెనాల్) | - | - | - | - |
| మొత్తం విస్తీర్ణం ఎ. గుంటలు | | | | 18.15 | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013, కేంద్ర చట్టం (30/2013) యొక్క సెక్షన్ 15 ప్రకారం సంబంధిత భూ యజమానులు/ఆసక్తిగల వ్యక్తులు దాఖలు చేసిన అభ్యంతరాలను విచారించి, పరిష్కరించిన అనంతరం ఈ ప్రకటన చేయబడింది.

ప్రాజెక్ట్ నిర్వాహకుడు చట్టంలోని నిబంధనల ప్రకారం వివిధ కార్యకలాపాలను చేపట్టారు. ప్రాజెక్ట్ నిర్వాహకుడు భూ యజమానులు/బాధిత కుటుంబాల సామాజిక-ఆర్థిక సర్వేను, గ్రామసభను మరియు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. భూసేకరణ పరిధిలోకి రావడం వల్ల ఈ గ్రామంలో ఏ కుటుంబమూ నిరాశ్రయులు కాలేదు మరియు ఏ కుటుంబమూ తమ ప్రాథమిక జీవనోపాధిని కోల్పోలేదు. అందువల్ల, పునరావాసం మరియు పున:స్థాపన అర్హత శూన్యంగా (NIL) పరిగణించబడింది.

సదరు భూమి కింద లేదా ఆ భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం కింద ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజం, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు అవసరం లేదు. అయితే, ఏ ప్రయోజనం కోసం భూమిని సేకరిస్తున్నారో, ఆ ప్రాజెక్టు నిర్మాణ దశలో తవ్వడానికి, తొలగించడానికి లేదా ఉపయోగించడానికి అవసరమైన గనులు మరియు ఖనిజాల భాగాల మినహాయించబడ్డాయి.

సదరు భూమి యొక్క ప్లానును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, రాజేంద్రనగర్ కార్యాలయం వేళల్లో ఏదేని పని రోజు తనిఖీ చేసుకోవచ్చును.

సం/- ఆర్‌డిఓ / LAO, రాజేంద్రనగర్ డివిజన్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), రంగారెడ్డి జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

DIPR RO.NO: 66/LA/PP/Advt/Agency/2026-27



## అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలను ఏర్పాటు చేయాలి : తూం బుచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండల కేంద్రంలోని వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలను ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం తవక్లాపూర్ గ్రామంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిండి విత్తనోత్పత్తి క్షేత్రంలో అగ్రికల్చర్ డిప్లొమా క ళాశాల ఏర్పాటుకు సరిపడా భూమి ఉన్నందుకు ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని గత ప్రభుత్వం సైతం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డిండి వ్యవసాయ క్షేత్రంలో అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కనకాచారి, ఏఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి చక్రి, గోపాల, వెంకటయ్య, మల్లేష్, శ్రీనివాసులు, నాగరాజు, అలయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారు




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అధికారులపై నూతన సర్పంచులపై ఉన్నదని ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ అన్నారు. ఆయన గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలోని క్లస్టర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నివేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలను నూటికి 90 శాతం రాజకీయ నాయకులు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ రూ.90 వేల కోట్లు చేతులు మారుతున్నాయన్నారు. మోటకొండూరు మండలానికి ఎమ్మెల్సీ నిధుల నుండి కొంత కేటాయించి అభివృద్ధికి పాటుపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నరసింహా రావు, ఎంపీడీవో ఇందిర, తహసిల్దార్ రాజేంద్ర ప్రసాద్, ఎస్సై అశోక్ కుమార్, మండల పంచాయతీ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ అధికారిని మాధవిలత పాల్గొన్నారు.

## రైతుల భూములపై ఫారెస్ట్ అధికారుల పెత్తనం

**ప్రజాపక్షం/చందంపేట:** ఉమ్మడి చందంపేట మండలంలోని చిత్రియాల, పెద్దమూల ,నల్లచెలమూల గ్రామాల రైతుల భూములు సర్వే నెంబర్ 206లో బీ ఫాం పట్టాలు గత ప్రభుత్వాలు రైతులకు సాగుచేయడానికి ఇవ్వడం జరిగిందని, కానీ ఫారెస్టు అధికారుల తీరుతో రైతులు ఆవేదన చెందుతున్నారని సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునూతల వెంకటయ్య అన్నారు. అడవిలో భాగంగా ఉన్న భూములు మొత్తం భూమి ఫారెస్టుకు సంబంధించిందని రైతులను తమ భూములకు వెళ్లకుండా ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారులు మారినప్పుడల్లా రైతులు గొర్రెలు, పశువులను ఫారెస్టులోకి వెళ్లకుండా ఏదోరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇప్పటికైన ప్రభుత్వం ఆలోచన చేసి నిజమైన రైతులకు సాగు భూములకు అడ్డంకులు తొలగించాలని ఆయన కోరుతున్నారు.

## సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాలలో 'జీనియస్' విద్యార్థులు సత్తా



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇటీవల ప్రకటించిన సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో జీనియస్ హై స్కూల్ చెందిన విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి తమ సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిహెచ్ భవేష్ 500 మార్కులకు 474 మార్కులు సాధించగా, కే.మోహిత్ రాజ్ 470 మార్కులు , ఎస్.అక్షర 463 మార్కులు , ఏ.అక్షిత 459 మార్కులు, సిహెచ్ అంజలి 457 మార్కులు సాధించగా వీరితోపాటు మరిన్ని ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ వారిని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీనియస్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుంది అనడానికి ఇట్టి ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఇట్టి ఫలితాలు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు సహకరించిన తల్లిదండ్రులకు పాఠశాల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆర్ దిలీప్ కుమార్, ఏవో జి.రవి, ఉపాధ్యాయ బృందం ఎస్.పద్మావతి, ఎన్.రాధికనాయుడు, బి.కీర్తి, ఏ.రాజు, పిఈటిలు కే.శ్రీకాంత్, కే.కృష్ణకుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు పేదలందరికీ చెందాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలందరికీ చెందాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా వివిధ గ్రామాల సర్పంచులు అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సర్పంచుల సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని అందులో భాగంగా ఇందిరమ్మ ఇల్లు, ఉచిత విద్యుత్తు అర్హులైన వారికి రేషన్ కార్డులు, ప్రభుత్వం పేదవారికి అందజేస్తున్న సన్నబియ్యం పథకాన్ని పేదల అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి వై.శ్రీనివాస్ రెడ్డి, సిఐ ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ మధుసూదన్, వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం..

# రైతుల ఆందోళన

### మునుగోడులో సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా...నేతల అరెస్ట్






**ప్రజాపక్షం/మునుగోడు :** మండల కేంద్రంలో గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ,రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.అనంతరం ధర్నా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని నాయకులను అరెస్ట్ చేశారు. ఈ అరెస్టులతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు పోలీసుల చర్యను ఖండిస్తూ నినాదాలు చేశారు.అనంతరం పరిస్థితిని పోలీసులు అదుపులోకి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందరర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బలుగూరి నరసింహ,తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంట కోత పూర్తయినప్పటికీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా సాగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో అధికారులు తాలు,తేమ పేరుతో ధాన్యాన్ని తిరస్కరిస్తూ రైతులను తిరిగి పంపుతున్నారని ఆరోపించారు. దీంతో రైతులు రోజులు తరబడి కేంద్రాల వద్దే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య ఎదురవుతోందని రైతు సంఘం నాయకులు తెలిపారు.వర్షాలు పడే అవకాశం ఉండటంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈనేపథ్యంలో వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని,రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోమండల కార్యదర్శి చాపల శ్రీనివాస్ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,మండల కార్యవర్గ సభ్యులు బండమీది యాదయ్య,మందుల పాండు,ఈదుల కంటి కైలాస్,కాగితం వెంకన్న, దుబ్బ వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, తీర్పారి ష్ణయ్య, కటుకూరి లింగస్వామి,చిరగోని శంకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులను అధికారులు ఇబ్బంది పెట్టొద్దు

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అధికారులు పిల్లర్ సైజ్ లు,స్లాబ్ కొలతలు,మెట్లకు కేటాయించిన స్థలం కొలతల్లో తేడాల పేరిట ఇబ్బంది పెడితే సహించేది లేదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హౌసింగ్ బోర్డ్ డి ఈ నీ హెచ్చరించారు. పోచంపల్లి పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల మండల స్థాయి సమావేశంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ప్రగతి నివేదికలో భాగంగా హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల ఆఫీసర్ డి ఈ నివేదికను సమర్పిస్తున్న క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం దశల వారీగా బిల్లుల మంజూరు కోసం ధ్రువీకరణలో ఎదుర్కొంటున్న సమస్యలు బిల్లుల మంజూరు వంటి విషయాలను వెల్లడిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రూల్స్ ను ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. మంత్రి సూచించిన నియమాలను గుర్తు చేశారు. కొలతలను ధ్రువీకరించే క్రమంలో కొలతలు తేడాలు వచ్చినప్పుడు బిల్లులు మంజూరు కావని అధికారి చెప్పినప్పుడు ఎమ్మెల్యే ప్రభుత్వం నిర్ణయించిన కొలతలను వీడియో వేసి మంత్రి వివరించిన వివరాలను చూపించారు. కనిష్టంగా 400 చదరపు అడుగులు గరిష్టంగా 600 చదరపు అడుగులు ఉండవచ్చని విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. కొలతలు హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ లబ్ధిదారులకు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా బిల్లులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రితో ఇప్పటికే ఈ విషయాల పట్ల మాట్లాడినట్లు ఆయన చెప్పారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ప్రజలు అధికారులు పెద్ద ఎత్తున హర్షద్వానాలతో సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**వెనక్కి తగ్గకుండా అభివృద్ధిలో పరుగులు.. పాలనలో పారదర్శకత**

అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా వెనక్కి తగ్గకుండా దూసుకుపోతూ పాలనలో పారదర్శకత నిరూపిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా పోచంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అర్హులకి 15 అధునాతన ప్యాడి క్లినర్ యంత్రాలను అందజేశారు.

## నాణ్యతలో తేడాలు వస్తే బాధ్యులపై చర్యలు



కోదాడ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఇందులో భాగంగానే కోదాడ 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. గురువారం కోదాడ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోదాడ 100 పడకల ఆసుపత్రిని నాణ్యతతో నిర్మించాలని అధికారులను అదేశించారు. నాణ్యత ప్రమాణాలతో రాజీ పడవద్దని, నాణ్యతలో ఏమైనా తేడాలుంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా మెట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఆసుపత్రికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆసుపత్రుల్లో గర్భిణీలకు సాధారణ ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, డిసిహెచ్ఎస్ చంద్రశేఖర్, ఆసుపత్రి సూపర్‌వైజర్ దశరథనాయక్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసిల్దార్ వాజీద్‌అలీ, డాక్టర్లు పద్మావతి, నర్సింహ, లక్ష్మ ణ్, మెడికల్ ఈఈ రాజశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఏసిబి వలలో విద్యుత్ ఎడిఇ

### దేవరకొండలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత



**ప్రజాపక్షం/దేవరకొండ:** నల్లగొండ జిల్లా దేవరకొండలో అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులు మెరుపు దాడి నిర్వహించి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఎడిఇ)ను లంచం స్వీకరిస్తూ రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సిరికొండ సైదులు ఫిర్యాదుదారుని నుండి అధికారిక పనికి సంబంధించిన రూ.30వేలు లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా గురువారం పట్టుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారుడు నిర్వహించిన విద్యుత్ పనులకు సంబంధించిన రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి ముందుకు పంపేందుకు ఈలంచం కోరినట్లు అధికారులు వెల్లడించారు.ఈపనులు గతంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న 33/11 కేవీ విద్యుత్ లైన్ పునరుద్ధరణకు సంబంధించినవి కాగా,ఆలైన్ కంబాలపల్లి సబ్‌స్టేషన్‌కు అనుసంధానమై ఉంది.నిందితుడి వద్ద నుంచి లంచంగా స్వీకరించిన రూ.30వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అధికార దుర్వినియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని ఏసీబీ అధికారులు తెలిపారు. తదనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరు పరచగా,న్యాయస్థానం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుని వివరాలను వెల్లడించలేదని అధికారులు తెలిపారు.

## మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/చండూరు:** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచి నీటి కొరత తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సూచించారు. అవసరమైన చోట కొత్త బోర్లు త్రవ్వించడంతో పాటు,పాత బోర్ల మరమ్మతులు,నీటి సరఫరా వ్యవస్థలను సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.గురువారం చండూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సర్పంచులు,వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమయానికి చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో చండూరు ఆర్డీఓ శ్రీదేవి,స్పెషల్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో యాదగిరి,తహసీల్దార్ రమాకాంత్ శర్మ,ఎంఈఓ ఊట్కూరి సుధాకర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు,గ్రామ కార్యదర్శులు,సర్పంచులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణం చింతలబజారులోని అభిషేక్తుని ప్రార్థన మందిరంలో పాస్టర్ ఉట్కూరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమీషన్ (2004)ను ఏర్పాటు చేసిందని మాజీ సిజెఐ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన 2007లో ఇచ్చిన రిపోర్టులో దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపారని స్పష్టం చేశారు. 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు ఎస్‌సి హోదాను హిందూ, సిక్కు, బౌద్ధ మతం వారికి మాత్రమే పరిమితం చేయడం దళిత క్రైస్తవులకు అన్యాయం చేయడమేనన్నారు. ఇది మన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 19, 21, 32 ద్వారా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి జాకబ్‌రాజు మెసా దేవసహాయ్, జలగం జేమ్స్, తపకప్పల దయాకర్, మాతంగి పీటర్, బొక్క ఏలీయా రాజు పాల్గొన్నారు.

## నేడు టిజిఇజెఏసి ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొనే ప్రధాన డిమాండ్ల పరిష్కారానికై టిజిఇజెఏసి సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిజిఇజెఏసి సూర్యాపేట జిల్లా చైర్మన్ ఎస్‌కె జానీమియా, డిప్యూటి జనరల్ సెక్రటరీ తంగెళ్ల జితేందర్ రెడ్డిలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్. సోమయ్య, పుప్పాల వీరన్న, పబ్బతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా మోసానికి గురవుతున్న బిసిలు

### బిసి నేత ధనుంజయనాయుడు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలైన్నప్పటికీ బీసీలు ఇంకా మోసానికి గురవుతూనే ఉన్నారని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మిర్యాలగూడలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బూర్జువా పార్టీలు బీసీలను ఉద్ధరిస్తామని బీసీ యువతకు స్వయం ఉపాది అవకాశాలు కల్పిస్తామని, జనాభాలో అధిక శాతం ఉన్నా బీసీలకు న్యాయం జరగడం లేదని బీసీలను తామే ఉద్ధరిస్తామని ఉత్తర ప్రగల్బాలు పలుకుతూ ఎన్నికల్లో లబ్ధి పొందుతూ బీసీలను అన్యాయం చేస్తూనే ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏకాభిప్రాయ సాధన పేరుతో వాయిదా వేయడం వంటి చర్యలు చేపట్టడం, బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం, రాజకీయ రిజర్వేషన్లు ఏర్పాటు చేయకపోవడం వంటి చర్యల వల్ల బీసీలను వెనుకబాటుతనానికి గురవుతున్నారని అన్నారు. మనువాద పార్టీలు, మతోన్మాద పార్టీలు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ ఏర్పాటు చేసి ఎవరూ కోరకపోయినా పది శాతం రిజర్వేషన్ కల్పించారని, ఇప్పుడు 106సవరణ చట్టంతో మహిళా రిజర్వేషన్ తెస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మాణం చేసి కేంద్రానికి పంపితే పెండింగ్‌లో పెట్టారని అన్నారు. బీసీల పాలిట ప్రథమ శత్రువు బీజేపీ అని, బీజేపీలోని బీసీలంతా బయటకు వచ్చి ఆ పార్టీని బలహీనపరచాలని అన్నారు.

## ప్రారంభమైన భూదాన వజ్రోత్సవాల పాదయాత్ర




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదానోద్యమం 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని భూదాన వజ్రోత్సవాలలో భాగంగా గురువారం ఆచార్య వినోబాభావే మొదలుపెట్టిన పాదయాత్ర స్థలం శివరాంపల్లి నుండి సంఘమిత్ర ఆధ్వర్యంలో పాదయాత్రను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పాల్గొని ప్రారంభించారు. తడక యాదగిరి పట్నం కృష్ణకుమార్ తడక రమేష్ భారత లవకుమార్ తడక లావణ్య కొయ్యడ నరసింహ గుజ్జసత్యం చక్రాల నరసింహ పట్నం పారిజాత పిల్లలమర్రి దేవేందర్ రాపోలు జ్ఞానేశ్వర్ పాదయాత్ర చేస్తున్న వారిలో ప్రముఖులు. 18న పాదయాత్రతో ఈ బృందం పోచంపల్లికి చేరుకోనున్నది. అనంతరం జరిగే భూదానోద్యమ 75 సంవత్సరాల వేడుకలలో ఈ బృందం పాల్గొంటుంది.

## దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందుండాలి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** అభివృద్ధిలో దేవరకొండ మున్సిపాలిటి ముందుండాలని దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మున్సిపాలిటీ స్థాయి సభ కార్యక్రమంలో ఎంఎల్ఏ పాల్గొన్ని మాట్లాడారు. పట్టణ అభివృద్ధి,మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుద్యం, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికలు రూపొందించారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిపనులకు వార్డులలో నిధుల కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తయిందని ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ గత పాలకుల తప్పిదాలను సరి చేస్తూ సంక్షేమ, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ప్రజా పాలన పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించిన మార్చి 9 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జూవేరియా తబసమ్, కమిషనర్ పూర్ణచందర్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీఈడీ,బిపిఈడిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంజియు ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.గురువారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ,బిపిఈడి కళాశాలల ప్రిన్సిపాల్‌తోఆడిట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి విసి హాజరై మాట్లాడుతూ విద్యలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.ప్రతి కళాశాల విధిగా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంను ఏర్పాటు చేయాలని,విధిగా అధ్యాపకుల నియామకం జరగాలని,విద్యార్థుల హాజరు శాతం తరగతుల నిర్వహణ ప్రాక్టికల్స్ పై దృష్టి సారించాలని తెలిపారు.నాణ్యమైన విద్య ద్వారా మంచి ఉపాధ్యాయులను దేశానికి అందించాల్సిన బాధ్యత ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజి రెడ్డి,ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై ప్రశాంతి,డాక్టర్ జయంతి,సమరీన్ ఖజ్మీ,కళాశాలల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.



## మోసపూరిత మతమార్పిడులపై కఠిన చర్యలు కోరుతూ 'సుప్రీం'లో దరఖాస్తు

**న్యూఢిల్లీ:** మోసపూరితమైన మతమార్పిడులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. నాసిక్‌లోని ఒక బహుళజాతి కంపెనీ టిసిఎస్‌లో లైంగిక వేధింపులు,బలవంతపు మతమార్పిడి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో మోసపూరిత మతమార్పిడులపై తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని న్యాయవాది అశ్వనీ కుమార్ ఉపాధ్యాయ ఒక పిటిషన్ దాఖలు చేశారు. మరోన్యాయవాది అశ్వనీదూబే ద్వారా ఈ పిటిషన్ దాఖలైంది. మతమార్పిడులపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్గదర్శకాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ కేసులో శిక్షలను ఏక కాలంలో అనుభవించకుండా వరుసగా అనుభవించేవిధంగా కూడా చూడాలని, ఈ మేరకే కేంద్ర ప్రభుత్వానికి కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అంతరాత్మ ప్రభోధం మేరకు నిర్ణయా లు తీసుకునే స్వేచ్ఛ రాజ్యాంగంలోని 25వ అధికరణ ప్రకారం ఉందని, వృత్తి, ఉద్యోగాలు, మత ప్రచారం వంటివన్నీ ప్రజలలో శాంతి భద్రతలకు, నైతికతకు, అనుగుణంగా ఉండేట్టు చూడాలని కోరారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**

**ఫారం-VII**
(చట్టం 30/2013 లోని సెక్షన్ 19 (1) మరియు నియమము 25 లోని ఉపనియమము (1) ప్రకారం)

ఆర్‌డిఓ గారి ఫైల్ నెం. I/LA/2518/2025-5 — తేది: 08.04.2026
కలెక్టర్ ఫైల్ నెం. G2/3036/2025 — తేది: 13.04.2026
గెజిట్ నం. 80 — తేది: 09.04.2026

**డిక్లరేషన్**

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, రంగారెడ్డి గారు రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, సుల్తాన్‌పల్లి గ్రామ పరిధిలో ప్రజా ప్రయోజనార్థం అనగా **ఎన్‌హెచ్ 167ఎన్ (ఫేజ్ I 0+000 నుండి 25+000 వరకు)** వద్ద బుద్వేల్ నుండి నాచారం వరకు రింగ్ రోడ్‌కు (ఓఆర్ఆర్) కలుపుటకు **75 మీటర్ల నిడివి (ROW) రేడియల్ రోడ్-2** నిర్మాణం నిమిత్తం **మొత్తం ఎ.24.20** గుంటల భూమి అవసరమై ఉన్నదని భావిస్తున్నారు.

అందువల్ల రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, సుల్తాన్‌పల్లి గ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద కొద్ది హెచ్చు తగ్గులతో **ఎ.24.20 గుంటల** ప్రామాణిక కొలతలు గల భూమి సేకరణ కొరకు ప్రకటన జారీ చేయనైనది.

**షెడ్యూలు**

జిల్లా : రంగారెడ్డి — మండలం : శంషాబాద్ — గ్రామం: సుల్తాన్‌పల్లి

| క్ర సం | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి స్వభావము | భూసేకరణ (ఎ. గుం. లు) | ఆసక్తి గల పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/కట్టడాలు: చెట్టు రకం | సంఖ్య | రకం | విస్తీర్ణం | వ్యాఖ్యలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 1 | 123/2 | పట్టా | మెట్ట | 1-36 | వి.తులసి రామ్ తండ్రి నారాయణ స్వామి/ రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | సర్వే నం.123 సుల్తాన్ పల్లెలో భాగం | నర్మదా లోని స.నెం. 336 భాగం | నర్మదా లోని స.నెం. 336 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 124 | – | – | – | – | 1. ప్రాథమిక రెవెన్యూ రికార్డుల ప్రకారం, ఈ భూములు వాస్తవానికి జాగీర్ మరియు కంచ భూములని, ఇందులో ప్రభుత్వ ప్రయోజనం కూడా ఇమిడి ఉందని శంషాబాద్ మండల తహసీల్దార్ నివేదించారు. 2. ఇంకా నివేదించినదేమనగా, గౌరవనీయ సుప్రీంకోర్టులో రాష్ట్రం తరపున డైరీ నెం. 42339/2024లో దాఖలు చేసిన డబ్ల్యూ.పి. నెం. 14038/2005 అప్పీల్ (ఎస్.ఎల్.పి.)లో డబ్ల్యూ.ఏ. నెం. 1875/2013 కేసులో గౌరవనీయ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో అసంతృప్తి చెంది, అందులో సూచించిన లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం, పునరుద్ధరణ పిటిషన్ దాఖలు చేయబడింది మరియు ఇది గౌరవనీయ భారత సుప్రీంకోర్టులో విచారణ కోసం పెండింగ్‌లో ఉంది. |
| 2 | 124/2/1 | పట్టా | మెట్ట | 1.35 | ప్రకాష్ V.T/ రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 124 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 124 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 123 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 145 భాగం | వేప | 2 | – | – | |
| 3 | 124/2/2 | పట్టా | మెట్ట | 1.35 | వి.భారతి భర్త తులసి రామ్/ రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 124 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 124 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 123 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 145 భాగం | వేప | 4 | – | – | |
| 4 | 145/2/1 | పట్టా | మెట్ట | 2.01 | ప్రకాష్ V.T/ రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 145 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 145 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 124 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 146 భాగం | వేప తాటి | 1 6 | – | – | |
| 5 | 145/2/2 | పట్టా | మెట్ట | 2.01 | వి.భారతి భర్త తులసి రామ్/ రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 145 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 145 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 124 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 146 భాగం | – | – | – | – | |
| 6 | 146/2 | పట్టా | మెట్ట | 5-11 | జగత్ కుమార్ తండ్రి నారాయణ స్వామి/ రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 146 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 146 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 145 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 148 భాగం | వేప | 01 | – | – | |
| 7 | 148/2 | పట్టా | మెట్ట | 2-36 | జగత్ కుమార్ తండ్రి నారాయణ స్వామి/రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 148 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 148 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 146 భాగం | సుల్తాన్ పల్లెలో స.నెం. 149 | – | – | – | – | |
| 8 | 149/2 | పట్టా | మెట్ట | 3-13 | తులసి రామ్ తండ్రి నారాయణ స్వామి/రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 149 సుల్తాన్ పల్లెలో భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 149 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 148 భాగం | సుల్తాన్ పల్లెలో స.నెం. 150 | వేప తాటి | 2 2 | – | – | |
| 9 | 150/2 | పట్టా | మెట్ట | 3-12 | తులసి రామ్ తండ్రి నారాయణ స్వామి/రాష్ట్ర ప్రభుత్వం తరపున శంషాబాద్ తహశీల్దార్ గారు | స.నెం. 150 సుల్తాన్ పల్లెలో భాగం | కాచారంలోని స.నెం. 33 భాగం | సుల్తాన్ పల్లెలోని స.నెం. 149 భాగం | కాచారంలో స.నెం. 133 | వేప | 8 | – | – | 1. ప్రాథమిక రెవెన్యూ రికార్డుల ప్రకారం, ఈ భూములు వాస్తవానికి జాగీర్ మరియు కంచ భూములని, ఇందులో ప్రభుత్వ ప్రయోజనం కూడా ఇమిడి ఉందని శంషాబాద్ మండల తహసీల్దార్ నివేదించారు. 2. ఇంకా నివేదించినదేమనగా, గౌరవనీయ సుప్రీంకోర్టులో రాష్ట్రం తరపున డైరీ నెం. 42339/2024 లో దాఖలు చేసిన డబ్ల్యూ.పి. నెం. 14038/2005 అప్పీల్ (ఎస్.ఎల్.పి.) లో డబ్ల్యూ.ఏ. నెం. 1875/2013 కేసులో గౌరవనీయ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో అసంతృప్తి చెంది, అందులో సూచించిన లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం, పునరుద్ధరణ పిటిషన్ దాఖలు చేయబడింది మరియు ఇది గౌరవనీయ భారత సుప్రీంకోర్టులో విచారణ కోసం పెండింగ్‌లో ఉంది. |
| మొత్తం విస్తీర్ణం ఎ.గుంటలు | | | | 24.20 | | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013, (కేంద్ర చట్టం (30/2013)) యొక్క సెక్షన్ 15 ప్రకారం సంబంధిత భూ యజమానులు/ఆసక్తిగల వ్యక్తులు దాఖలు చేసిన అభ్యంతరాలను విచారించి, పరిష్కరించిన అనంతరం ఈ ప్రకటన చేయబడింది.

ప్రాజెక్ట్ నిర్వాహకుడు చట్టంలోని నిబంధనల ప్రకారం వివిధ కార్యకలాపాలను చేపట్టారు. ప్రాజెక్ట్ నిర్వాహకుడు భూ యజమానులు/బాధిత కుటుంబాల సామాజిక-ఆర్థిక సర్వేను, గ్రామసభను మరియు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. భూసేకరణ పరిధిలోకి రావడం వల్ల ఈ గ్రామంలో ఏ కుటుంబమూ నిరాశ్రయులు కాలేదు మరియు ఏ కుటుంబమూ తమ ప్రాథమిక జీవనోపాధిని కోల్పోలేదు. అందువల్ల, పునరావాసం మరియు పున:స్థాపన అర్హత శూన్యంగా (NIL) పరిగణించబడింది.

సదరు భూమి కింద లేదా ఆ భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం కింద ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజం, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు అవసరం లేదు. అయితే, ఏ ప్రయోజనం కోసం భూమిని సేకరిస్తున్నారో, ఆ ప్రాజెక్టు నిర్మాణ దశలో తవ్వడానికి, తొలగించడానికి లేదా ఉపయోగించడానికి అవసరమైన గనులు మరియు ఖనిజాల భాగాల మినహాయించబడ్డాయి.

సదరు భూమి యొక్క ప్లానును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, రాజేంద్రనగర్ కార్యాలయం వేళల్లో ఏదేని పని రోజు తనిఖీ చేసుకోవచ్చును.

సం/- ఆర్‌డిఓ / LAO, రాజేంద్రనగర్ డివిజన్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), రంగారెడ్డి జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

DIPR RO.NO: 67/LA/PP-Advt/Agency/2026-27


## ప్రభుత్వ బిల్లుల అసలు ఉద్దేశం
# 'దురుద్దేశపూరితమైనది'

- కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ధ్వజం
- బిల్లులతో పార్లమెంట్‌ను హైజాక్ చేయడాన్ని అనుమతించబోమని హెచ్చరిక



**న్యూఢిల్లీ :** మహిళా కోటా చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం తీసుకున్న బిల్లుల అసలు ఉద్దేశం 'దురుద్దేశపూరితమైనది' అని, వాటిని వాటి ప్రస్తుత రూపంలో పూర్తిగా తిరస్కరిస్తున్నామని కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేసింది. సభా కూటమికి ముందు జరిగిన ఇండియా కూటమి సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో లోపభూయిష్టమైన డీలిమిటేషన్ బిల్లులతో పార్లమెంట్‌ను హైజాక్ చేయడాన్ని అనుమతించబోమని ఆయన అన్నారు. 'మేం ఐక్యంగా నిలబడతాం. ప్రజాస్వామ్య పద్ధతిలో మా పూర్తి శక్తిని ఉపయోగించి ఈ కుటిలతను ఎదుర్కొంటాం' అని మల్లికార్జున్ ఖర్గే గురువారం తన 'ఎక్స్' పోస్ట్‌లో పార్టీ అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. పార్లమెంట్ హౌస్‌లోని ఖర్గే ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో మల్లికార్జున్ ఖర్గేతో పాటు, లోక్‌సభలలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధానకార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, జైరాం రమేశ్, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సూలే, డిఎంకెకు చెందిన టి.ఆర్.బాలు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సాగరిక ఘోస్, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమ్‌చందరన్ సహా ఇతరులు మరికొందరు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరాం రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం బిజెపి బలంగా ఉన్న కొన్ని నియోజకవర్గాలకు ప్రాధాన్యతను ఇచ్చే డీలిమిటేషన్ ప్రతిపాదనలపై నలుమూలల నుండి అనేక ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. లోక్‌సభలో సంఖ్యాబలం యొక్క సాపేక్ష బలం వాస్తవానికి తగ్గుతుంది అని జైరాం రమేశ్ తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన వాస్తవికంగా జరిగిన తీరు నరేంద్రమోదీ_అమిత్‌షా ఎంత దుర్మార్గంగా చెప్పారో చూపిస్తుంది ఈ బిల్లు అసలు ఉద్దేశం 'దురుద్దేశపూరితమైనది' అని ఆయన తెలిపారు. వాటిలోని అంశాలు మోసపూరితమైనవని, వాటివల్ల కలిగేనష్టం కూడా అపారమైనదని, వాటిని ప్రస్తుత రూపంలో పూర్తిగా తిరస్కరించాలని జైరాంరమేష్ పునరుద్ఘాటించారు. 'ప్రతిపక్షం డిమాండ్ చాలా చిన్నది. లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలలో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు కేటాయించడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి వర్గాలకు చెందిన మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలి' అని ఆయన అన్నారు. 2023లో ప్రతిపక్షం వైఖరి ఇదేనని, ఇప్పటికీ అదే వైఖరి కొనసాగుతోందని జైరాంరమేశ్ తెలిపారు. ఇది నిజమైన అధికార భాగస్వామ్యమని, అత్యంత ప్రజాస్వామ్యబద్ధమైనదని, అంతే కాకుండా రాజ్యాంగ విలువలు, సూత్రాలకు అనుగుణంగా ఉందని జైరాం రమేశ్ అన్నారు.2029నాటికి మహిళా కోటా చట్టాన్ని అమలుచేయడానికి, అలాగే సభ సభ్యుల సంఖ్యను 850కి పెంచడానికి ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు మూడు బిల్లులను జాబితా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం జారీ చేసిన ఒక బులెటిన్ ప్రకారం 'రాజ్యాంగం (నూట ముప్పై ఒకటవ సవరణ) బిల్లు2026, డీలిమిటేషన్ బిల్లు2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు) 2026లను దిగువ సభలో ఆమోదం కోసం ప్రవేశపెట్టి, వాటిపై చర్చిస్తారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తొలి రెండు బిల్లులను ప్రవేశపెట్టనుండగా, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మూడవ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ముసాయిదా రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం, 2011 జనాభాలెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అనుసరించి, 2029 పార్లమెంటరీ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అములు చేసేందుకు లోక్‌సభ సీట్లను ప్రస్తుతం 543 నుండి గరిష్ఠంగా 850కు పెంచనున్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర, కేంద్రపాలిత శాసనసభల్లో కూడా సీట్లు పెంచనున్నారు. ఈ బిల్లును తీసుకొస్తున్న విధానాన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని, ఇది 'రాజకీయ ప్రేరేపితం' అని ఆరోపించాయని ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు , ఇండియా కూటమిలోని పలు భాగస్వామ్య పార్టీల నాయకులు పార్లమెంట్ మూడు రోజుల ప్రత్యేక సమావేశంలో ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు బుధవారం ఇక్కడ మల్లి కార్జున్ ఖర్గే నివాసంలో సమావేశం అయ్యారు.

# డీలిమిటేషన్ ప్రతులు దహనం

- ఈ బిల్లు తమిళ ప్రజలను వారి సొంత భూమిలోనే 'శరణార్థులుగా' మార్చాలని చూస్తోందని తమిళ సిఎం స్టాలిన్ ఫైర్
- నల్ల చట్టంగా అభివర్ణించిన డిఎంకె అధినేత

**చెన్నై :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. తమిళనాడులో ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ గురువారం డీలిమిటేషన్ బిల్లు ప్రతిని దహనం చేశారు. ఈ బిల్లు తమిళ ప్రజలను వారి సొంత భూమిలోనే 'శరణార్థులుగా' మార్చాలని చూస్తోందని ఆరోపించారు. ఈ బిల్లును 'నల్ల చట్టం'గా అభివర్ణించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి కొన్ని గంటల ముందు, స్టాలిన్ నల్ల జెండాను ఎగురవేసి, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన డీలిమిటేషన్ బిల్లు ప్రతిని దహనం చేశారు. ఈ చర్యను ఖండిస్తూ నినాదాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ తమిళనాడులోని నామక్కల్‌లో ముఖ్యమంత్రి పాల్గొని అక్కడే బిల్లు ప్రతిని దహనం చేశారు. నల్ల దుస్తులు ధరించిన స్టాలిన్, ఇతరులు 'పోరాడవోం, వెల్వోం ఒండ్రగా' (కలిసి పోరాడుదాం, గెలుద్దాం) అంటూ నినదించారు. స్టాలిన్ బిల్లు ప్రతిని దహనం చేసిన తర్వాత, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్నికైన ప్రతినిధులు తమతమ ప్రాంతాలలో బిల్లు ప్రతులను దహనం చేశారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా మదురైలో డీలిమిటేషన్ బిల్లు కాపీని దహనం చేశారు. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించడానికి డీలిమిటేషన్ అనేది కేంద్రం చేతిలో ఉన్న ఆయుధమని ఉప ముఖ్యమంత్రి ఆరోపించారు. తమిళనాడుకు వనిరంతరం ద్రోహం చేస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, కొన్ని ఉత్తర రాష్ట్రాల సహాయంతో కేంద్రం తనకు నచ్చినట్లు అమలు చేయాలని ఆలోచిస్తోందని ఉదయనిధి ఆరోపించారు. పార్లమెంటులో దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించాలని కేంద్రం కోరుకుంటోందని ఆయన ఆరోపించారు. ఆత్మగౌరవానికి పేరుగాంచిన తమిళనాడు నేల బిజెపి అహంకారానికి ఎప్పటికీ తలవంచదు... హక్కుల కోసం పార్టీ అధినేత వెలిగించిన ఈ జ్వాల భారతదేశమంతటా వ్యాపించనివ్వండి అని ఉప ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. డిఎంకె రాష్ట్ర ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో, పార్టీ నాయకులు ఆర్.ఎస్. భారతి, టికెఎస్. ఎలాంగోవన్‌ల నాయకత్వంలో నల్ల దుస్తులు ధరించిన పార్టీ కార్యకర్తలు డీలిమిటేషన్ బిల్లు కాపీలను దహనం చేశారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై సేలంలో నల్లజెండా ప్రదర్శన నిర్వహించి, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్రాన్ని ఖండించారు. ద్రావిడర్ కజగం అధ్యక్షుడు కె. వీరమణి నల్లజెండా ఎగురవేసి, బిల్లు ప్రతిని తగలబెట్టారు. డిఎంకె మిత్రపక్షాలైన సిపిఐ, సిపిఐ(ఎం) కూడా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పట్ల తమ వ్యతిరేకతను తెలియజేస్తూ నల్ల జెండాలను ఎగురవేసి ఈ నిరసనలో పాలుపంచుకున్నాయి. స్టాలిన్ నల్ల జెండాను ఆవిష్కరించిన వెంటనే, ఆయన పార్టీ కార్యవర్గ సభ్యులు, మంత్రులు, కార్యకర్తలు తమిళనాడు అంతటా తమతమ ఇళ్లపై, పార్టీ కార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో నల్ల జెండాలను ఎగురవేశారు. చెన్నైలోని డిఎంకె రాష్ట్ర ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'తో పాటు, డిఎంకె మిత్రపక్షాలైన కమల్ హాసన్ నేతృత్వంలోని 'మక్కల్ నీది మయ్యం', వైకో నేతృత్వంలోని ఎండిఎంకె కార్యాలయాల ఆవరణలో ఉన్న ప్రముఖ ప్రదేశాల్లోనూ నల్ల జెండాలను ఎగురవేశారు. దివంగత డిఎంకె అధినేత ఎం. కరుణానిధి నివాసమైన చెన్నై గోపాలపురంలోనూ ఒక నల్ల జెండా దర్శనమిచ్చింది. చెన్నైలోని ముఖ్యమంత్రి నివాసంలోనూ, ఆయన మంత్రివర్గ సహచరుల ఇళ్లలోనూ కూడా నల్ల జెండాలను ఎగురవేశారు. కేంద్రం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ తీసుకున్న ఈ చర్య తమిళనాడు ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందని ఆరోపిస్తూ, బుధవారం నాడు స్టాలిన్ రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాల నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.



## రాజ్యాంగ సవరణ బిల్లు పాసైతే ప్రజాస్వామ్యం అంతమైనట్లే

కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం (ఇసి), న్యాయవ్యవస్థ వంటి సంస్థలపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం ప్రారంభించిందని, అయితే ఇప్పుడు రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ప్రజాస్వామ్యంపై బాహాటమైన దాడికి దిగిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టంలో సవరణలు, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ, ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల్లోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఎందుకు కల్పించలేకపోతోందని ప్రియాంకా గాంధీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ కమిషన్ ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను 850 వరకు పెంచాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోందని ఆమె పేర్కొన్నారు. పైకి చూడటానికి ఇది బాగానే అనిపించవచ్చు, కానీ దీనిని నిశితంగా చదివినప్పుడు అసలు అర్థం బయటపడుతుంది. ఇందులో రాజకీయ కుట్ర వాసనలు కనిపిస్తున్నాయి అని ఆ కాంగ్రెస్ నాయకురాలు అన్నారు. బిల్లులోని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, డీలిమిటేషన్ కమిషన్‌లోని ముగ్గురు సభ్యులే రాష్ట్రాల భవిష్యత్తును, పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యాన్ని నిర్ణయిస్తారని స్పష్టమవుతోందని ఆమె తెలిపారు. 'ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా వంటి సంస్థలపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం ప్రారంభించింది; అయితే ఇప్పుడు, ప్రజాస్వామ్యంపై బాహాటమైన దాడికి తెరలేపింది' అని ప్రియాంకా గాంధీ అన్నారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే, భారతదేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా అంతమైపోతుందని ఆమె హెచ్చరించారు. శాసనసభల్లో మహిళా రిజర్వేషన్ల అంశానికి సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని కూడా ఆ కాంగ్రెస్ ఎంపి వివరించారు. ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పంచాయతీలు నగరపాలక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ల కోసం బిల్లును తీసుకువచ్చింది రాజీవ్ గాంధీ అని, చివరగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పి.వి. నరసింహారావు నేతృత్వంలో ఆ బిల్లు ఆ మోదం పొందిందని ఆమె తెలిపారు. 'యుపిఎ హయాంలో ఇది రాజ్యసభలో ఆమోదం పొందింది, కానీ లోక్‌సభలో ఏకాభిప్రాయం కుదరలేదు. 2018లో రాహుల్ గాంధీ, మహిళా రిజర్వేషన్ల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు' అని ప్రియాంక గాంధీ అన్నారు. మోదీపై పరోక్షంగా విమర్శలు చేస్తూ, ప్రధానమంత్రి ప్రసంగాన్ని బట్టి చూస్తే అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బిజెపి) మహిళా రిజర్వేషన్లకు గట్టి మద్దతుదారుగా కనిపిస్తోందని ఆమె అన్నారు.

## రాజ్యసభ సభ్యులుగా 16 మంది ప్రమాణం

**న్యూఢిల్లీ :** రాజ్యసభకు కొత్తగతా ఎన్నికైనల సభ్యులు గురువారం ప్రమాణం స్వీకారం చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, కేంద్ర మంత్రి రామ్ నాథ్ ఠాకూర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ సంఘ్వీలతో పాటు, కొత్తగా ఎన్నికైన మరో 13 మంది రాజ్యసభ ఎంపిలు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. బిహార్, అసోం, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న, కొత్తగా ఎన్నికైన/తిరిగి ఎన్నికైన 16 మంది రాజ్యసభ సభ్యులతో భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ 16 మంది ఎంపిలలో ఎనిమిది మంది బిజెపికి చెందినవారు కాగా, ముగ్గురు దాని మిత్రపక్షాలకు చెందినవారు. మిగిలిన ఐదుగురు ఎంపిలు కాంగ్రెస్‌కు చెందినవారు. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నబిన్, బిహార్ శాసనసభకు రాజీనామా చేసి రాజ్యసభలోకి అడుగుపెట్టారు. బల్లలు చరుస్తున్న జనసందోహం మధ్య ఆయన హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన బిహార్ నుంచి రాజ్యసభకు తిరిగి ఎన్నికయ్యారు. ఉపేంద్ర కుష్వాహా (ఆర్ఎల్ఎం), శివేష్ కుమార్ (బిజెపి) కూడా బిహార్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పదవీ ప్రమాణం చేసిన తేరాష్ గోవాలా (బిజెపి), జోగెన్ మోహన్ (బిజెపి), ప్రమోద్ బోరో (యుపిపిఎల్) అసోంకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న లక్ష్మీ వర్మ (బిజెపి), ఫూలో దేవి నేతమ్ (ఐఎన్‌సి), అలాగే హర్యానాకు ప్రాతినిధ్యం వహిస్తున్న కరమ్‌వీర్ సింగ్ బౌధ్ (కాంగ్రెస్), సంజయ్ భాటియా (బిజెపి) కూడా రాజ్యాంగం పట్ల తమ విధేయతను పునరుద్ఘాటించారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన అభిషేక్ మను సంఘ్వీ, వేం నరేంద్ర రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బిజెపికి చెందిన సుజీత్ కుమార్ కూడా ఒడిశా నుండి రాజ్యసభ ఎంపిగా ప్రమాణ స్వీకారం చేశారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి అనురాగ్ శర్మ కూడా ఎంపిలుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

**నేటికి రాజ్యసభ వాయిదా**

కొత్తగా ఎన్నికైన సభ్యులు గురువారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం అనంతరం సభ ఎలాంటి శాసనపరమైన కార్యకలాపాలు నిర్వహించకుండా శుక్రవారానికి వాయిదా వేశారు. అంతకు మందుకు ఈనెల 12న ముంబయిలో 92 ఏళ్ల వయసులో మరణించిన ప్రముఖ నేపథ్య గాయని ఆశా భోస్లే, 8న 94 ఏళ్ల వయసులో కన్నుమూసిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ కేంద్ర మంత్రి మొహ్సినా కిద్వాయ్‌ల స్మృతిలో సభ ఒక నిమిషం మౌనం పాటించింది. చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్, తమిళనాడులోని కల్పక్కంలో సాధించిన చారిత్రాత్మక విజయాన్ని ప్రస్తావిస్తూ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో భారతదేశం ఇటీవల సాధించిన పురోగతికి నివాళులర్పించారు. 500మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పిఎఫ్‌బిఆర్) ఈనెల 6, 2026న మొదటి క్రిటికాలిటీని సాధించింది. ఇది భారతదేశ దీర్ఘకాలిక ఇంధన భద్రతలో ఒక చారిత్రాత్మక ముందడుగు కావడంతో పాటు, స్వదేశీ అణు సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంలో కూడా కీలక పాత్ర పోషించింది. ఈ విజయంతో, భారతదేశం తన మూడు దశల అణు విద్యుత్ కార్యక్రమంలో అధికారికంగా రెండవ దశలోకి ప్రవేశించిందని ఆయన అన్నారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

## పెళ్లికి సవర బంగారం, రైతులకు రుణమాఫీ

- 60ఏళ్ల లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం
- టివికె మ్యానిఫెస్టో విడుదల



**చెన్నై :** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టివికె అధినేత, నటుడు విజయ్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే.. 60ఏళ్ల లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం, పేద అమ్మాయిల వివాహాలకు సవర (ఎనిమిది గ్రాముల బంగారం), నాణ్యమైన పట్టు చీర కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక బృందాలకు రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో డ్రాప్‌ఔట్‌లను నిర్మూలించేందుకు విద్యార్థుల తల్లులకు ఏడాదికి రూ.15000 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రైతులపైనా విజయ్ వరాల హామీలు కురిపించారు. ఐదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతుల వ్యవసాయ రుణాల మాఫీ, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ ఉన్నవారికి 50శాతం మాఫీ, కనీస మద్దతు ధర వరికి క్వింటాలుకు రూ.3500, చెరకుకు రూ.4500, కుటుంబానికి ఏడాదికి ఆరు ఉచితంగా సిలిండర్లు, ఎఐ మంత్రిత్వశాఖ, ఎఐ యూనివర్సిటీ, ఎఐ సిటీ ఏర్పాటు, పట్టభద్రులైన నిరుద్యోగులకు నెలకు రూ.4వేల ఆర్థిక సాయం, కొత్తగా ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, వృద్ధులు, దివ్యాంగులకు రూ.3వేల పింఛను, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య బీమా వంటి తదితర హామీలను ప్రకటించారు.

## రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నికను
# బాయికాట్ చేస్తాం : జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** ఏడేళ్లుగా లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించని మోదీ ప్రభుత్వానికి నిరసనగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నికను ప్రతిపక్షం బహిష్కరిస్తుందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి అర్థవంతమైన సంప్రదింపులు జరపలేదని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేష్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'హరివంశ్ 3.0' తమ అభ్యర్థనల పట్ల మరింత సర్దుబాటు వైఖరిని, స్వీకరణ శక్తిని కలిగి ఉంటారని ప్రతిపక్షం ఆశిస్తోందని ఆయన తెలిపారు. "మోదీ ప్రభుత్వం ఏడేళ్లుగా లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించలేదు. ఇది మునుపెన్నడూ జరగలేదు. రాజ్యసభలో డిప్యూటీ స్పీకర్‌కు సమానమైన పదవి డిప్యూటీ చైర్మన్‌ది. హరివంశ్ రెండవ పదవీ కాలం ఏప్రిల్ 9న ముగిసింది. ఆ తరువాత భారత రాష్ట్రపతి ఆయనను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేశారు. ఇప్పుడు ఆయన మూడవసారి ఉప సభాపతి పదవికి ఎన్‌డిఎ అభ్యర్థిగా ఉన్నారు' అని రమేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాజ్యసభకు రాష్ట్రపతిచే నామినేట్ చేయబడిన వ్యక్తిని, ఆ సభ ఉప సభాపతి పదవికి పరిగణించడం ఇంతకు ముందెన్నడూ జరగలేదని ఆయన అన్నారు. ఇదంతా ప్రతిపక్షాలతో ఎటువంటి అర్థవంతమైన సంప్రదింపులు జరపకుండానే జరుగుతోందని ఆ కాంగ్రెస్ నాయకుడు తెలిపారు. ఈ మూడు కారణాలకు నిరసన సూచకంగా 17న జరగనున్న ఉప సభాపతి ఎన్నికను బహిష్కరించాలని ప్రతిపక్షాలు విచారంతో నిర్ణయించుకున్నాయని రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాజ్యసభ ఉప సభాపతి పదవికి ఎన్నిక నిర్వహించనుంది. ఈ కీలక పదవికి హరివంశ్ తిరిగి ఎన్నికయ్యేలా అధికార ఎన్‌డిఎ కూటమి గట్టి ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ఏప్రిల్ 9న హరివంశ్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ ఉప సభాపతి పదవి ఖాళీ అయ్యింది. ఆ తర్వాత, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హరివంశ్‌ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయగా, ఆయన ఏప్రిల్ 10న ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర మంత్రి, బిజెపి నాయకుడైన జె.పి. నడ్డా— రాజ్యసభలో సభా నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. హరివంశ్ పేరుపై విస్తృత ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నంలో భాగంగా, ఆయనను ఉప సభాపతిగా తిరిగి ఎన్నుకోవడంపై వివిధ పార్టీల నాయకులతో చర్చించినట్లు తెలిసింది. అయితే, లోక్‌సభ ఉప సభాపతి పదవి 2019 నుండి ఖాళీగా ఉన్నప్పటికీ, ఈ పదవిని భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించడంలో అధికార పక్షం చూపుతున్న అత్యుత్సాహం పట్ల కాంగ్రెస్, టిఎంసి, వామపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి.


**IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY**
**O.S.No. 749 OF 2022**

Between:
1. Elpula Lasumamma
2. Elpula @ Boddu Muktheswari
**...Plaintiffs**

AND

1. Elpula Shailaja
2. Elpula Umamaheshwari
3. The District Collector, Jayashankar Bhupalpally District.
4. The Mandal Tahasildar, Bhupalpally Mandal
5. The SCCL, General Manger, Area JayaShankar Bhupalpally
6. To whomsoever it may concern.
**... Defendants**

**NOTICE**

To
1.To whomsoever it may concern.

The Plaintiffs herein filed the above O.S No.749 of 2022 against the above Defendant no.1 to 6 for the declare the plaintiffs as the Legal Heirs of the deceased Late Elpula Komuraiah, and Late Elpula Kumaraswamy. Hence you are required to appear before the Hon'ble Court through legal counsel on: **23-06-2026 at 10:30 am.** Failing which the matter will be heard and decided in your absence.

**MANGALAPALLY RAJ KUMAR**
**ADVOCATE**
3-18/1,KHASIMPALLY,
Bhupalapally Jayashankar Dist.
**Cell : 9848708057**

# బిహార్‌కు బిజెపి ముఖ్యమంత్రి

హిందీ బెల్టులో ప్రధాన రాష్ట్రాల్లో ఒకటైన బిహార్ ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరి బుధవారం పదవీ ప్రమాణం చేయటంతో బిజెపి చిరకాల కోరిక, ప్రయత్నం నెరవేరింది. ఆయన మొన్నటివరకు నితీశ్ కుమార్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి. ఇప్పుడు బిహార్‌కు 24వ ముఖ్యమంత్రి; బిజెపి–జెడియు సంకీర్ణ ప్రభుత్వానికి తొలి బిజెపి ముఖ్యమంత్రి. ఆయనతోపాటు ప్రమాణం చేసిన ఇరువురు సీనియర్ జెడి(యు) నాయకులు విజయ్ కుమార్ చౌధరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌లకు డిప్యూటీ ముఖ్యమంత్రి హోదా ఇవ్వబడింది. బిజెపితో అంగీకారం మేరకు ముఖ్యమంత్రి పదవికి మంగళవారం రాజీనామా చేసిన వృద్ధ నాయకుడు నితీశ్‌కుమార్ ఇప్పుడు రాజ్యసభ సభ్యుడు. బహుశా మోదీ మంత్రివర్గంలో స్థానం లభిస్తుంది. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నితీశ్‌కుమార్ కుమారుడు నిషాంత్ ఉప ముఖ్యమంత్రి పదవిని నిరాకరించారని చెప్పబడుతున్నది. రాజకీయాల మేనేజిమెంట్‌లో అనుభవంకోసం కొంతకాలం పార్టీ వ్యవహారాలపై కేంద్రీకరించాలనుకుంటున్నాడట. నితీశ్‌కుమార్ ఆమోదం ఉందని భావించబడుతున్నది. తొందరపడి మంత్రిపదవి తీసుకుని విఫలముద్ర వేయించుకునేకన్నా సమయం తీసుకోవటమే మంచిదని భావిస్తున్నాడట. ఎంబిసి కులాలకు ప్రతినిధిగా, వారి ఉద్ధారకునిగా రెండున్నర దశాబ్దాలుగా అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికార చక్రం తిప్పిన నితీశ్‌కుమార్ అనుయాయుల మద్దతును నిలుపుకునేందుకు బిజెపి ఆయనకు కేంద్రమంత్రి, కుమారునికి రాష్ట్రంలో మంత్రిపదవి ఇవ్వజూపింది. ఐదు నెలల క్రితం నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి ముఖంగా ఎన్నికల్లో ప్రచారం చేసి, లబ్ధి పొంది, ఇంతలోనే ఆయన్ను తొలగించి తమ మనిషిని గద్దె నెక్కించటం కాషాయదళం మార్క్ రాజకీయ కుతంత్రాలకు నిదర్శనం. మహారాష్ట్ర లో శివసేన అధినేత షిండె నుంచి ముఖ్యమంత్రి పదవిని బిజెపి లాక్కున్న తీరు ఈ సందర్భంగా గుర్తు చేసుకోదగింది.

సాంప్రదాయకంగా ఫ్యూడల్ దొరలు, అగ్రవర్ణాలకు అండగా ఉండే బిజెపి బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలలోకి చొచ్చుకుపోయి తన పరిధిని విస్తరించుకుని తిరుగులేని జాతీయ పార్టీగా ఎదిగే వ్యూహం ప్రకారం బిసి అయిన నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయటంతోపాటు రాష్ట్రాల్లో తమ ముఖ్యమంత్రుల వరణంలో కూడా ఒబిసి అభ్యర్థులను ముందుకు తెస్తున్నది. బిహార్ ప్రభుత్వ సారధిగా సమ్రాట్ చౌధరి ఎంపిక కూడా ఆ కోవలోనిదే. ఆయన కుష్‌వాహా(కోయిరీ) కమ్యూనిటీకి చెందిన ప్రముఖ ఒబిసి. నితీశ్ కుమార్ కూడా తన వారసునిగా అతన్నే ఎంచుకున్నాడు. ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ అన్నట్లు సమ్రాట్ 'లాలూ యాదవ్ స్కూలు తయారీ'. ఆయన బిజెపిలోకి వెళ్లక మునుపు ఆర్‌జెడిలో పనిచేశారు. ముఖ్యమంత్రి పదవికి ఆయన్ను బిజెపి ఎంపిక చేయటం లాలుప్రసాద్ ఓటు బ్యాంక్‌ను ఎదుర్కొనే వ్యూహంలో భాగం; ఆర్‌జెడి సోషల్ ఇంజనీరింగ్ (కులాల పొందిక)ను, యాదవ్–ముస్లిం (ఎంవై) ఐక్యతను నేరుగా సవాలు చేయటానికి ఉద్దేశించింది.

ముఖ్యంగా సమ్రాట్ కోయిరీ – కూర్మీ పునాదిపై కేంద్రీకరించటం ఆర్‌జెడి, జెడియు, బిజెపి మధ్య ఊగిసలాడుతూ ఉన్న ఒబిసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం. అయితే ఇది జెడియు ప్రజాపునాదిని కూడా తాకుతున్నందున ముమ్ముందు జెడి(యు)తో ఘర్షణ రావచ్చు. అయితే మహారాష్ట్రలాగా బిహార్‌లో కూడా సంపూర్ణ మెజారిటీతో ఏకపక్ష ఆధిక్యం బిజెపి ధ్యేయం అయినందున అటువంటి ఘర్షణకు సిద్ధపడవచ్చు. నితీశ్‌కుమార్ పార్టీని దెబ్బతీయటమే ధ్యేయంగా పనిచేస్తున్న లోక్‌జనశక్తి పార్టీ (ఆర్‌వి) అధినేత చిరాగ్ పాశ్వాన్‌ను పాచికగా బిజెపి ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం ఆ మూడు పార్టీలు సంకీర్ణం నెరపుతున్నప్పటికీ ఎవరి ఆకాంక్షలు వారివి. చిరాగ్ పాశ్వాన్ ప్రస్తుతం కేంద్రంలో మంత్రిగా ఉన్నా రు.

జెడియు నుంచి బిజెపి చేతిలోకి అధికార మార్పిడి బిహార్ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖిస్తుంది. ఇరవై ఏళ్లుగా నితీశ్‌కుమార్‌పై ఆధారపడి (మధ్యలో స్వల్పకాల విరామంతో) బిజెపి అధికారం నెరపుతోంది. సమ్రాట్ చౌధరి ముఖ్యమంత్రి కావటం పరిపాలనను జాతీయ పార్టీ చేతిలోకి తెస్తుంది.

నితీశ్ నాయకత్వంలో సాగిన వ్యక్తి కేంద్రీకృత విధానాలకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో కేంద్ర సంక్షేమ పథకాలు, కులాల పొందికల కూర్పుతోపాటు హిందూత్వ దూకుడుపై ముఖ్యమంత్రి కేంద్రీకరించవచ్చు. మోదీ–నితీశ్‌కుమార్ తనకు ఆదర్శమని ప్రమాణస్వీకారానంతరం సమ్రాట్ చెప్పారు. ప్రధానమంత్రి ప్రచారం చేస్తున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రభావం ప్రజల అనుభవంలోకి వస్తుందా, ప్రచారంగానే మిగిలిపోతుందా? ఐదు మాసాల క్రితం ఎన్నికల్లో ప్రధాని చేసిన శంకుస్థాపనలు, లెక్కకు మించిన వాగ్దానాలు అమలు కోసం ఎదురు చూస్తున్నాయి.

బిహార్‌లో 40 ఏళ్ల మీదట ఒక జాతీయ పార్టీ ప్రభుత్వం అధికారం చేబట్టింది. గతంలో కాంగ్రెస్ పరిపాలనలో బిహార్ అత్యంత తీవ్రమైన కుల, వర్గ పోరాటం చూసింది. లాలు ప్రసాద్ కుటుంబ జమానా తర్వాత గత ఇరవై ఏళ్లుగా నితీశ్ కుమార్ ఇబిసి కులాలు ఆధారంగా సోషల్ ఇంజినీరింగ్‌తో, బిజెపితో పొత్తుతో పేదలకు ఎంతో కొంత మేలు చేశారు. ఇప్పుడు సమ్రాట్ చౌధరి తమ హిందూత్వ దూకుడు రాజకీయాలతో రాష్ట్రాన్ని మళ్లీ సామాజిక ఘర్షణల్లోకి తీసుకెళతారా లేక నితీశ్ కుమార్‌లాగా మధ్యేమార్గంలో సామాజిక సామరస్యం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కేంద్రీకరిస్తారా వేచి చూడాల్సిందే. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న అధికారం చేతికి రావటంతో హిందూత్వ శక్తులు ఉత్సాహపడి ఉద్రేకాలు పెంచవచ్చు. వారిని అదుపులో ఉంచుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లటమే ముఖ్యమంత్రి ముందున్న సవాలు. ●



## ఎన్‌ఆర్‌సిని అమలు చేయడానికి పన్నిన కుట్ర

**మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ముడిపెట్టి భారతదేశాన్ని విభజించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ బిల్లులను కలపడం అనేది ఓటర్ల పేర్లను తొలగించి, ఎన్‌ఆర్‌సిని అమలు చేయడానికి పన్నిన కుట్ర. ప్రతిపాదిత చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నప్పటికీ, మహిళా కోటా చట్టాన్ని సవరించడానికి, డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన మూడు బిల్లులను కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, అమిత్ షా గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు ముందుకు వచ్చారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఎప్పుడో ఆమోదం పొందింది, మరి దాని అమలులో ఎందుకు జాప్యం జరిగింది? లోక్‌సభలో తమ పార్టీ నుంచి ఎన్నికైన ఎంపిలలో 37 శాతం మంది మహిళలే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ని ఉల్లంఘించినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆ పదవి నుంచి తొలగించాలి.**

– పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి
మమతా బెనర్జీ




## హీమోఫీలియా అంటువ్యాధి కాదు

రక్తస్రావానికి, రక్తం గడ్డకట్టే (బ్లడ్ క్లాటింగ్) లోపానికి సంబంధించిన రుగ్మతగా హీమోఫీలియాను గుర్తిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 5 లక్షలకు పైగా ప్రజలు ఈ వ్యాధి బారిన పడినట్లు అంచనా. ప్రమాదకరమైన హీమోఫీలియా వ్యాధితో పాటు ఇతర సంబంధిత వారసత్వ రుగ్మతల పట్ల పూర్తి అవగాహన కల్పించడానికి ప్రపంచ హీమోఫీలియా ఫెడరేషన్ చొరవతో ప్రతి ఏట 17 ఏప్రిల్‌న ప్రపంచ హీమోఫీలియా దినం లేదా వరల్డ్ హీమోఫీలియా డేను పాటించుట 1989 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ హీమోఫీలియా దినం ఇతివృత్తంగా రోగ నిర్ధారణ : చికిత్సకు తొలి మెట్టు అనబడే అంశాన్ని తీసుకోని అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచ హీమోఫీలియా ఫెడరేషన్ అనే సంస్థను స్థాపించిన ఫ్రాంక్ స్నాబెల్ పుట్టిన రోజు 17 ఏప్రిల్‌న ప్రపంచ ప్రపంచ హీమోఫీలియా డే పాటిస్తున్నాం. హీమోఫీలియా వ్యాధికి చికిత్సగా రక్తమార్పిడి పద్ధతిని పాటిస్తున్నారు.

**హీమోఫీలియా పట్ల అవగాహన:**

హీమోఫీలియా అంటువ్యాధి కానప్పటికీ హీమోఫీలియా సమస్యాగ్నికి ఆజ్యం పోస్తున్నాయి కరోనా లాంటి విపత్తులు. చిన్న గాయం అయినపుడు రక్తం కారడం, కొద్ది సేపటికి గడ్డకట్టడంతో రక్తస్రావం ఆగిపోయి ఆరోగ్యం సమకూరడం జరుగుతుంది. హీమోఫీలియా రుగ్మత కలిగిన వ్యక్తులకు గాయం అయినపుడు రక్తం గడ్డకట్టకుండా రక్తస్రావం కొనసాగి ప్రాణాంతక పరిస్థితి కూడా వస్తుంది. రక్తం గడ్డకట్టే లక్షణాల ను విశ్లేషించి హీమోఫీలియాను ఏ, బి రకాలుగా వర్గీకరిస్తారు. ప్రతి 5,000 మందిలో ఒక్కరికి హీమోఫీలియా ఏ, ప్రతి 20,000 మందిలో ఒక్కరికి హీమోఫీలియా బి రుగ్మతలు కనిపిస్తాయి. దాదాపు 80 శాతం హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు ఈ రుగ్మత ఉందని కూడా తెలియకపోవడం విచారకరం. గాయం అయినపుడు రక్తం గడ్డకపోవడం ప్రమాదకరం అని తెలుసుకోవాలి. హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అంతర్గత గాయాలు అయినపుడు రక్తస్రావం జరిగి మెదడు, కీళ్ళు, కండరాల్లోకి రక్తం చేరి ప్రాణాలు కూడా పోవచ్చని తెలుసుకోవాలి. భారతంలో దాదాపు 2 లక్షల హీమోఫీలియా రోగులు ఉన్నట్లు, ఇందులో కేవలం 20,000మందికి మాత్రమే ఈ వ్యాధి ఉందని తెలుసు. నేటికీ హీమోఫీలియా రుగ్మతకు సరైన చికిత్స అందుబాటులో లేకపోవడం శోచనీయం. అనువంశికంగా జీన్ మ్యుటేషన్ కారణంగా తల్లి నుండి పిల్లలకు సంక్రమించగల హీమోఫీలియా వ్యాధిపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడం కనీస అవసరంగా భావించాలి. గ్రామీణ ప్రజలకు హీమోఫీలియా ఒక శాపంగా మారడం, అంతర్గత/బాహ్య గాయాలు అయిన సందర్భాల్లో పరిస్థితి విషమించి ప్రాణాలు కూడా పోవచ్చని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

*(17 ఏప్రిల్ ప్రపంచ హీమోఫీలియా దినం సందర్భంగా)*

# సూక్ష్మంలో మోక్షం : అచ్ఛేదిన్ అర్థం ఇదేనా?



ఎం. కోటేశ్వరరావు

అదానీ, అంబానీ,గూగుల్, అమెజాన్‌లకు ప్రజల సొమ్మును రాయితీల రూపంలో ఇస్తే అత్త సొమ్ము అల్లుడు దానం చేస్తున్నట్లు ఏడవకండి. ఏడ్చి పెడబొబ్బలు పెట్టినా ప్రయోజనం లేదు. ఎప్పటికప్పుడు జనాన్ని ఏమార్చే ఊసరవెల్లులు రంగులనే కాదు, సిద్ధాంతాలను కూడా మార్చివేస్తున్నారు. వాస్తవాలను తలకిందులుగా చూపితే కొందరు తమ మెదళ్లను అలాగే ఉంచుకొని నిజమే అంటారు. సంపద సృష్టికర్తలు జనం. కానీ కొందరు ముందు చెప్పుకున్న కంపెనీల వంటివే సృష్టికర్తలని చెబుతూ వాటికి సర్వం సమర్పించుకుంటున్నారు. దాన్ని సమర్థించుకొనేందుకు ఊట సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. ఈ సిద్ధాంతం ఎప్పుడు వచ్చింది. సూక్ష్మంలో మోక్షంలా ఒక్క ముక్కలో చెప్పాలంటే సంపదలను పెరగనిస్తే వాటి ఫలాలు క్రమంగా ఊటనీరులా సమాజంలోకి దిగుతాయి. అందరికీ ఉపయోగం. ఎవరెన్ని కబుర్లు చెప్పినా జరుగుతున్నది తద్విరుద్ధంగా ఉంది.

తాజాగా "భారత సంపదల గుర్తింపు నివేదిక 2026" (వెల్త్ ట్రాకర్ ఇండియా రిపోర్టు 2026) ప్రకారం మనదేశంలో సంపన్నుల్లో అగ్రభాగాన ఉన్న 1,688 మంది సంపద దేశ జిడిపిలో సగానికి సమానం. ఇంత అసమానత, కేంద్రీకరణ బ్రిటీష్ వారి కాలంలోనూ, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనూ లేదు. 1980దశకం వరకు కూడా నేడున్నంత తీవ్రంగా లేవు. ఊట సిద్ధాంతం చెప్పటం ప్రారంభించిన తరువాత కిందికి బదులు సంపద పైకి చేరుతున్నది.ఈ 1,688 మంది కలవారి మీద రెండు నుంచి ఆరుశాతం సంపద పన్ను విధిస్తే ఏటా పదిలక్షల కోట్ల రూపాయల వరకు రాబడి వస్తుందని, ఆ మొత్తాన్ని సంక్షేమానికి వినియోగించవచ్చని సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ ఎకౌంటబులిటీ సిఎఫ్ఏ (ఆర్థిక జవాబుదారీతన కేంద్రం) రూపొందించిన సదరు నివేదిక పేర్కొన్నది.ఎప్పటికైనా వామపక్షాలు అధికారానికి వచ్చి పిల్లిమెడలో గంట కట్టాల్సిందే తప్ప మిగిలినవారెవరూ అలాంటి ఆలోచన కూడా చేయరు. మరోవైపు నిధుల కొరత గురించి శ్రీరంగ నీతులు చెబుతారు. ఉదాహరణకు చంద్రబాబు నాయుడు కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు సవరించేందుకు ముందుకు రారు. గూగుల్ వంటి ధనిక సంస్థలకు వేల కోట్ల రూపాయలు రాయితీలుగా ఇచ్చేందుకు తాంబూలాలు ఇచ్చేశారు.రేవంత రెడ్డి బాట కూడా అదే. పన్నెండేండ్ల క్రితం నరేంద్రమోడీ చెప్పిన కబుర్లలో అచ్ఛేదిన్(మంచి రోజులు) ఒకటి.దేశంలో మోడీని చూసి ఓట్లు వేసిన ఎవరికైనా ఐదు సంవత్సరాల్లో రాబడి 400 శాతం పెరిగిందా? మోడీ మద్దతు ఉన్న అంబానీ, అదానీ, జిందాల్,శివనాడార్, సునీల్ మిట్టల్ వంటి వారికి 2019–25 సంవత్సరాలలో సంపదలు దాదాపు 400శాతం పెరిగాయి. వాటిలోంచి కొంత తీసి ఎన్నికల బాండ్ల రూపంలో వేలాది కోట్ల రూపాయలను బిజెపికి కట్టబెట్టారు. అనధికారికంగా సమర్పించుకున్న మొత్తాలకు లెక్కలేదు.ఎంత డబ్బు లేకపోతే కేరళలోని పాలక్కాడ్‌లో బిజెపి మద్దతుదారులు ఓటుకు ఐదువేల రూపాయలు ఎలా పంచగలిగారు ?

నూతన ఆర్థిక విధానాలకు ఆద్యులం మేమే అని కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటుంది. వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్న ఖ్యాతి మాదే అని బిజెపి ఢంకా బజాయించి మరీ బాకాలూదుతున్నది.వందకోట్ల డాలర్ల సంపద కలిగిన శ్రీమంతుడు 1991దేశంలో ఒక్కరే, అలాంటిది ఇప్పుడు 358 మంది ఉన్నారు.నివేదికలో పేర్కొన్న 1,688 మంది సంపద విలువ 166లక్షల కోట్లు, ఇది మన జిడిపిలో దాదాపు సగం. దేశంలోని ఎగువ ఒక శాతం మంది సంపద 2019లో 36.5శాతం ఉండగా 2022 నాటికి 40.1శాతానికి పెరగ్గా ఇదే కాలంలో దిగువ 50శాతం మంది వాటా 6.8 నుంచి 6.4శాతానికి దిగజారింది. అచ్ఛే దిన్ ఎవరికి ? ఇక వెయ్యి కోట్లకు మించి ఆస్తులున్న వ్యక్తుల సంఖ్య 2019–25 మధ్య 77శాతం పెరగ్గా, వారి సంపద (31లక్షల కోట్ల నుంచి 88లక్షల కోట్లకు) 227శాతం పెరిగింది.వీరిలో అదానీ ఆస్తి 625, ముకేష్ అంబానీ సంపద 153శాతం పెరిగింది.కేంద్ర ప్రభుత్వం వారిపట్ల ఎలాంటి సానుకూలత, అభిమానం చూపకుండానే స్వంతంగా చెమటోడ్చి పెంచుకున్నారని చెవుల్లో పూలు పెట్టుకొని జనం నమ్మాలి. ఈ అపర కుబేరుల మీద పన్ను వేస్తే వచ్చే అదనపు రాబడితో విద్య, వైద్యం వంటి సేవలకు జిడిపిలో అదనంగా ప్రతి రంగానికి ఒక్కో శాతం ఖర్చు పెంచవచ్చు, వృద్ధులందరికీ నెల నెలా పన్నెండు వేల రూపాయల పెన్షన్ ఇవ్వవచ్చు. మానవత్వం ఉట్టి పడే నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ ఎంతో తెలుసా ? 80 ఏండ్లలోపు వారికి నెలకు రు.200, ఆపైబడిన వారికి రు.500, వితంతువులకు రు.500, వికలాంగులకు రు.300–500 మాత్రమే. మోడీ ఏలుబడిలో ఒక్క పైసా కూడా పెంచలేదు. అంతకు ముందు యుపిఏ ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాలనే ఇస్తున్నారు. అంతకు మించి ఇస్తున్నారంటే అవి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఉదారత్వమే.ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న నాలుగువేలు, తెలంగాణాలో ఉన్న రెండువేలల్లో కేంద్ర ప్రభుత్వ వాటా కేవలం రెండు, ఐదు వందలు మాత్రమే. అందుకే ఎప్పుడూ ఈ పెన్షన్లలో మా మోడీ గురించి చెప్పరేం అని ఏ ఒక్క బిజెపి నేతా డిమాండ్ చేయరు.

అపర కుబేరుల మీద సంపద పన్ను విధిస్తే ఏం చేయవచ్చో కూడా నివేదిక పేర్కొన్నది. అంబానీ నుంచి రెండుశాతం పన్ను వసూలు చేస్తే దేశంలో ఉన్న 185 లక్షల మంది పదవ తరగతి విద్యార్థులకు మూడేసి లాప్‌టాప్‌లు ఉచితంగా ఇవ్వవచ్చు. లేదా 2.85కోట్ల మంది తల్లులకు రెండు సంవత్సరాల పాటు ఆర్థిక సాయం చేయవచ్చు. ఏడాదికి రు.18వేలు ఇస్తే అయ్యే ఖర్చు సంవత్సరానికి రు.51,300 కోట్లు.

అదానీ నుంచి రెండుశాతం పన్ను వసూలు చేస్తే దేశమంతటా రెండు సంవత్సరాల పాటు ప్రాథమిక ఆరోగ్యానికి ఖర్చు చేయవచ్చు లేదా 87 కోట్ల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వవచ్చు.లేదా ఎనిమిది కోట్ల కుటుంబాలకు చెడు గాలి నుంచి రక్షణకు శుద్ధి చేసే పరికరాలను ఉచితంగా అందించవచ్చు.సావిత్రీ జిందాల్ నుంచి వసూలు చేసే పన్నుతో దళితులు, గిరిజన విద్యార్థులకు కొన్ని సంవత్సరాలపాటు స్కాలర్‌షిప్పులు ఇవ్వవచ్చు. లేదా పదివేల రూపాయల చొప్పున రెండున్నర కోట్ల మంది బాలికలు తమ విద్యను మెరుగుపరుచుకొనేందుకు ఇవ్వవచ్చు.కార్పొరేట్‌లు, వ్యక్తులకు పన్నుమినహాయింపులు ఇస్తున్న కారణంగా ఆ భారాన్ని సామాన్యులు భరిస్తున్నారు.

గత పదకొండు సంవత్సరాల్లో కార్పొరేట్లకు రు.19.6లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. అయితే రికార్డుల్లో వాటిని పారుబాకీలుగా చూపుతారు తప్ప రద్దు చేసినట్లు ఉండదు.మన దేశం జి 20 కూటమిలో భాగస్వామి. జోసెఫ్ స్టిగ్లిజ్ అనే ఆర్థికవేత్త నాయకత్వంలో ప్రపంచ అసమానతల గురించి పరిశీలనకు ఒక కమిటీని వేశారు. అసమానతల పెరుగుదల విధానపరంగా ఎంచుకున్న అంశమని, సంపద పెరిగే కొద్దీ పన్ను మొత్తాలను పెంచే విధంగా ఆ విధానాన్ని మార్చాలని కమిటీ నివేదిక పేర్కొన్నది. కానీ మనదేశంలో జరుగుతున్నదేమిటి ? అసమానతలను తగ్గించాలని మన రాజ్యాంగమే చెప్పింది.అధికారంలో ఎవరున్నా దాన్ని తుంగలో తొక్కారు. చివరకు మోడి సంపదపన్నునే రద్దు చేశారని సదరు నివేదిక వ్యాఖ్యానించింది.ఎందుకయ్యా అంటే వసూలు చేసే పన్ను కంటే అందుకయ్యే ఖర్చు ఎక్కువగా ఉందని చూపారు.చట్టంలో లోపాలు ఉన్నాయన్నారు. ఇంట్లో ఎలుకలు ఉన్నాయని వాటిని చంపటం కంటే ఇల్లుతగులబెట్టటమే లాభదాయకమని చెప్పినట్లుగా ఉంది.చట్టాల్లో ఉన్న అనేక లోపాలను సరిచేస్తున్నామని చెప్పిన వారు ఈ చట్టాన్ని ఎందుకు సరి చేయలేదు ? 1957 చట్టం ప్రకారం రు.30 లక్షల సంపద మీద ఒక శాతం పన్ను చెల్లించాల్సి ఉంది.దాన్ని రద్దు చేసి ఒక కోటికి మించి రాబడి ఉన్నవారు చెల్లించే పన్ను మీద రెండుశాతం సర్‌ఛార్జి విధిస్తున్నారు. ఉదాహరణకు కోటి రూపాయల రాబడిలో మినహాయింపులన్నీ పోను 20లక్షలకు పన్ను చెల్లించాల్సి వస్తే దాని మీద రెండుశాతం విధిస్తారు. ధనికులకు ఎన్ని రాయితీలు కల్పిస్తున్నారో చూడండి.

దేశంలో అసమానతల గురించి సిఎఫ్ఏ ప్రచార విభాగ డైరెక్టర్ అనిర్బన్ భట్టాచార్య మాట్లాడుతూ " నేడు రెండు భారత్‌లు ఉన్నాయి.ఒక భారత్‌లో ఎగువన ఉన్న వేళ్లమీద లెక్కించదగిన కొద్ది మంది సంపదలు లక్షల కోట్లుగా పెరుగుతుంటే మరో భారత్ అప్పులపాలవుతున్నది " అన్నారు. "నోట్ల రద్దు మొదలు కరోనా మహమ్మారి వరకు గత పదేండ్లుగా బతకాలంటే ఎలాంటి ప్రశ్నలు వేయవద్దని జనాలకు చెప్పిన వారు ఇప్పుడు ఎల్‌పిజి, బొగ్గు గురించి కూడా అడగవద్దంటున్నారని" ధనికుల మీద పన్నువేయాలనే ప్రచార కర్త రాజశేఖర్ వ్యాఖ్యానించారు.కష్టపడే సామాన్యులు రోడ్ల మీద వరుసల్లో నిలుస్తుంటే దేశంలోని అపరకుబేరులకు దోపిడీ కొనసాగించేందుకు ఉచిత పాస్‌లు ఇస్తున్నారని కూడా అన్నారు. నివేదిక రూపకల్పనలో భాగస్వామి జాకబ్ జోషి మాట్లాడుతూ ఆందోళనకర స్థాయికి సంపద కేంద్రీకరణ పెరిగినప్పటికీ విధానపరమైన చర్చలో దాని ఊసే లేదన్నారు. అసమానతలు సాధారణం అయ్యాయని, సంపదపన్ను అద్భుతాలు చేస్తుందని కాదు గానీ పేదల మౌలిక హక్కుల అమలుకు కొంత మేర దోహదం చేస్తుందని కూడా చెప్పారు.

అసమానతలు పెరిగితే ఏమౌతుంది? మానవాభివృద్ధి దిగజారిపోతుంది. ప్రపంచ జిడిపిలో పదవ స్థానంలో ఉన్న దేశాన్ని ఐదవదిగా తీసుకురావటం తమ ఘనత అని బిజెపి గొప్పలు చెప్పుకుంటుంది. కాసేపు అంగీకరిద్దాం. తలసరి జిడిపిలో సంగతేమిటి ? దున్నబోతే దూడల్లో మెయ్యబోతే ఎద్దుల్లో అన్నట్లుగా ఉంది. ఐఎంఎఫ్ 2025 సమాచారం ప్రకారం చైనా 13,806 డాలర్లతో 99వదిగా ఉంది, మనదేశం 2,818 డాలర్లతో 166వదిగా ఉంది. మానవాభివృద్ధి సూచికల్లో 2012లో 136వ స్థానం నుంచి మోడీ అధికారానికి వచ్చిన 2014లో 130వదిగా కాస్త పెరిగింది.సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ పాలనలో 2025లో కూడా 130వదిగానే ఉంది.సాధించిన అభివృద్ధి ఏమిటి ? ఇంక మోడీ ప్రత్యేకత ఏముంది!

కాషాయదళాలు చెప్పే ఆవు పాలు అంబానీ, అదానీలకు; పేడ, మూత్రం జనాలకు పంచితే ఇదే జరుగుతుంది. మానవాభివృద్ధి సూచికలో చైనా 0.797 పాయింట్లు కలిగి ఉంటే మనదేశం 0.685 దగ్గర ఉంది.అసమానతలు పెరిగే కొద్దీ ఆ సంఖ్య పెరగదు.మహాకవి గురజాడ చెప్పినట్లు దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్ అన్నది నిజం కావాలంటే సంపదలు కేంద్రీకృతమైతే కుదరదు. పిండికొద్దీ రొట్టె అన్నట్లుగా ఆదాయం ఉంటేనే ఆరోగ్యకరమైన, గౌరవప్రదమైన జీవనం సాధ్యం.సర్వేజనా సుఖినోభవంతు అంటే చాలదు, అందుకు కార్యాచరణ ముఖ్యం !

# స్కైబాబకు జాతీయ సమైక్యత అవార్డు
# అక్షరానికి వచ్చిన గౌరవం



మౌనంలో నెట్టివేయబడిన జీవితాలకు భాషనిచ్చిన రచయిత స్కైబాబకు లభిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు బాబూమియా బ్యాండ వాలే జాతీయ సమైక్యత అవార్డు ఒక వ్యక్తిగత సత్కారం మాత్రమే కాదు. అది మరుగున పడిన అనుభవాలను సాహిత్య మధ్యలో నిలబెట్టిన అక్షరానికి వచ్చిన గౌరవం.

సాహిత్యంలో కొన్ని సందర్భాలు కేవలం వ్యక్తిగత విజయాలుగా మాత్రమే నిలవవు. అవి ఒక సమాజపు మౌనానికి, కనిపించనట్టు చేయబడిన జీవితాలకు, వినిపించనట్టు చేయబడిన అనుభవాలకు, గౌరవం దక్కని మనుష్య గాథలకు వచ్చిన గుర్తింపులుగా నిలుస్తాయి. స్కైబాబకు లభిస్తున్న ఈ గౌరవం అలాంటి అరుదైన సందర్భం. ఇది ఒక రచయితకు వచ్చిన సత్కారం మాత్రమే కాదు; తెలుగు సాహిత్యంలో మరుగున పడిన అనుభవాలను మధ్యలో నిలబెట్టిన అక్షరానికి వచ్చిన గుర్తింపు. స్కైబాబ పేరు తెలుగుసాహిత్యంలో ఒక రచయిత పేరుకంటే ఎక్కువ; అది ఒక స్వరం, ఒక సాక్ష్యం, ఒక నైతిక బాధ్యత. కవి, కథకుడు, నవలాకారుడు, పాత్రికేయుడు, సామాజిక కార్యకర్తగా ఆయన తన ప్రత్యేక ఉనికిని నిర్మించుకున్నారు.



గాజోజి శ్రీనివాస్
9948483560

ముఖ్యంగా ముస్లిం జీవితంలోని అంతర్గత, బాహ్య పార్శ్వాలను తెలుగుసాహిత్యంలో ప్రతిష్ఠించడంలో ఆయన చేసిన కృషి విశేషమైనది. చాలా కాలంగా మన మధ్యలో ఉన్నప్పటికీ సాహిత్యంలో పరాయివాడిగా నిలబెట్టబడిన ఒక జీవితాన్ని ఆయన తన అక్షరంతో లోపలికి తీసుకువచ్చారు.

తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవితం తరచుగా రెండు వైపుల మధ్య బంధించబడింది. ఒక వైపు అలంకారాత్మక రొమాంటిసిజం, మరోవైపు అనుమానం, అపోహ, భయం. ఈ రెండూ ఒకే రకమైన దూరాన్ని సూచిస్తాయి. దగ్గరగా చూడలేకపోవడం, వినలేకపోవడం, అర్థం చేసుకోలేకపోవడం. స్కైబాబ రచన ఈ దూరాన్ని చెరిపేసింది. ఆయన ముస్లిం జీవితాన్ని ఒక విషయంగా కాదు, ఒక అంతరంగ అనుభవ ప్రపంచంగా మన ముందుంచారు. అక్కడ గాయాలున్నాయి, మౌనాలున్నాయి, అవమానాలున్నాయి; కానీ ప్రేమ ఉంది, కుటుంబం ఉంది, ఆత్మగౌరవం ఉంది, మౌనమైన ప్రతిఘటన ఉంది.

ఆయన కథల శక్తి వాటి సరళతలోనే ఉంది. ఆర్భాటం లేకుండా, చిన్న సంఘటనలతోనే ఆయన ఒక సమాజపు అంతర్గత జీవనాన్ని తెర పైకి తీసుకువస్తారు. పాఠకుడు చదివేది కేవలం కథ కాదు, ఒక అంతర్గత చరిత్ర.

స్కైబాబ రచనలో ప్రధాన బలం ప్రతినిధిత్వపు నిజాయితీ. ఆయన రాత మన గురించి రాయండి అన్న స్థాయిని దాటి, మన జీవితాన్ని అర్థం చేసుకుని గౌరవంతో రాయాలి అన్న సాహిత్య నైతికతగా మారుతుంది. అందుకే ఆయన రచనలో బాధతో పాటు గౌరవం కూడా ఉంటుంది. అదే సమయంలో ఆయనలోని ద్వంద్వ నిజాయితీ ఆయనను ప్రత్యేకం చేస్తుంది. ప్రధాన సమాజం ముస్లింలను ఎలా పక్కకు నెడుతుందో ఆయన చూపిస్తారు; అలాగే ముస్లిం సమాజంలోని లోపాలను కూడా విమర్శిస్తారు. ప్రేమలో విమర్శ, విమర్శలో మానవత్వం ఇవి ఆయన రచనకు బలం.

ఇప్పటి కాలంలో సంభాషణ తగ్గి శబ్దం పెరుగుతోంది. వినడం కంటే తీర్పు చెప్పడం ఎక్కువైంది. ఇలాంటి సమయంలో అక్షరాన్ని నైతిక బాధ్యతగా మోసే రచయితలు మరింత అవసరం. స్కైబాబ అలాంటి రచయిత. ముస్లిం సమాజంలో అంతర్గత సంస్కరణల అవసరాన్ని గుర్తిస్తూ ఆయన దునియాదారి అనే సామాజిక వేదికను ఏర్పాటు చేసి పనిచేస్తున్నారు. మదర్సాల ఆధునీకరణ వంటి అంశాలపై వ్యాసాలు రాయడమే కాకుండా, దీన్ కే సాత్ దునియా కో లేకే చలో అనే నినాదంతో సామాజిక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. అలాగే ముస్లిం కథకులు, కవుల రచనలను సమీకరించి జల్ జలా, అజా, అలావా, ముఖామీ, వతన్, దర్ద్, మిల్ఝులే వంటి సంకలనాలను వెలువరించారు.

ఆయన రచనలు కేవలం తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లోకి కూడా విస్తరించాయి. ఆయన కథలు ఇంగ్లీషు, హిందీ, మలయాళ భాషల్లోకి అనువదింపబడి పుస్తకాలుగా వెలువడ్డాయి. తాజాగా మరాఠీ అనువాదం కూడా వెలువడుతోంది. ఈ అనువాదాన్ని ముస్లిం సత్యశోధక్ మండల్ మహిళా విభాగం నాయకురాలు డా. బెనజీర్ తంబోలి చేశారు. ఈ కథలు ముందుగా వారి పత్రికలో ధారావాహికగా ప్రచురితమయ్యాయి.

ఆయన రచనలో మరణం కూడా ఒక తాత్విక అనుభవంగా కనిపిస్తుంది. అది చీకటి కాదు, జీవితాన్ని మరొకసారి ఆలోచించే క్షణం. ఇంకా చెప్పాల్సిన సత్యాల పట్ల ఒక రచయితగా ఆయన బాధ్యత అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.

ఇలాంటి రచయితకు జాతీయ సమైక్యత పేరిట అవార్డు రావడం ఎంతో సముచితం. ఎందుకంటే సమైక్యత అనేది కేవలం నినాదం కాదు. ఒకరి బాధను మరొకరు అర్థం చేసుకోవడం. స్కైబాబ రచన అదే లోతైన సమైక్యతను మోస్తుంది. తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన ఆయన, బహుజన సాహిత్య ఉద్యమంలోనూ తన వంతు కృషిని కొనసాగిస్తున్నారు.

ముస్లిం సత్యశోధక్ మండల్ వంటి లౌకిక, సంస్కరణ విలువలకు కట్టుబడి ఉన్న సంస్థ చేతుల మీదుగా ఈ గౌరవం రావడం మరింత అర్థవంతం. హమీద్ దల్వాయి ఆలోచనల నుంచి పుట్టిన ఈ సంప్రదాయం, స్కైబాబ అక్షరాన్ని గౌరవించడం యాదృచ్ఛికం కాదు, విలువల సహజ సంబంధం.

స్వాతంత్ర్యం అనే పదం ఇక్కడ మరింత లోతుగా అర్థమవుతుంది. అది కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి కాదు; వివక్ష, మూఢత్వం, అన్యాయం నుంచి విముక్తి కూడా. ఆ రెండో స్వేచ్ఛ కోసం పోరాడే అక్షరమే నిజమైన సాహిత్యం. స్కైబాబ రచన ఆ దిశలో నిలుస్తుంది.

ఈ అవార్డును కేవలం వ్యక్తిగత విజయంగా చూడకూడదు. ఇది తెలుగు సాహిత్యంలో మరుగున పడిన అనుభవాలు సాధించిన స్థాయికి సంకేతం.

స్కైబాబకు లభించిన ఈ గౌరవం ఆయనకు వచ్చిన అవార్డు మాత్రమే కాదు. అది గుర్తింపు దక్కని, నలిగిన మనుష్య గౌరవాన్ని సాహిత్య మధ్యలో నిలబెట్టిన అక్షరానికి వచ్చిన గౌరవం.

అక్షరం నిజంగా మనిషి వైపు నిలబడినప్పుడు, అది కేవలం రాత కాదు— సమాజం తనను తాను చూసుకునే అద్దం అవుతుంది.

# అర్హులైన ప్రతి లబ్ధిదారుకూ సంక్షేమ పథకాలు

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కంది మండలం లోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా రైతు ఋణమాఫి ,రైతు భీమా, ఇందిరమ్మ, ఇళ్లు , స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు ,కొత్త రేషన్ కార్డులు ,పాస్‌బుక్కులు ,సన్నబియ్యం, పంపిణి వైద్య సేలు తదితర పథకాల లబ్దిదారుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహార పథకం, ఇందిరమ్మజీవిత కుటుంబ బీమా ,ఇంటర్మీడియట్ విద్యార్థులకు మద్యాహ్న భోజన పథకం విస్తరణ వంటి నూతన పథకాన్ని అవగాహన కల్పించారు. కొందరు లబ్దిదారులు తమకు అందిన ప్రయోజనాలను వెల్లడిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీజీఐఐసి చైర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి కుటుంబానికి చేరేలా కల్పిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ యంత్రాలు ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిచేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మార్చి 6 నుంచి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే శానిటేషన్ , ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించామని ఏప్రిల్ 2న గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రతి గ్రామంలో పోలీసు శాఖతో కలిసి రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికి చేరేలా చూడటం సర్పంచుల బాద్యత అని పేర్కొన్నారు. జిల్లాలో సివిల్ ద్వారా మూడు నెలల రేషన్ పంఫిణి జరుగుతోందని ఇప్పటికి 80 శాతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే రభి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అందుకు సర్పంచులు ఎస్ హెచ్.జి మహిళలు సహకరించాలని కోరారు. కాంపౌండ్ వాల్స్ ,గ్రామ పంచాయతీ అంగన్వాడీ కొత్త భవనాల పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ఆయా సర్పంచులు చొరవ చూపాలన్నారు. డిఆసి జిఎం తుల్జానాయక్, ఎంపిడిఓ శ్రీనివాస్ ,తహసీల్దార్ రవికుమార్, ఎంపిఓ మహేందర్‌రెడ్డి, సర్పంచులు ,ఉప సర్పంచులు మండల సమాఖ్య ప్రతినిధులు ,మహిళలు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా కృషి



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల సభ నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు సమీక్షించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు త్వరితగతిన అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని గ్రామాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడటంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని అధికారులు కోరారు. అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బక్కయ్య, ఎంపిడివో ఉమార్ షరీఫ్, ఎస్ఐ ఉదయ్ కిరణ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు.. కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/బైంసా :** మొక్కజొన్న రైతులు ఎలాంటి ఆందోళన చెందవదని అంతటా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు.రేపు నాలుగు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. బాసర, ముధోల్,లోకేశ్వరం,తానూర్ మండలాల్లో రేపు కొనుగోలు ప్రారంభింస్తామని,ఈపాటికి కొన్నిచోట్ల కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో మొక్కజొన్న పంట అధికంగా ఉన్నందున ఎక్కువ స్థాయిలో కేంద్రాలు ఏర్పాటు చేస్తామని,అవసరం ఉన్న చోట్ల సబ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.తక్కువ ధరకు తమ పంటను రైతులు అమ్ముకోవద్దని,ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను అమ్మాలని ఆయన సూచించారు.కేంద్రాల్లోనే పంటలను అమ్మాలని ఆయన సూచించారు.కేంద్రాల విషయంలో సంబంధిత శాఖ మంత్రికి,అధికారులకు మాట్లాడడం జరిగిందని,అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

## ప్రజా సమస్యలను తీర్చటమే.. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కార్పొరేషన్ స్థాయిలో ప్రజలకు ఉన్న సమస్యలను త్వరితగతిన తీర్చటమే లక్ష్యంగా నిజామాబాద్ మునిసిపల్ మేయర్ కె. ఉమారాణి అన్నారు. గురువారం నిజామాబాద్ నగర పాలక సంస్థలో స్టాండర్ట్ ఆపరేటివ్ ప్రొసిజర్ కార్యక్రమాన్ని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉదయం 8.30 నుండి 11.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ప్రదానంగా ప్రజల ప్రధాన సమస్యలైన ఇంటి పన్నులు, కొత్త ఇంటి నెంబర్లు, నల్లా కనెక్షన్, వీధి కుక్కల బెడద, ఇంటి పన్ను తగ్గింపు, దోమల నివారణ, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం గృహ జ్యోతి పథకం, ఇందిరమ్మ మహిళా శక్తి బ్యాంకు లింకేజీ, కొత్త రేషన్ కార్డులు, చేయూత పథకం, మ్యూటేషన్, డ్రైనేజీ సమస్యలు, ఇంటి నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై ప్రజలకు సత్వర సేవలు అందించే నిమిత్తం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, దీనికి నిజామాబాద్ కార్పొరేషన్ ప్రజలు పూర్తిగా సహకరించి పెద్ద ఎత్తున పాల్గొనడం చాలా ఆనందదాయకమన్నారు.

## ప్రజాపాలనతోనే గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం /పెంచికల్‌పేట్ :** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికతోనే గ్రామాల రూపురేఖలు మారుతాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఏప్రిల్ నుండి జూన్ వరకు అమలయ్యే ఈ ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, ఆరోగ్యం, విద్య, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.ఎల్కపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి 8 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు గాను సర్పంచ్ రామ్ చందర్, గ్రామస్తులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాల సమస్యలు నాదృష్టికి తేవాలి

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమీక్షా సమావేశానికి సబ్‌కలెక్టర అభిగ్యాన్ మాల్వియ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 99 రోజుల కార్యాచరణ సంక్షేమ పథకాల అమలు అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపంచారు. సబ్‌కలెక్టర మాట్లాడుతూ గ్రామాల్లోని మేజర్ సమస్యలను అధికారులు పరిష్కరించకుంటే తన వద్దకు రావలని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాకేష్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో.. రైతులకు రక్షణ చర్యలు

### జిల్లా కలెక్టర్ హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర ఎండలు, వడగాలుల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు, సిబ్బందికి రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. చల్లటి తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో కూడిన చలివేంద్రాలను అందుబాటులో ఉంచాలని ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు తమ ధాన్యాన్ని ఉదయం 11 గంటల లోపు లేదా సాయంత్రం 4 గంటల తర్వాత తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళల్లో తూకం వేయడం, ధాన్యం దించడం వంటి పనులను పరిమితం చేయాలని, రైతులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు టోకెన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లు, ఐస్ ప్యాక్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా 108 అంబులెన్స్ వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. అకస్మాత్తుగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## మెదక్‌ను 'జీరో' యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టంగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్‌అలైవ్'' కార్యక్రమం గురువారం జిల్లా కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో పోలీస్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు కారు డ్రైవర్లకు హెల్మేట్, సీట్ బెల్ట్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మానవ తప్పిదాలేనని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం చేయాలని, ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అదేవిధంగా ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స, క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించే విధానాలపై ప్రజలకు అవగాహన కలిపంచాల్సిన అవసరం ఉందన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచాలుగా పనిచేస్తాయని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యమే ప్రాణాపాయానికి దారి తీసుందని, యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు నడపనీయకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ పై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట స్వామి, డిఎస్పీ ప్రసన్న కుమార్, అధికారులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## నిర్మల్‌లో 'అరైవ్‌అలైవ్'అవగాహాన సదస్సు




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు,ప్రజల ప్రాణ భద్రతను పెంపొందించేందుకు పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ''అరైవ్ అలైవ్'' కార్యక్రమం నిర్మల్‌లో ఉత్సాహంగా సాగింది.ఇందులో భాగంగా ఈరోజు నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్‌లో కౌన్సిలర్లకు రోడ్డు భద్రతా నిబంధనలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సదస్సులో వాహనదారులు పాటించాల్సిన నియమాలను అధికారులు కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా వాహనం నడిపేవారు రోడ్డు భద్రతా నిబంధనలను ఒక క్రమశిక్షణలా పాటింపచాలని ఎఎస్పీ ఉపేందర్ రెడ్డి,పట్టణ సిఐ సమ్మయ్య సూచించారు.ప్రమాదాలకు ప్రధాన కారణమవతున్న అనాలోచిత ఓవర్‌టేకింగ్‌లను మానుకోవాలని,ప్రతి వాహనదారుడు రోడ్డుకు ఎడమ వైపునే ప్రయాణించే సంస్కృతిని అలవాటు చేసుకోవాలని కోరారు.ప్రాణ నష్టాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషించే సీట్ బెల్ట్,హెల్మెట్ ధరించడం అనేది కేవలం నిబంధన మాత్రమే కాదని,అది ఒక ప్రాణ రక్షక కవచమని వారు స్పష్టం చేశారు.మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేసే ప్రతి నిబంధన ప్రజల క్షేమం కోసమేనని,వీటిని ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాలు సంబంధిత కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.కౌన్సిలర్లు తమ తమ వార్డులో బాధ్యతాయుతంగా వ్యవహరించి,ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. నిర్మల్ టౌన్ ఎస్ఐ అజయ్,వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని ప్రతినబూనారు.

## నరేందర్‌రెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసి వేం నరేందర్‌రెడ్డిని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కలిసి కాంగ్రెస్ నాయకులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులో,బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మునిపల్లి సాయరెడ్డి, బాసా వేణుగోపాల్ యాదవ్ ఉన్నారు.



## ఎంపి తేజస్వీసూర్యను బర్తరఫ్ చేయాలి

### తెలంగాణ అమరుల త్యాగాన్ని కించపరుస్తున్న బిజెపి

### జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి ఆగ్రహం



**ప్రజాపక్షం / గజ్వేల్:** తెలంగాణ అమరుల త్యాగం, ప్రజల ఆత్మగౌరవాన్ని బిజెపి దెబ్బతీస్తుండగా, ఆ పార్టీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ను పాకిస్తాన్ తో పోల్చడం సిగ్గుచేటని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ అమరుల త్యాగాలను కించపరిచే విధంగా ఎంపి తేజస్వి సూర్య మాట్లాడినప్పటికీ ఆ పార్టీ తెలంగాణ ఎంపీలు అడ్డుకోకపోవడంతో వారి నైజం బయటపడిందని నిలదీశారు. దేశంలో మూడు రాష్ట్రాలను ప్రకటించిన బిజెపి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎన్నో అడ్డంకులు సృష్టించిందని, ఇక్కడి ప్రజల ఆగ్రహానికి గురవుతామనే భయంతో వెనకడుగు వేసిందని గుర్తు చేశారు. తెలంగాణలో 1200 మంది యువకుల ఆత్మబలిదానాలకు బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కారణం కాగా, అలుపెరుగని ఉద్యమాలతో మాత్రమే ప్రధాని మన్మోహన్ సింగ్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించినట్లు స్పష్టం చేశారు. అమరుల త్యాగాలు, బలిదానాలను కించపరిచిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్యను వెంటనే భర్త రఫ్ చేసి, ఆ పార్టీ తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ప్రజల ఆగ్రహానికి బిజెపి గురికాక తప్పదని వివరించారు.

## నేడు రాష్ట్రవ్యాప్తంగా నల్ల బాడ్జీలతో ఉద్యోగుల నిరసన

### పరిష్కారం కోరుతూ..

### టిజిఇజెఎసి సమరశంఖం




**ప్రజాపక్షం/నిర్మల్ :** తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు 15.25 లక్షల మంది ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్ల చిరకాల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ టిజిఇజెఎసి నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది.నిర్మల్ జిల్లా పెన్షన్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశ నిర్ణయం మేరకు,రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలతో పాటు హైదరాబాద్ సిటి(హెచ్‌ఓడీ) సెక్రటేరియట్ పరిధిలోని అన్ని మండల,డివిజన్,జిల్లా కార్యాలయాల్లో ఉద్యోగులు నేడు నల్ల బాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేయనున్నారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిశీలించి,పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తున్నారు.ముఖ్యంగా గత 30 నెలలుగా పెండింగ్‌లో ఉన్న రెండవ పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించి,జూన్ 2వ తేదీ లోపు 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేశారు.ఒకవేళ నిర్ణీత గడుపులోగా పిఆర్సి అమలు కాకపోతే తదుపరి కార్యాచరణ మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా పె న్షనర్లు ఎదుర్కొంటున్న సుమారు 13,000 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంగా విడుదల చేయాలని,తద్వారా పదవీ విరమణ చే సిన కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుం డా చూడాలని వారు కోరారు.ఆరోగ్య కార్డుల(ఈహెచ్‌ఎస్)విషయంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా,కొత్త విధానాన్ని రూపొందించి మే 1వ తేదీ నుండి నగదు రహిత వైద్య సేవలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.మరో ప్రధాన డిమాండ్‌గా రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) ను రద్దు చేసి,పాత పెన్షన్ స్కీమ్(ఓపిఎస్)ను పునరుద్ధరించాలని నేతలు డిమాండ్ చేశారు.30– 1 –2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా ని యామకమైన వారికి వెంటనే పాత పెన్షన్ అ మ లు చేయాలని వారు గట్టిగా కోరుతున్నారు.టిజిఇ జెఎసి చైర్మన్ వెలమల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన గౌరవాధ్యక్షుడు ఎంసీ లింగన్న,సెక్రటరీ జనరల్ డాక్టర్ పిజి రెడ్డి,వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 4ప్రధాన డిమాండ్లతో పాటు మిగిలిన 64 పెం డింగ్ అంశాలను పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వైద్యుల నిర్లక్ష్యం... మహిళ మృతి

### మృతి దేహాన్ని అప్పగించిన వైద్యులు

### ఒక సూదితో వికటించిన వైద్యం

**ప్రజాపక్షం/కంది :** కడుపు నొప్పితో ఆసుపత్రికి వెళ్లిన మహిళా కొద్దిసేపటికి మృతి చెం దింది. వైద్యులు ఆపరేషన్ చేసే ప్రయత్నంలో విఫలమవడంతోనే యువతి చనిపోయిందని ఆమె కుటుంబ సభ్యులు ,బంధువులు, ఆసుపత్రి ఎదుట అందోళనకు దిగారు. అమీన్‌పూర్ తిరుమల ఆసుపత్రిలో ఈ ఘటన జరిగింది. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన హారిక (28) కడుపు నొప్పితో గురువారం ఇక్కడ తిరుమల ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు పలు పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ చేయాల ని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి 9 గంటలకు హారికను ఆపరేషన్ కు తీసుకెళ్లగా కొద్దిసేపటికే మరణించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వైద్యం వికటించడంతో నే హారిక ఆపరేషన్ కు తీసుకెళ్లగా కొద్ది సేపటికి ఆమె మరణించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వైద్యం వికటించడంతోనే హారిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఆసుపత్రి ఎదుట అందోళన

హారిక మృతితో కుటుంబ సభ్యులు ,బంధువులు, ఆసుపత్రి ఎదుట అందోళనకు దిగారు. ఇటీవల మరో వ్యక్తి కూడా వైద్యం వికటించడంతో మరణించగా లక్షల రూపాయాలు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసినట్లు వారు ఆరోపించారు. హారిక మృతి పై విచారణ జరిపి వైద్యం సక్రమంగా చేయకుండా ఆపరేషన్ చేసిన వైద్యులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కడుపు నొప్పికి సర్జరీ ఎందుకు చేశారని ప్రశ్నిస్తున్నారు. అందోళన తీవ్రం కావడంతో పోలీసు బలగాలు ఆసుపత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశాయి. న్యాయం చేసే వరకు ఉరురోబోమని కుటుంబ సభ్యులు హెచ్చరిస్తున్నారు.




## అక్రమంగా ప్రాణహిత– చేవెళ్ల రాళ్ల తరలింపు

**ప్రజాపక్షం/కంది :** కంది మండల పరిధిలోని ఎద్దు మైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ వెంచర్ రహదారి నిమిత్తం ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టు కు సంబందించిన రాళ్లను అక్రమంగా తరలించారు. ఎద్దు మైలారం పరిధిలో గత కొన్నేళ్ల క్రితం ప్రాజెక్టు కోసం తవ్విన రాళ్లను నిల్వ ఉంచారు. స్థానిక నాయకుల కొందరు అండదండలతోనే అర్ధరాత్రి టిప్పర్లతో రాళ్లను తరలించారు. అధికారులు స్పందించకుంటే అక్కడ నిల్వ ఉంచిన రాళ్లన్ని కనుమరుగవ్వడం ఖాయమని స్థానికులు వాపోతున్నారు. రాళ్లను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు కోరుతున్నారు.



## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేయగా అక్రమంగా నిలువ ఉంచిన సుమారు 15 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషనుకు తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక'



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలకి సంబంధించిన మండల స్థాయి సమావేశం గురువారం జగిత్యాలలో ఎస్.వి.ఎల్.ఆర్ గార్డెన్ లో నిర్వహించగా జగిత్యాల అర్బన్ మండల ప్రత్యేక అధికారి కే. రాజ్ కుమార్ డి.ఎస్.సి.డి.ఓ నోడల్ ఆఫీసర్ గా పాల్గొనగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరుకాగా ప్రభుత్వం గ్రామాలలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధికి సంభందించిన వాటి గురించి సంబంధిత మండల అధికారులకు వివరంగా తెలియజేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ఎంఆర్ఓ రాం మోహన్, ఎంఈఓ చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి వినీల, ట్రాఫిక్, సివిల్, ఎక్సైజ్ ఎస్ఐలు, అర్బన్ మండల గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, విఓఏలు, సిఏలు,మహిళ సంఘం సభ్యులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## నేరం చేస్తే శిక్ష తప్పదు: ఎస్పి



**ప్రజాపక్షం/జగిత్యాల:** కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన పీపీలు రామకృష్ణ రావు, ప్రణయ్,రాజేష్ లను అభినందించి శాలువతో సత్కరించి ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కీలక పాత్రని,పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సమన్వయం తో నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదుపడేలా కృషి చేసి శిక్షల శాతం పెరిగేలా పని చేయటం అభినదనియని అన్నారు.పోలీస్ ఆదికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పోక్సో,హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని సూచించారు. గడిచిన రెండు నెలల్లో 20 కేసుల్లో నిందితులుగా ఉన్న 36 మందికి జైలు శిక్షలు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఉన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు: అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** వన్యప్రాణుల సంరక్షణకు మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం నిర్వహించిన వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అదనపు జిల్లా కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తానాజీ వాకడే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు చెందిన అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ ప్రతినిధులు హాజరయ్యారు. వన్యప్రాణుల అక్రమ రవాణా నివారణపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, వన్యప్రాణి సంరక్షణ చట్టం1972ను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, అడవి జంతువులు, పక్షుల అక్రమ తరలింపును అరికట్టేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలు.. కీలక మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అనుమానాస్పద వాహనాలపై కఠిన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సంయుక్త చర్యలతో వన్యప్రాణి సంరక్షణను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమని, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్ అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ఎస్పి

**ప్రజా పక్షం/ వేములవాడ :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ పోలీసులు పలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణ పరిధిలోని ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం, జిబ్రా క్రాసింగ్ పెయింటింగ్ చేయడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టారు. అలాగే మలుపుల వద్ద వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు, రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ చర్యల ద్వారా వాహనదారుల్లో అప్రమత్తత పెరిగి రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ భద్రతతో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు రామ్మోహన్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కలిసికట్టుగా పని చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంబీ గార్డెన్స్ లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన పేరిట పాలన కొనసాగుతుందని, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డుల జారీ,సన్న బియ్యం,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పింఛన్లు, గృహ జ్యోతి, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి పేరిట వడ్డీ లేని రుణాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,ప్రజల నుండి సూచనలు స్వీకరించి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్న కలెక్టర్, తీవ్రవాద దాడులు లేదా ఘోర రోగాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు ఎక్కువగా ఉండటం ఆందోళనకరమని అన్నారు. ప్రమాదాల నియంత్రణకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అరైవ్అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ, ఓవర్ స్పీడింగ్ తగ్గించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వంటి ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌లోపు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే రహ వీర్ పథకం కింద రూ.25,000 ప్రోత్సాహకం అందిస్తామని, అలాగే బాధితులకు సమీప ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిపి రాంరెడ్డి,మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికతో ప్రజలకు లబ్ధి

### అదనపు కలెక్టర్ రాజ గౌడ్



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో నిర్వహించనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సంబంధించి జగిత్యాల పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్ లో గురువారం మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల)బి. రాజ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రణాళిక మండల స్థాయి సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజాపాలన ప్రతిబింబించేలా ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి.రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి.రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, జిల్లా అదనపు కలెక్టర్, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై అర్హులైన ప్రజలకు ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాజాత కళాకారుల బృందం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై పాటలు పాడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ మండలం స్పెషల్ ఆఫీసర్ బి.నరేష్, జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి,రూరల్ తహసీల్దార్ హకిమ్, రూరల్ ఎం.పి. ఓ రవి బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కేంద్రాలు కొండంత అండ

### కరీంనగర్ భరోసా కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో చేయూతను అందించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు భరోసా కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డిజిపి (సిఐడి ఎసిబి) చారు సిన్హా పేర్కొన్నారు. గురు వారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలో ఉన్న భరోసా కేంద్రాన్ని ఆమె సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను తనిఖీ చేశారు. కేంద్రం లోని ప్రతి విభాగాన్ని సందర్శించిన అడిషనల్ డిజిపి , సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు మంచి సత్ఫలితాలను ఇస్తున్నాయి. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కాగా ఆధారాలను సేకరించాలి. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. 2024 డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ కేంద్రం, బాధితులకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులకు తిరిగే ఇబ్బంది లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష, భరోసా కేంద్రం సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు తలొగ్గం.. సమ్మె విరమించం

**9వ రోజూ కొనసాగుతున్న అర్టిజన్, అన్మాన్‌ల సమ్మె**



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** బెదిరింపులకు తల్లోగి సమ్మె విరమించ బోమనీ అర్టిజన్, అన్మాన్ కార్మికులు అన్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి డివిజన్ పరిదిలోని అర్టిజన్,అన్మాన్ విద్యుత్ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం సమ్మెలో భాగంగా తొమ్మిదవ రోజు విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు అన్ మ్యాన్ కార్మికులు బిల్ కలెక్టర్ కార్మికులు సంయుక్తంగా వారి సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు సమ్మెలో పాల్గొన్న అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబి రూల్స్ అమలు చేయాలని విద్యార్హత ఆధారంగా కన్వర్షన్ చేయాలని అన్యానుడు కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించి సంస్థ లో విలీనం చేసుకోవాలని స్టార్ట్ బిల్డర్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని 2026 పి ఆర్ సి ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు మా న్యాయ బద్ధమైన కోరిక నెరవేర్చే వరకు ఈ సమ్మె ఇలాగే కొనసాగుతుందని,బెదిరింపు లకు బయపడమన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని వారి పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో జగిత్యాల జిల్లా చైర్మన్ బాబు యాదవ్, జిల్లాకో చైర్మన్ కాశెట్టి రాంబాబు, జిల్లా కన్వీనర్, దమ్మ రవీందర్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ కోడూరు శ్రీధర్,డివిజన్ చైర్మన్,సామల కోటేశ్వర్,డివిజన్, కో చైర్మన్ పిట్టల మహేష్, కో కన్వీనర్, పాలడుగు రాజేందర్ , అడ్వైజర్, పరమేశ్వర్, పాలడుగు రాజేందర్, మీడియా ఇంచార్జ్ విష్ణు,నాగార్జున, ఆర్గనైజర్ శరణ్య,కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పౌరుడూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రోజున రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై బాధ్యతాయుత దృక్పథం తో పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం పెద్దపల్లి మండలం పరిధిలోని ఆర్.కె ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి రూరల్ ఎస్ ఐ మల్లేశం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాని కి పెద్దపల్లి డిసిపి బిరామ్ రెడ్డి పెద్దపల్లిఎసిపి జి. కృష్ణ , సిఐ పెద్దపల్లి ప్రవీణ్ కుమార్‌లతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపిమాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, మితిమీరిన వేగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని స్పష్టం చేశారు.అలాగే హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం నివారించడం వంటి ప్రాథమిక భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అధికారులు మితిమీరిన వేగం,నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రాణాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి ఒక్కరు ఈ అవగాహనను ఇ తరులకు చేరవేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం ముగింపులో, హాజరైన వారందరితో రోడ్డు భ ద్రతపై ప్రతిజ్ఞ చేయించి ట్రాఫిక్ నియమాలను పా టించడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియో గం, మితిమీరిన వేగాన్ని నివారించడం, ఇతరుల కు కూడా అవగాహన కల్పించడం వంటి అంశాల పై కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖ, ప్రభుత్వ విభాగాలు, ప్రజలు, యువత మధ్య సమన్వయం పెంపొందించి, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం లక్ష్యంగా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.ఎంఆర్ఓ, ఎంపిడిఓ, ఎంఎఓ, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారు లు, గ్రామ సర్పంచులు,ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు.

## రైతు పథకంలో సభ్యులుగా చేరిన జనగామ రైతులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు పథకంలో ఆరవ డివిజన్ జనగామ రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఆరవ డివిజన్ జనగామ కార్పొరేటర్ తోకల శ్యామనిరమేశ్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. గురువారం జనగామ లో ఏర్పాటు చేసిన మేడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కు అధికారుల తో ఆయన కలిసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎఫ్ .పి.ఓ ఫార్మర్ ప్రొటక్షన్ ఆర్గనైజింగ్ (రైతు ఉత్పత్తి దారుల సంస్థ)పథకం ద్వారా 10 గుంటల పైన వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు 2330 రుసుం చెల్లించి ఈ పథకం లో సభ్యత్వం తీసుకుంటే, రైతు కట్టిన 2000 రూపాయలతో పాటు ప్రభుత్వం మరో 2000 రూపాయలు కలిపి 4000 రూపాయలు రైతు ఖాతాలో జమ చేయబడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా సబ్సిడీ విత్తనాలు, కెమికల్స్, పొలాలకు అవసరమైన యంత్రాలు, సేంద్రియ ఎరువుల తయారీ విత్తనోత్పత్తి రైతు ద్వారా చేయించి వచ్చే లాభాలను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయటం జరుగుతుందని, ప్రభుత్వం సబ్సిడీ లోన్లు పొందే వీలు ఎఫ్ పి ఓ పథకం లో చేరిన రైతులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని అధికారులు రైతులకు వివరించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమం లో ఏ.ఇ.ఓ శ్రీకాంత్, సి.ఇ.ఓ రమేష్, పి.ఎ.సి.ఎస్ సిబ్బంది, స్టాఫ్ అసిస్టెంట్ లు వెంకట రమణ, కల్పనా, రాజకుమారి, క్రాంతి కుమార్, మరియు డివిజన్ రైతులు జువ్వాడి రామారావు, రుద్రబట్ల నిఖిల్, నడిపెల్లి గోపాల్ రావు,రుద్రబట్ల విశ్వనాథ్,జువ్వాడి విజయ్ రావు, దొరగండ్ల కొమురవ్వ,గుండెబోయిన సది, నీలం సంజీవ్, గాదె చంటి, ఐత లక్ష్మయ్య,ఆర్కుటి రాజయ్య, గుండెబోయిన భూమయ్య , డివిజన్ కు చెందిన వివిధ పార్టీల నాయకులు జనగామ బొడ్డు మహేందర్, బొట్టు శ్రీను, కలవేన రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో నిర్వహించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం మండల సభ నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు, రైతులు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశం వినిపించారు. అరైవ్.. అలైవ్ కింద ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రత నియమాలు వివరించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వాగార్డ్ నీటి శుద్ధి యంత్రాలు పంపిణీ చేశారు. దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేశారు.

**11,756 మందికి ఇందిరమ్మ చీరలు..**

రైతు భరోసా లబ్ధిదారులు మొత్తం 17,883 మందికి, రైతు రుణ మాఫీ 5,745 మందికి, మొత్తం 593 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 185 మంది ఇండ్లు పూర్తి అయ్యాయని, 408 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని ఎంపీడీఓ శశికళ తెలిపారు. మహాలక్ష్మి కింద 8,985 మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 9,572 కుటుంబాలకు అందుతుందని, 77 మందికి సన్నరకం వరి బోనస్ అందిందని వివరించారు. చేయూత పెన్షన్స్ 7,915 మందికి అందుతుందని, మండలంలో నూతనంగా 1,974 మందికి తెల్లరేషన్ కార్డులు పొందారని తెలిపారు. 771 మందికి కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పంపిణి చేశామని వెల్లడించారు. ఇందిరమ్మ మహిళా శక్తి కింద 508 మందికి బ్యాంక్ లింకేజీ రుణాలు, ఇందిరమ్మ చీరలు 11,756 మందికి చీరలుపంపిణీ చేశామని ఎంపిడిఓ శశికళ వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇండ్ల పూర్తిలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్..**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా మొత్తంలో నూతన రేషన్ కార్డులు 23,131 మంజూరు చేశామని, రూ. 500లకే ఇప్పటి దాకా 3,91,247 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటిదాకా 1,648 ఇండ్లు పూర్తి అయ్యాయని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన జాబితాలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి వెళ్లింది మొదలు ఇంటికి వచ్చే వరకూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపు నిచ్చారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాకు వచ్చిన మొబైల్ ఎక్స్ రే యంత్రం ప్రారంభించామని, 42 గ్రామాల్లో పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

**గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలి..** నో హెల్మెట్.. నో ఎంట్రీ కార్యక్రమాన్ని గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అందరి రక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన విఓఎ భవనాలు జూన్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు త్వరలో బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఇందిరా కుటుంబ జీవిత బీమా అమలు చేయనున్నదని వెల్లడించారు. రైతులు వరితో పాటుగా ఆయిల్ పామ్ సాగు చేయాలని, దీంతో మంచి దిగుబడి, మద్దతు ధర వస్తునద్నని, రైతులకు సబ్సిడీ పై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. సిద్ధిపేట జిల్లాలో ఆయిల్ పామ్‌ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వివరించారు.

**పోషక పదార్థాలతో ఉపయోగాలు తెలిపే స్టాళ్లు..**

వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్, పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్, నానో యూరియా విశేషాలు వెల్లడిస్తూ.. స్రీ శిశు సంక్షేమ శాఖ పోషక పదార్థాలతో ఉపయోగాలు తెలియజేస్తూ.. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వస్త్రాలు, ఆహార పదార్థాల స్టాళ్లను పరిశీలించి.. పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అడిగి తెలుసుకున్నారు.జెడ్పి సిఇఓ వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసిల్దార్ సురేష్, ఎంపిడిఓ శశికళ, సర్పంచ్ మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

# లక్నోపై ఆర్‌సిబి ఘన విజయం!



ఐపిఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జైత్రయాత్ర కొనసాగుతోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో బుధవారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. బౌలింగ్‌లో రసిక్ సలామ్, భువనేశ్వర్ కుమార్ నిప్పులు చెరిగితే.. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ సత్తా చాటాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. రసిక్ సలామ్(4/24)తో పాటు స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్(3/27) మూడు వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా(2/36) రెండు వికెట్లు పడగొట్టాడు. జోష్ హాజెల్‌వుడ్‌కు ఒక వికెట్ దక్కింది.లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్(32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40), ఆయుష్ బదోని(24 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 38), ముకుల్ చౌదరి(28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. అనంతరం ఆర్‌సీబీ 15.1 ఓవర్లలో 5 వికెట్లకు 149 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లీ(34 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. రజత్ పటిదార్(13 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 27), జితేష్ శర్మ(9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 23) దూకుడుగా ఆడారు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్(3/32) మూడు వికెట్లు తీయగా.. అవేష్ ఖాన్(2/23) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఆర్‌సిబి పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.

**గెలిపించిన కోహ్లీ..**

146 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఆర్‌సీబీకి ఆశించిన శుభారంభం దక్కలేదు. రెండో ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్(7) వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో విరాట్ కోహ్లీ అద్భుతమైన బ్యాటింగ్‌తో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై కోహ్లీ 49 పరుగులు చేయడంతో ఆర్‌సీబీ విజయం లాంఛనమైంది. ఆ తర్వాత బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోయినా.. ఆర్‌సీబీ సునాయస విజయాన్నందుకుంది. కోహ్లీ కూడా ఆరంభంలోనే ఔటై ఉంటే మ్యాచ్ మరింత ఉత్కంఠగా సాగేది. అయితే లక్నో బ్యాటర్లు కూడా 2030 పరుగులు తక్కువగా చేశారు. ఆర్‌సీబీ బౌలర్ల అద్భుత ప్రదర్శనతో లక్నో బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు.

## ఫిఫా సిరీస్ హాకీలో మాలావిపై భారత్ విజయం



**న్యూఢిల్లీ:** ఫిఫా సిరీస్‌ను భారత మహిళల హాకీ జట్టు ఘనంగా ముగించింది. మూడో స్థానం కోసం బుధవారం నైరోబీలో మాలావితో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ 3–2తో అద్భుత విజయం సాధించింది. ఆద్యంతం నువ్వానేనా అన్నట్లు సాగిన మ్యాచ్‌లో భారత్ తరఫున ఆస్తామ్ ఓరాన్(18ని), అవెకా సింగ్(45ని), ప్రియదర్శిని సెల్లాదురై(84ని) గోల్స్ చేశారు. మరోవైపు కుమాలో ఇరిన్(42ని), హెన్రీ దెబోరా(60ని) మాలావికి గోల్స్ అందించారు. మ్యాచ్ 18వ నిమిషంలో రైట్ కార్నర్లో నిర్మలాదేవి అందించిన పాస్‌ను ఆస్తామ్ ఓరాన్..మాలావి గోల్‌కీపర్‌ను కంగుతినిపిస్తూ భారత్‌కు తొలి గోల్ అందించింది. 21 ఏండ్ల ఓరాన్‌కు భారత్ తరఫున ఇది తొలి గోల్ కావడం విశేషం. అయితే మ్యాచ్ ప్రథమార్థం మరికొద్దిసేపట్లో ముగుస్తుందనగా మూడు నిమిషాల్లో ఇరు జట్లు గోల్స్ చేయడంతో భారత్ 2–1 ఆధిక్యంలో నిలిచింది.

## ఐపిఎల్‌లో సెంచరీ.. మూడో బౌలర్‌గా అర్షదీప్ రికార్డు!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భారత పేసర్ అర్షదీప్ సింగ్ సెంచరీ కొట్టేశాడు. ఇప్పటికే అంతర్జాతీయ టి–20ల్లో వంద వికెట్లు తీసిన ఈ ఎడమచేతివాటం పేసర్ ఈసారి ఐపిఎల్‌లోనూ శతక వికెట్ల క్లబ్‌లో చేరాడు. పంజాబ్ కింగ్స్ పేస్ అస్త్రమైన అర్షదీప్ ముంబై ఇండియన్స్ బ్యాటర్ రియాన్ రికెల్టన్‌ను ఔట్ చేసి ఈ ఫీట్ సాధించాడు. మొత్తంగా ఐపిఎల్‌లో ఈ మైలురాయికి చేరుకున్న ఐదో బౌలర్‌గా రికార్డు సొంతం చేసుకున్నాడీ స్పీడ్‌స్టర్. ఐపిఎల్‌లో గత కొంత కాలంగా నిలకడగా రాణిస్తున్న అర్షదీప్ సింగ్ పంతొమ్మిదో సీజన్‌లో వికెట్ల పండగ చేసుకుంటున్నాడు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో రియాన్ రికెల్టన్ వికెట్ తీసి వంద వికెట్ల వీరుడిగా అవతరించాడు. తద్వారా ఈ లీగ్‌లో 100 వికెట్ల వీరుల జాబితాలో చేరిపోయాడీ పేసర్. అర్షదీప్ కంటే ముందు ముగ్గురు భారతీయులు ఈ ఫీట్ సాధించారు. వెటరన్ జహీర్ ఖాన్(102), అశిశ్ నెహ్రా(106), జయదేవ్ ఉనాద్కాట్(114)లు వంద క్లబ్‌లో చేరారు.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## దేశంలో నౌక నిర్మాణ కేంద్రాలలో పెద్దది?

- అనేక రేవు పట్టణాలు గల తీరము
  అట్లాంటిక్
- రబ్బరు చెట్లు ఎక్కువగా వున్న రాష్ట్రం
  కేరళ
- శూన్యవాదాన్ని ఎవరు ప్రతిపాదించారు?
  నాగార్జునుడు
- పెల్లగ్రా అనే వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల ఏర్పడుతుంది?
  విటమిన్ బి3
- ప్రభుత్వ మద్దతుతో కాలువల వ్యవసాయ విధానాన్ని ప్రారంభించినవారు ఎవరు?
  ఘియాసుద్దీన్ తుగ్లక్
- రెండు దంతాలుండే సీల్ లాంటి సముద్ర జీవి 'వాల్స్' సహజ నివాసప్రాంతమేది?
  ఆర్కిటిక్ ప్రాంతం
- వేములవాడ చాళుక్యుల కాలం నాటి అధికార భాష ఏది?
  కన్నడం
- రాజస్థాన్లోని ఖేత్రి ఇందులకు ప్రసిద్ధి గాంచినది
  నికెల్
- అత్యల్ప జనాభా గల రాష్ట్రం
  సిక్కిం
- రష్యాలో 1917 విప్లవం వల్ల ఇతని పరిపాలన అంతమైనది:
  జార
- మొదటి బాజీరావు బస్సీన్, సాల్సెట్టిలను ఎవరి నుంచి ఆక్రమించాడు?
  పోర్చుగీసువారు
- రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్ గా ఎవరు వ్యవహరిస్తారు?
  గవర్నర్
- 2013–14లో నూనె గింజల సగటు ఉత్పత్తి ఎంత? (కి.గ్రా./హె.)
  1153
- చోళుల సామ్రాజ్యంలో ఒక విభాగంగా పరిపాలించిన అతిపెద్ద గ్రామాన్ని ఏమని పిలిచేవారు?
  తణియూరు
- ప్రపంచంలో ఏ దేశానికి పొడవైన తీర ప్రాంతం ఉంది?
  కెనడా
- శ్రీరాముడి రూపచిహ్నంతో ఒక అంగుళం వ్యాసం ఉన్న వెండి నాణేన్ని జారీ చేసిన భారత దేశపు ఒకే ఒక రాజు ఎవరు?
  అక్బర్
- భారత భాగస్వామ్య చట్టాన్ని ఏ సంవత్సరంలో రూపొందించారు?
  1932
- మొదటి బాజీరావు, నిజాం ఉల్ ముల్క్‌ను ఏ యుద్ధంలో ఓడించాడు?
  భోపాల్
- ద్రవ్య రుణం గురించి మొదటిసారి ప్రస్తావించిన వేద గ్రంథం ఏది?
  శతపథ బ్రాహ్మణం
- విటమిన్‌బి2 లోపం వల్ల కలిగే వ్యాధులేవి?
  1. కీలోసిస్ 2. గ్లాసైటిస్, 3. సెబోరిక్ డెర్మటైటిస్
- 'పిల్లి' జాతికి చెందిన శక్తిమంతమైన 'జాగ్వార్' సహజ నివాస ప్రాంతమేది?
  మధ్య అమెరికా
- జాతీయ ఆదాయం అంచనాల కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
  1949



- ఏ ప్రాంతంలో నిజాం ఉల్ ముల్క్ స్వతంత్య రాజ్యాన్ని స్థాపించాడు?
  హైదరాబాద్
- తెలంగాణ రాష్ట్రంలో 'సమగ్ర కుటుంబ సర్వే' కార్యక్రమాన్ని ఏ రోజున చేపట్టారు?
  2014, ఆగస్టు 19
- వృక్షాల మీద పరిశోధనలు జరిపే సంస్థ ఏది?
  జాతీయ వృక్షశాస్త్ర పరిశోధనా కేంద్రం
- ఐక్యరాజ్యసమితిలోని ఏ అంగాన్ని ప్రపంచ పార్లమెంట్ అని పిలుస్తారు?
  జనరల్ అసెంబ్లీ
- ఆకాశం నీలిరంగులో ఉండటానికి కారణం?
  నీలి క్షేత్రంలో కాంతి పరిక్షేపణం
- ఇంద్రపాల నగరాన్ని ఎవరు నిర్మించారు?
  రాజేంద్రవర్మ
- జాతీయ పతాకంలో ఉన్న ధర్మ చక్రంలోని గీతలు ఎన్ని?
  24
- ఇండియన్ రైస్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
  కటక్
- మానవులకు 'విటమిన్ డి' ప్రాథమికంగా దేని నుంచి లభిస్తుంది?
  సూర్యుడు
- ఇండియా నుంచి ప్రపంచ స్టేట్స్ మన్ అవార్డు అందుకున్న మొదటి రాజనీతిజ్ఞుడు ఎవరు?
  ఐ.కె.గుజ్రాల్



- భారతదేశపు ప్రజల ప్రాథమిక విధులను రాజ్యాంగంలోని ఏ భాగంలో చేర్చారు?
  భాగం 4ఎ
- దేశంలో పంచదార మేఖల ఎక్కడ ఉంది?
  మధ్య గంగాలోయ
- హరప్పా ప్రజలకు కింది ఎవరితో అంతర్జాతీయ సంబంధాలు ఉండేవి?
  మెసపటోమియా
- నానాసాహెబ్ ప్రసిద్ధి చెందిన పీష్వా ఎవరు?
  బాలాజీ బాజీరావు
- 236 ద్వీపాలు ఉన్న ఆసియా దేశమేది?
  హాంకాంగ్
- కింది వాటిలో పంపకవికి రెండో అరికేసరి ఇచ్చిన అగ్రహారం ఏది?
  ధర్మపురం
- రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ను నియమించేది?
  గవర్నర్
- రూర్కెలా ఉక్కు కర్మాగారం ఏ దేశ సహకారంతో నెలకొల్పబడింది.
  బ్రిటన్
- కాలిఫోర్నియా దీనికి ప్రసిద్ధి చెందినది
  నారింజ పండ్లు
- అర్థశాస్త్రం దిగువ వారిచే రచించబడింది :
  కౌటిల్యుడు
- భూగర్భం నుండి ఖనిజసంపద భూమిపైకి రావటంలో ఇవి ఉపకరిస్తాయి.
  అగ్నిపర్వతాలు
- దేశంలో మొట్టమొదటి నూలుమిల్లు స్థాపన
  1818
- దేశంలోని నౌకా నిర్మాణ కేంద్రాలలో పెద్దది
  విశాఖపట్టణం
- 1752లో పీష్వాతో ఒప్పందం కుదుర్చుకున్న మొగలు చక్రవర్తి ఎవరు?
  అహ్మద్ షా
- యాంటిన్యూరిటిక్ విటమిన్ ఏది?
  విటమిన్ బి1
- నృత్త రత్నావళిని జాయప సేనాని ఎవరి పరిపాలనా కాలంలో రచించాడు?
  గణపతిదేవ

## పోడు భూములకు పట్టాలివ్వాలి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలోని బందగిరి నగరం గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనాధారంగా ఉన్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గురువారం మండలంలోని బందగిరి నగరం గిరిజనులతో ఆయన మాట్లాడారు. పోడుభూముల్లో గిరిజనులు సాగుచేస్తున్న ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారులు జోక్యం చేసుకోవడం సరికాదని, ఇలా చేస్తే గిరిజనులు నిరాశ్రయులవుతారని, వారి జీవనాధారం దెబ్బతింటుందన్నారు. గిరిజనులపై ఒత్తిడి పెడితే వారి తరపున సిపిఐ పోరాటం చేస్తుందని సాబీర్ పాషా స్పష్టం చేశారు. అనంతరం ఏడూళ్లబయ్యారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పినపాక మండలంలో పార్టీ బలంగా ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి గడ్డం మనోహరచారి అధ్యక్షత వహించగా, సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, జిల్లా సమితి సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు, దుగ్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి పద్మనాభ రాజు, ఎఐటియుసి మండల కార్యదర్శి తోగటి కుమార్, నాయకులు తోట రమేష్, పొనగంటి పురుషోత్తం, వర్షా నరసింహారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దళిత హక్కుల కోసం 'చలో వరంగల్'

డిహెచ్‌పిఎస్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దేవి పోచన్న




**ప్రజాపక్షం /హాజీపూర్ :** దళితుల హక్కుల సాధన కోసం ఏప్రిల్ 17, 18 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించే దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి దేవి పోచన్న పిలుపునిచ్చారు. హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాజ్యాంగబద్ధమైన సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. దేశంలో దళితులు, మైనారిటీలపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని, కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పొనగంటి యోసేపు, నాయకులు మేడ లక్ష్మణ్, బొజ్జ రవి, శారద, రాజ లక్ష్మి , అరుణ రేఖ, శైలజ, సహజ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

తాలు, తేమ పేర్లతో మోసం
సిండికేట్ దోపిడీకి బ్రేక్ వేయాలి
ధాన్యానికి సరైన ధర ఇవ్వాలి
ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/నాంపల్లి:** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మండలాల్లో ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని, ప్రారంభమైన చోట్ల కూడా కొనుగోళ్లు సరిగా జరగడం లేదని ఆయన విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి తేమశాతం, తాలు పేరుతో రైతుల ధాన్యంలో రెండు నుంచి మూడు కిలోల వరకు తూకం కోతలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే లోడ్ చేసిన లారీలు మిల్లర్ల వద్ద రోజులు గడుస్తూ అన్లోడ్ కాకుండా నిలిపివేయబడుతున్నాయని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి వ్యాపారస్తుల సిండికేట్‌ను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అవినీతికి పాల్పడిన కొనుగోలు కేంద్రాలకు ఈసారి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. తేమ శాతం, తాలు పేర్లతో ధాన్యాన్ని తిరస్కరించకుండా కొనుగోలు చేయాలని కోరారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ ఇంకా పూర్తిగా అమలు కాలేదని, రైతు భరోసా కింద అందిస్తున్న రూ.6వేల సహాయం సరిపోవడం లేదని విమర్శించారు. అలాగే రైతు భరోసా, రైతు బీమా, రైతు బంధు పథకాలను సమర్థవంతం గా అమలు చేయాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మిషన్ భగీరథ నీటి సరఫరాను మెరుగుపరచాలని కోరారు. విద్యుత్ కోసం డిడిలు కడుకున్న రైతులకు వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నేతల రాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య, దండిగ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** రిమ్స్ ఆసుపత్రి కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం రిమ్స్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కుంటాల రాములు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రి కార్మికులకు తొమ్మిది నెలలుగా పిఎఫ్, ఇఎస్‌ఐ డబ్బులు జమ చేయడం లేదని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియర్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వకుండా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సమస్యలు అడిగితే డైరెక్టర్ బెదిరించడం సరికాదని, ఐదు రోజుల్లో పరిష్కరించని పక్షంలో సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు. అనంతరం సమస్యలపై డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ ఆసుపత్రి కార్మిక నాయకులు శాంతాబాయి, అనిత, రాధా, లక్ష్మి , లక్ష్మయ్య, శోభ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టొద్దు

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి పద్మావతి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహిళా బిల్లుతో డీ లిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టొద్దని ఎన్‌ఎఫ్‌ఐబ్ల్యు మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి కె.పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు జి.భార్గవి డిమాండ్ చేశారు. డీ లిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతూ బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సంధర్బంగా ఎన్‌ఎఫ్‌ఐబ్ల్యు జిల్లా కార్యదర్శి పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు జి.భార్గవి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం మొట్టమొదట 1996లో భారత జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరైన గీతాముఖర్జీ పార్లమెంటులో ప్రతిపాదన చేశారన్నారు. అప్పటినుండి భారత జాతీయ మహిళా సమాఖ్య మహిళా బిల్లు కోసం అనేక పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని చెబుతున్న బిజెపి ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లుతో ముడి పెడుతూ ఆ బిల్లు పాస్ అయితేనే మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ అవుతుందనే విధంగా మాట్లాడుతుందన్నారు. జనాభా లెక్కలు చేయకుండా దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా డీలిమిటేషన్ బిల్లు తయారు చేస్తున్నారన్నారు. పార్లమెంటులో 850 సీట్లు పెరిగితే అందులో దక్షిణాదికి 150 సీట్లే పెరుగుతాయి. అదే ఉత్తరాదికి ఇప్పుడున్న 400కు మరో 200 పెరిగి వారికి 600 సీట్లు అవుతాయి. అప్పుడు కేవలం రెండు మూడు రాష్ట్రాల ఎంపిలతోనే అధికారం చేజిచ్చుకునే అవకాశం దక్కుతుంది. అప్పుడు మహిళా రిజర్వేషన్ ఉంటే ఏంటీ పోతే ఏంటీ? అనే విధంగా మోదీ ఆలోచన విధానం ఉందన్నారు. జనాభా లెక్కల ప్రకారం సీట్లు పెంచుతామంటున్న కేంద్ర ప్రభుత్వ ప్రకటన హాస్యాస్పదమన్నారు. కులాల లెక్కలు, ఎస్సి, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళల సబ్ కోటా ఇవ్వకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడితే ఉన్నత వర్గాలకే న్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి బిల్లును మహిళా సమాఖ్య వ్యతిరేకిస్తుందన్నారు. ఏ షరతులు లేకుండా వెంటనే పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. ఇప్పుడున్న 544 సీట్లతోనే మహిళా బిల్లును ప్రవేశపెట్టి అందులో అన్ని వర్గాల మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా బిల్లును తీసుకురావాలని మహిళా సమాఖ్య డిమాండు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎం.ఇందిర, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జిల్లా కమిటీ సభ్యులు ఇ.పద్మ, భవాని, అంజిలమ్మ, నరసమ్మ, మహేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తాం

సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలో ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం సర్కిల్ మల్యాలపల్లి సబ్ స్టేషన్ ఆవరణలో తొమ్మిది రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో దీక్షను సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో 19,400 మంది ఆర్టిజన్లు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నారని, అందులో జిల్లాకు సంబంధించి 178 మంది 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆర్టిజన్లు బేషరతుగా సమ్మె విరమించి విధుల్లోకి హాజరైతేనే చర్చలకు పిలుస్తామని ప్రభుత్వం నిబంధనపెట్టటం సరికాదన్నారు. ఆర్టిజన్లకు ఎపి ఎస్ సి బి సర్వీసెస్ అమలు చేయాలని, టిజి ఎస్‌పి డిసిఎల్, టిజి ఎల్‌పిడిసిఎల్‌లో పనిచేస్తున్న అన్ మ్యాన్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని, సీనియారిటీ ఉన్న ఆర్టిజన్లను ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని, 2016 ముందు సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, 2026 పిఆర్‌సి వేతన సవరణ అమలు చేయాలని, విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జిఒ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అందించాలని సదానందం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరెపల్లి మానస్ కుమార్. నాయకులు కల్లేపల్లి నవీన్, చంద్రగిరి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుగోళీల విక్రయాలు!

ఫార్మసిస్టులు లేకుండానే మెడికల్ షాపుల నిర్వహణ

అర్హతలేని వారిచే ఇబ్బడి ముబ్బడి అమ్మకాలు

పుట్టగొడుగుల్లా ఏజెన్సీలు, మెడికల్ షాపులు

అధికారులు తనిఖీలు చేస్తే బట్టబయలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మందుగోళీల విక్రయాలు ఇష్టాను సారంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఏ మందుగోళీ అయినా, టానిక్ అయినా, ఏ ఇతర ఔషధమైనా విక్రయించాలంటే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పని సరి. కానీ జిల్లాలో ఇదేమీ పట్టనట్లుగా ఉంది పరిస్థితి. ఇంటర్‌నెట్, ఏఐ పుణ్యమా అని రోగానికి తగ్గ మందులను తెలుసుకుని ఆ మందులను నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో షుగర్, బిపి, మల్టీవిటమిన్ టాబ్లెట్లతో పాటు గర్భనిరోధక మాత్రల అమ్మకాలు కూడా ఇష్టానుసారంగా పెరిగిపోయినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా మత్తును ఇచ్చే టానిక్ మందులను కూడా పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణన్నాయి. వీటిపై ఔషధ నియంత్రణ అధికారులు పలు మార్లు తనిఖీలు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ షరా మామూలే అవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**జిల్లాలో ఇదీ కథ :** జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధిలో సుమారు 450 నుండి 500 వరకు మెడికల్ షాపులతో పాటు సుమారు 100 ఔషద ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో అనువజ్ఞులైన ఫార్మసిస్టులు ఉండాలి. వాళ్లు కూడా వైద్యులు రాసిన మందులను మాత్రమే విక్రయించాలి. కానీ జిల్లాలో అందుకు విరుద్ధంగా కథ సాగుతోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.పోలీసుల నిఘా పుణ్యమా అని గంజాయి రవాణా భారీగా తగ్గింది. దీంతో మత్తుబాబులు కిక్కెకించే మత్తు మందుల కోసం మెడికల్ షాపులకు పరుగులు తీస్తున్నట్లు తెలుస్తోంది. ఆల్ఫాజోలం, డైడోపామ్, క్లోనోజిఫామ్, జోపజామ్ వంటి మందుల విక్రయాలు భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. పలు ఆస్పత్రుల అనుబంధ మెడికల్ దుకాణాల్లో వైద్యులు ఇచ్చే మందులనే అందిస్తున్నప్పటికీ పలు చోట్ల ప్రైవేటుగా నిర్వహిస్తున్న దుకాణాల్లో మాత్రం వైద్యుల మందుల చీటీలు లేకుండానే విక్రయాలు జోరుగా సాగిపోతున్నట్లు తెలుస్తోంది. ఎదైనా మందులకు సంబంధించిన ఫార్ములా ఒకే రీతిలో ఉన్నా ధరల్లో మాత్రం పెద్ద ఎత్తున వ్యత్యాసం కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. మెడికల్ షాపుల ద్వారా విక్రయించే మత్తునిచ్చే టానిక్‌లు అమ్మకాలను కూడా అడ్డుకోవాలని పలువురు అంటున్నారు.

**తనిఖీలు నిర్వహిస్తున్నాం: జిల్లా ఔషధ నియంత్రణాధికారిణి అశ్వని** జిల్లాలో గడచిన మూడు నెలల కాలంలో సుమారు 100 షాపుల్లో తనిఖీలు నిర్వహించాం. ఒక షాపు కూడా సీజ్ చేశాం. గర్భనిరోధక గోళీల విక్రయాలపై నిఘా ఉంచాం. తయారీ కంపెనీలతో అనుసంధానం చేసుకుంటూ సరఫరా వివరాలు, విక్రయాల జాబితా ఎప్పటికప్పుడు తెప్పించుకుంటున్నాం. మందుల షాపుల్లో సర్టిఫైడ్ ఫార్మసిస్టులతో మాత్రమే ఔషదల విక్రయాలు జరగాలి. దానిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నాం. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయాలు సాగించడం ఔషధ చట్ట రీత్యా నేరం.

## నేడు దండి భాస్కర్ 10వ వర్ధంతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సీనియర్ జర్నలిస్ట్, సిపిఐ నాయకుడు అమరజీవి కామ్రేడ్ దండి భాస్కర్ 10వ వర్ధంతిని నేడు నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి, సోదరుడు దండి సురేష్ గురువారం తెలిపారు. ఏదులాపురంలోని ఆయన స్మారక స్థూపం వద్ద ఉదయం 9గంటలకు వర్ధంతి సభ ప్రారభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు, అభిమానులు సకాలంలో హాజరై నివాళులర్పించాలని ఆయన కోరారు.

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల లో ఇంటర్ మొదటి సంవత్సరం లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీ.శ్రీలత పేర్కొన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో గురువారం తన చాంబర్ లో విలేకర్ల సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2026–27 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. అభ్యర్థులకు సీఓఈ వృత్తి విద్యలో సైనిక్ కాలేజీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూనియర్ కాలేజీలో ఎంపీసీ మొదలైన గ్రూపులలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు స్థానిక గురుకుల కళాశాల ను సంప్రదించాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 19న సిఒఇ ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/భద్రాచలం :** రానున్న విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సిఓఇ ప్రవేశ పరీక్ష ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాయదల్చుకున్న వారు ఈనెల 15వ తేదిలోపు ఇంటర్నెట్ నుండి తమ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని పిఓ సూచించారు.

**నూరు శాతం ఫలితాలు సాధించిన బాలికలు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** సిబిఇఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఖమ్మం రీజియన్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించినట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని ఈఎంఆర్ఎస్ పాఠశాలలు గండుగలపల్లి, పాల్వంచ, చర్ల, దుమ్ముగూడెం, ములకలపల్లి, ్ధలకలపల్లి, గుండాల, సంగరేణి పాఠశాలలకు చెందిన మొత్తం 255 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. 230 మంది పరీక్షలు రాయగా, 299 మంది పాసయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను పిఓ ప్రత్యేకంగా అభినందించారు.

## గుడుంబాపై ఎక్సైజ్ దాడులు

నలుగురిపై కేసులు నమోదు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని నాగినేనిప్రోలు, రెడ్డిపాలెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించి, నాటుసారా విక్రయాలు చేస్తున్న నలుగురిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుండి సుమారు 16లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి జానయ్య ఆదేశాల మేరకు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ కరంచంద్, భద్రాచలం ఎక్సైజ్ హెస్‌హెచ్ఓ రహిమున్నిసా బేగం ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దాడుల అనంతరం గ్రామంలో నాటుసారా, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించి ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సీతారామరాజు, గౌతమ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. రోడ్డు ప్రమాదాలు నివారించండి

టౌన్ ఎసిపి రమణమూర్తి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడపడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డుప్రమాదాలు నివారించాలని ఖమ్మం టౌన్ ఎసిపి ఎస్‌వి. రమణమూర్తి అన్నారు. అరైవ్..అలైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మార్కెట్ వద్ద వాహనదారులు, ఆటోడ్రైవర్లు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడి మనస్సులో రోడ్డు భద్రతను బలంగా నాటేందుకు అరైవ్–అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు ఇంట్లో వారు, కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తుంటారని గుర్తుంచుకోవాలన్నారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనలు నడపడం మంచిది కాదన్నారు. ఫలితంగా ప్రమాదం సంభవి మృత్యువాతపడితే కుటుంబం దిక్కులేనిదవుతుందని దానిని గుర్తించి నిబంధనలు మేరకే వాహనాలు నడపాలన్నారు. ఈ ప్రచారం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి రోడ్డు భద్రత వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్, మద్యం సేవించి డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, హైవేలపై ఆటోల ఓవర్‌లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్‌టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆయన తెలిపారు. అరైవ్..అలైవ్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ సిఐ మోహన్‌బాబు, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు, రైతులు పాల్గొన్నారు.

## హడలెత్తిస్తున్న ఎండలు..



అస్వస్థతకు గురవుతున్న సింగరేణి కార్మికులు

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలంలో ఎండలు హడలెత్తిస్తున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదు అవుతున్నాయి. ఈ వారంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా కెసిహెచ్‌పిలో టిప్పర్ దగ్ధమైంది. సురక్ష బస్టాండ్ ఆవరణంలో ఓ ప్రయాణికుడు వడదెబ్బకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. సాయంత్రం వేళలో గాలి స్తంభించడంతో ఊపిరి అందక వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి గనులలో తీవ్ర ఉష్ణోగ్రతలు అస్వస్థతకు గురవుతున్నారు. డ్యూటీకి వెళ్లాలంటేనే కార్మికులు భయాందోళన చెందుతున్నారు. ఉపరితల గనులు మణుగూరు మండల భూ విస్తీర్ణంలో ఎక్కువగా భూ ఉపరితల గనులు ఆక్రమించి ఉన్నాయి. వేసవికాలంలో భూ అంతర్భాగం భాగం నుండి వస్తున్న వేడితో పాటు బొగ్గు బెంచిలు మండుతూ ఉంటాయి. ఉపరితల గనులలో వేడి సుమారు 45 డిగ్రీలకు పైబడి ఉంటుంది. ఏప్రిల్, మే నెలలో 50 డిగ్రీల పైబడి నమోదవుతుంది. ఇది భూ ఉపరితల ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుంది. సాధారణ ప్రజలను కూడా ఇబ్బందులకు గురవుతారు. దీని కారణంగా వేసవి నేపథ్యంలో రెగ్యులర్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పనిచేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ.. డిహైడ్రేషన్‌కు గురవుతున్నారు. సరైనటువంటి సౌకర్యాలు లేకపోతే సన్ స్ట్రోక్‌కు గురైయ్యే ప్రమాదం ఉంది. మార్చి నెల నుండే భానుడు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అనగా పారిశుద్ధ్యం, రహదారుల శుభ్రత వంటి విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పని వేళలు మార్పు ఉదయం ఆరు గంటల నుండి షిఫ్ట్ ప్రారంభం అయ్యేవిధంగా తగు చర్యలు చేపట్టాలని కాం ట్రాక్ట్ కార్మికుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పర్మినెంట్ కార్మికుల పని వేళలు మార్చాలని గుర్తింపు సంఘం, ప్రాథమిక సంఘాలు సింగరేణి యాజమాన్యాన్ని ముం దుగానే అడుగుతున్నారు. ఏప్రిల్ నెలలో పని ప్రదేశాలలో చలువ పందిళ్ళు, చల్లటి నీళ్ల అం దుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. మజ్జిగ ప్యాకెట్లు అందించాలని వేడుకుంటున్నారు. ప్రతి కార్మికుడికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విధిగా అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా వివిధ గనులు డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న అన్ని విభాగాలు గార్డులకు, ప్రైవేటు వాహన డ్రైవర్లకు, కోల్ ట్రాన్స్‌పోర్ట్, కాంట్రాక్ట్ కార్మికులకు, ఓబి వర్కర్లకు, ప్రైవేట్ సెక్యూరిటీ ఎస్ఎంఎస్ ప్లాంట్, కోల్ షాంప్లింగ్, ఉద్యానవనాలు నర్సరీ కాంటాక్ట్ కార్మికులకు కూడా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ఊహించని విధంగా వడదెబ్బకు గురయ్యే కాంటాక్ట్ కార్మికులకు, ఓబి వర్కర్లకు తగు వైద్య చికిత్స అందే విధంగా సింగరేణి వైద్య విభాగం ఆధ్వర్యంలో తగు ముందస్తు ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాట్లు చేయడంతో పాటు సేఫ్టీ మేనేజ్మెంట్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు కారణం

ఎస్పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** చిన్న పాటి నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు కారణం అవుతాయని, ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని వాహనదారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇల్లెందు సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో ఇల్లెందులోని అయిత ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అవగాహన కార్యాక్రమానికి ఎస్పి రోహిత్ రాజ్ ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతతో కూడిన డ్రైవింగ్ బలోపేతం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఎలా సంభవిస్తాయో ముందుగా ఊహించలేమని, నివారణ చర్యలే మూలం అన్నారు. రాత్రివేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, సుదూర ప్రయాణాలు చేసే లారీ, బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్పష్టమైన చూపు లేకుంటే ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మిత్ర మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక కుటుబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని,తీరని రోదన మిగులుతోందన్నారు. ఈ శిబిరంలోఅనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. పలువురికి ఉచితంగ కళ్లజోళ్లు, హెల్మెట్‌లు పంపిణీ చేశారు.

## రోడ్డు భద్రత..మనందరి బాధ్యత

ఎసిపి సారంగపాణి



**ప్రజాపక్షం/వైరా:** రోడ్డు భద్రత జీవనశైలిలో భాగం చేసుకోవాలని వైరా ఎసిపి సారంగపాణి అన్నారు. గురువారం జరిగిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వైరా పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం, రోడ్డు భద్రతా నియామాలు పాటించకపోవడం వలన రోడ్డు ప్రమాదంలో మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. హెల్మెట్లు, సీట్ బెల్టులు వాడటం యొక్క ప్రాముఖ్యతపై ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై రామారావు, ఎంపిడివో సక్రియ, తహసీల్దార్ సురేష్, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంగారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## 900 రోజుల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయ్?

ముగ్గురు మంత్రుల పనితీరుపై ప్రజలు ఆగ్రహం

వైరాలో మాజీ మంత్రి అజయ్‌కుమార్



**ప్రజాపక్షం/వైరా:** నాయకులు, కార్యకర్తలని కలుస్తా ఉంటే నాయకులు, కార్యకర్తలకు మధ్య ఉన్న సంబంధం పెరుగుతుంది. మంచైనా, చెడైనా పంచుకోవడానికి ఒక వేదిక అవుతుంది అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం వైరాలో వైరా మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ నాకు వైరా, ఖమ్మం నియోజకవర్గాలు రెండు ఒకేటనని, కార్యకర్తకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వస్తా అన్నారు. ఏప్రిల్19న ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనం మమతా కాలేజ్ గ్రౌండ్‌లో జరుగుతుంది. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఆయన అన్నారు. ఖమ్మం జిల్లాలో మూడో పార్టీ ఉండదు, టిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ వచ్చే ఎన్నికల్లో ముగ్గురు మంత్రులను వారి పనితనాన్ని చూసిన ప్రజలు ఇప్పటికే విసుగు చెందారు. వారిని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. వెలుగుమట్ల వద్ద నిరుపేదల ఇళ్లను కూల్చితే కెటిఆర్ పెద్ద ఎత్తున వారికి అండగా ఉండి బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేసిందని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌పై మసి పూసి మారేడు కాయ చేశారు తప్ప నీళ్లు వైరా రిజర్వాయర్‌కి వస్తున్నాయా అని అన్నారు. ముగ్గురు మంత్రులు వారి స్వాలంబజన కోసం పనిచేస్తున్నారు తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం లేదని తెలిపారు. 19న జరిగే ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం పట్టణ అధ్యక్షుడు నాగరాజు, బానోతు మంజుల, బిఆర్ఎస్ జిలాల నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్, కౌన్సిలర్లు దొంతబోయిన వెంకటేశ్వర్లు, కట్టా స్వరూపరాణి, మాదినేని సునీత, సిరిపురం సర్పంచ్ శ్రీనివాసరావు, నాయకులు పోట్ల శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, బాలాజి, మద్దెల రవి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వాసు, తిరుపతి శ్రీను, మరికంటి శివ, ఏదునూరు శ్రీను, తన్నీరు నాగేశ్వరరావు, ఆదూరి ప్రేమ్, వల్లవి శ్రీనివాసరావు, దేవరాజు, బట్టా భద్రయ్య, అయినాల కనకరత్యనం, అయోధ్య, కందుల ఓంకార్ పాల్గొన్నారు.

## కనుమరుగైన 'తోకలేని పిట్ట'

పోస్ట్ బాక్సులెక్కడ?

వీటి సేవలు మధుర జ్ఞాపకం మాత్రమే

కుటుంబంతో ఆత్మీయ ఆనందాలను పంచుకున్న లేఖలు




**ప్రజాపక్షం / ఖమ్మం టౌన్:** సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత వాటికి విలువ తగ్గింది.ఇప్పుడు వాటి సేవలు నిలిపి వేయడంతో కనుమరుగైంది.ప్రస్తుతం ఒక తరానికి ఇవి మదుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. నేటి తరానికి ఓ యూట్యూబ్, వెబ్ లో కనిపించే బొమ్మలా మిగిలింది. అవే తపాలా బాక్సు...లేఖలు, పార్సిల్లు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరవేయాలనే ఉద్దేశంతో తపాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కుటుంబంతో ఆత్మీయంగా అల్లుకొని, వారి సంతోషాలను, బాధలని, ఆనందాలని అక్షరాల స్పర్శ తో మనస్సుని చేరిన ఆత్మీయ నేస్తం ఉత్తరం . విద్యార్థులకు రెక్కలు లేని పక్షిగా, భార్యాభర్తలకు ప్రియ సఖిగా, వృద్ధాప్యంలో ఉన్న పెద్దవారికి పెద్ద కొడుకుగా ఉత్తరం ఉండేది. అంతేకాదు నిరుద్యోగులకు ఆశల పల్లకీగా, దేశ రక్షణలో నిమగ్నమైన సైనికునికి ఆత్మ బంధువుగా,ఎన్నో విధాలుగా చేరువైన ఉత్తరం నేటి ఆధునిక ప్రపంచంలో తన అస్తిత్వాన్ని వెతుకుతున్న పరిస్థితి నెలకొంది. భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధ్వర్యంలో 1764–1766మధ్య ముంబై, చెన్నై, కోల్ కత్తాలో మెట్ట మెదటి పోస్టాఫీసులు ప్రారంభమయ్యాయి.క్రమంగా పోస్టు బాక్సులనేవి లేఖలు వేయడానికి, అందుకున్న లేఖలను తీసుకొని ఇతరులకు పంపించడానికి ఉపయెగపడే ముఖ్యమైన సాధనంగా ఉత్తరాలు మారా యి. సెల్ ఫోన్ విస్తృతి , వాట్సాప్ తదితర సాంకేతికత లేని రోజుల్లో ఒకరి క్షేమ సమాచారం మరొకరు తెలుసుకునేందుకు తపాల వ్యవస్త ఓ పెద్ద దిక్కుగా ఉండేది.ఉత్తరాలు రాసి పోస్ట్ బాక్సులో వేస్తే చేరాల్సిన చోటుకి తపాలాశాఖ చేరవేసేది.తిరిగి అక్కడి నుండి ప్రత్యుత్తరం వచ్చేది.ఇలా ఒకరికొకరి యోగ క్షేమాలు తెలుసుకునేవారు.ప్రత్యుత్తరం తిరిగి రాకపోతే తాము పంపిన ఉత్తరం చేరిందో లేదో అని అందోళన చెందేవారు. ఎందరో ప్రేమికులను కలిపే ఒక వేదికగా కూడా ఉత్తరాలు ఉండేవి.ఒకానొక కాలంలో ప్రేమ లేఖలకు ఉం డే క్రేజీ అంతా ఇంతా కాదు.కానీ నేడు ఆ ఉత్తరాల పోస్టు బాక్సులు కనిపించటం లేదు. సాంకేతికత పెరిగిన తర్వాత ఉత్తరాలు రాసుకునే పద్ధతి మానుకున్నారు.సెల్ ఫోన్ వచ్చిన తర్వా త ఉత్తరాలు రాసుకునే వారి సంఖ్య తగ్గిం ది.వాట్సాప్ వచ్చిన తర్వాత పూర్తిగా ఉత్తరాల వైపు చూడటం మానేశారు నేటి తరం. దీంతో పోస్టు బాక్సు వినియెగం కనుమరుగైంది.

## వైరా మున్సిపాలిటీలో విజిలెన్స్ ఎంక్వయిరీకి నోటీసులు




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి విజిలెన్స్ నోటీసులు జారీ చేశారు. విజిలెన్స్ అధికారులు సిడిఎంఎకి, సిడిఎంఎ, ఆర్‌డిఎం నుంచి మున్సిపాలిటీలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్ల పేర్లు విజిలెన్స్ ఎంక్వయిరీ నోటీసులో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు బిల్ కలెక్టర్‌లపై అవినీతి ఆరోపణలతో పాటు పలు విమర్శలు ఉన్న నేపద్యంలో విజిలెన్స్ ఎంక్వయిరీకి నోటీసులు రావడం మరోసారి మున్సిపాలిటీలో చర్చ అంశంగా మారింది. ఒక్కసారిగా మున్సిపాలిటీకి విజిలెన్స్ ఎంక్వయిరి నోటీసు వచ్చిందని తెలిసిన అనంతరం పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన ప్రారంభమైంది. అసలు విజిలెన్స్ ఎంక్వయిరీ దేనికోసం జారీ అయింది. ఏమి తప్పిదాలు జరిగాయి అనేది రెండు రోజుల్లో అధికారులు తనిఖీ విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో సమగ్ర మార్పు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/కూసుమంచి:** ఖమ్మం జిల్లాలో 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణతో గ్రామాలలో సమగ్ర మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని విజయరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుండి ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈకార్యక్రమంలోని ప్రతి అంశాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏప్రిల్ 2న గ్రామ స్థాయి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, మండల కేంద్రాల్లో ప్రజాపాలన ప్ర గతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామ పం చాయితీలు, మున్సిపాలిటీలకు కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్సాహంతో ఉన్నారని, వారిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించాలని, శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ, మల్టీ పర్పస్ వర్కర్లకు సమయానికి వేతనాల చెల్లింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయగా, ఖమ్మం జిల్లాకు 16, 500 ఇళ్లు మంజూరయ్యాయని, 8200 ఇళ్లకు స్లా బ్ పనులు పూర్తయ్యాయని, తొందరలోనే సుమారు 10వేల ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతాయని చెప్పారు. కూసుమంచి మండలంలో ఇంకా ప్రారంభం కాని 43 ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేలా సర్పంచ్‌లు చ ర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పె షల్ ఆఫీసర్ రమేష్, కూసుమంచి మండల ఇన్చార్జి ఎంపీడీవో రాజారావు, తహసీల్దార్ సైదులు, హెచ్ఓ అపర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈనెల 20 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేడిగడ్డ కాలేశ్వరం, అనంతరం కాటారం మండలం నస్తురుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు పటిష్టమైన బందోబస్తు కేటాయించిన విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నస్తూర్ పల్లి బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభా స్థలి వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని డీపీవోకు సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. చేపట్టనున్న పనులను పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్ కు సూచించారు. హెలి ప్యాడ్, అప్రోచ్ రోడ్డు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అలాగే పబ్లిక్ మీటింగ్ వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు అంబులెన్సులు సేఫ్ హౌస్ ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాళేశ్వర దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయాలని ఈఓను ఆదేశించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి కేటాయించిన విధులపై ధ్రువీకరణ నివేదిక అందజేయాలని తెలిపారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 19, 20 తేదీలలో ఇసుక లారీలకు అనుమతి ఇవ్వొద్దని, మూసివేయాలని ఆయన తెలిపారు. విధులు నిర్వహించు సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవో కు సూచించారు. అంతకుముందు కాళేశ్వరం నస్తూరి పల్లిలో సీఎం పర్యటన హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో హరికృష్ణ కాటారం డిఎస్పి సూర్యనారాయణ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యసభ ఎంపి నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై డిల్లీ పార్లమెంట్ రాజ్యసభ ప్రాంగణంలో వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవడం జరిగింది. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన నరేందర్ రెడ్డికి సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కడియం శ్రీహరి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ఎమ్మెల్యే మురళి నాయక్ కృషితో గూడూరుకు డయాలసిస్ కేంద్రం



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ కృషితో గూడూరు మండలానికి డయాలసిస్ కేంద్రం మంజూరైంది.అలాగే మానుకోట జిల్లా ఆసుపత్రికి అదనంగా రెండు డయాలసిస్ యూనిట్లు ప్రభుత్వం ఆమోదించింది.ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళినాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్షణిక ఆవేశంతో క్రిమిసంహారక మందులు సేవించి ప్రాణాలు కోల్పోతున్న ఘనటలు పెరుగుతున్నాయని తెలిపారు. అలాంటి సందార్భాల్లో సమయానికి డయాలసిస్ అందితే ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో గూడూరు కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సెంటర్ జిల్లా ఆసుపత్రిలో ఆదనపు యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఈ ప్రదిపాదనకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.గూడూరు కమ్యూటి హెల్త్ సెంటర్‌లో 5 యూనిట్లతో నూతన డయాలసిస్ కేంద్రం జిల్లా ఆసుపత్రి రెండు యూనిట్లు మంజూరు చేసినందుకు జిల్లా ప్రజల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల అవసరాలను వెంటనే గుర్తించి స్పందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని ఎమ్మెల్యే అన్నారు. నియాజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ డిగ్రీ కాలేజీలు పాలిటెక్నిక్ సంస్థలు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు ఆరోగ్య సేవలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వంలో విద్యా వైద్య రంగాలు దెబ్బతిన్నాయని అప్పటి పాలకులు ప్రజా ప్రయోజనాల కంటే తమ స్వలాభాలకే ప్రాధాన్యత ఇచ్చారని అరోపించారు.రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా ప్రతీ ఒక్కరు కృషి



**ప్రజాపక్షం/నర్సంపేట :** ప్రభుత్వ పథకాలను ప్రజలదరికి చేరే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వైవి గణేష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో నర్సంపేట మున్సిపాలిటి చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, కమిషనర్ కాటం భాస్కర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ వై వి గణేష్, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డిలు పభుత్వం ప్రవేశపెడతున సంక్షేమ పథకాలును, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నేరుగా చేర్చడమే లక్ష్యంగా ప్రజల వద్దకే పాలన తీసుకువెళ్లే విధంగా ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ముష్కే శ్రీనివాస్, ఎస్సై గూడ అరుణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్స్ బత్తిని రాజేందర్, మాదాసి రవి, ముత్తినేని వెంకన్న, ఎలకంటి విజయ్, హన్మకొండ శ్రీధర్, శివరాత్రి స్వామి, ఏవూరి శ్రీనివాస్ రెడ్డి, బాణాల ప్రసన్న, పొన్నాల మనిషా, వేముల సంధ్య, కొంపల్లి వీణ, దొంగల రజిత, శ్రీరామోజు రోజా రాణి, మేఘన, ఇస్లావత్ రామ, ములకల వినోద, రోజారాణి, శ్రీదేవి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని రామవరం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన కర్నూరి మనోహర్ రెడ్డి (65) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఇటుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్ వెనుక నుండి అతివేగంగా కొట్టడంతో స్కూటిపై నుండి పడిన మనోహర్ రెడ్డిపై ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో చాతి, తలకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందడం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చింత రాజు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/రాయపర్తి :** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని రావూరు గ్రామానికి చెందిన దామెర శ్రీనివాస్ మండలంలోని కొత్తూరు గ్రామంలో మీసేవ సెంటర్‌లను నిర్వహిస్తూ రావూరుకు కొత్తూరు రాకపోకలు నిర్వహించేవాడు. బుధవారం రాత్రి మీసేవ కేంద్రాన్ని మూసి వేసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం రావూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా హాస్పటల్‌కు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## సురక్షిత ప్రయాణానికి కంటిచూపు ప్రధానం: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ఎంతో ప్రధానమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో గల గ్రెయిన్ మార్కెట్ పరిధిలో యార్డు డ్రైవర్‌లకు కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున విజయవంతంగా కొనసాగుతూ మంచిగా నిర్వహిస్తున్నారని అభినందించారు. కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరు వినియోగించుకోవాలని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అదికారి మల్లిఖార్జున రావు, సీఐ, కౌన్సిలర్ రజని, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు: సిఐ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని భూపాలపల్లి సిఐ డి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు చలువ కళ్లద్దాలు, క్యాప్‌లు (హ్యాట్స్) పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి తగిన రక్షణ కల్పించడం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అదే విధంగా, రోడ్డు వినియోగదారులు, వాహనదారులు అందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని నరేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## కూరగాయల వ్యాపారులను మోడల్ మార్కెట్‌కు తరలించాలి

జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధకర్ రెడ్డి సిపిఐ



**ప్రజాపక్షం/మరిపెడ:** బాజార్లలో కూరగాయలు అమ్మె చిరు వ్యాపారులను వెంటనే మెడల్ మర్కెట్ లోకి తరలించాలని సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి నల్లు సుధకర్ రెడ్డి డిమండ్ చేశారు.గురువారం ఆయన మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో నిరుపాయెగంగా ఉన్న మెడల్ మర్కెట్ ను సిపిఐ బృందంతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ,గత ప్రభుత్వం 2022 సంవత్సరంలో కోట్లరూపాయలు వెచ్చించి అందుబాటులోకి తెచ్చిన మెడల్ మర్కెట్ ముడునాళ్ళ ముచ్చటగా మరిందనీ,కోద్ది రోజులు ఉపాయెగించిన కూరగాయల వ్యాపారులు అధికారులు నిర్వహణ సరిగా చేయడం లేదని సరియైన సౌకర్యాలు లేవనీ,స్థానిక రైతులను మర్కెట్ లో కూరగాయలు అమ్మెవిధంగా కట్టడి చేయకపోవడంతో తిరిగి వీధులలో వ్యాపారం చేస్తూన్న రనీ,ఫలితంగా ట్రాఫిక్ సమస్యలతో వాహానదారులు,సాదరణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఇప్పటికైన నూతన పాలకవర్గం దృష్టిసారించి నిరుపాయెగంగా ఉన్న మెడల్ మర్కెట్ ను వాడుక లోకి తెచ్చి చిరు కూరగాయల వీధీ వ్యాపారులను మర్కెట్ లోకీ తరలించాలనీ,చేపలు అమ్మెవారికి స్థలం కేటాయించాలనీ కోరారు.సంత నుండి బయటకు వెళ్ళె వెనుకవైపు దారి తిరిగి తెరచి ఉపాయెగం లోకి తెవలనీ కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ,జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషిద్,తురక రమేష్,తదితరులు పాల్గోన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి

వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు హన్మకొండ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు కీలక డిమాండ్లను కలెక్టర్ కు వివరించి వినతిపత్రం అందించడం జరిగింది.వారు స్పందించి ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై తక్షణం చర్యలకు పూనుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్. రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ.ఐ.ఎస్.బి. రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్, ఏ.ఐ.ఎస్.ఎఫ్. హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, పి.డి.ఎస్.యు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నరసింహ రావు, పి.డి.ఎస్.యు.హన్మకొండ అధ్యక్షులు బి.వంశీకృష్ణ లు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేపట్టడం వల్ల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాల విక్రయాలు జరపడం అనైతికమని, పాఠ్యపుస్తకాలు ముందస్తుగా అమ్మడమే కాకుండా విచ్చలవిడిగా ఎమ్మార్పీ ధరలకు మించి అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలుదోపిడి చేస్తున్నారని దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇంకా ఫీజు నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా ఈ విద్యా సంవత్సరం నుండి అమలు చేయాలని, ప్రభుత్వం ఇటీవల కాలంలో ఒక కమిటీ వేసి కాలయాపన చేస్తుందని అది సరైనది కాదని వెంటనే నియమించిన కమిటీ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించి ఈ విద్యా సంవత్సరం ఫీజుల నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి, ప్రభుత్వ విద్యాసంస్థల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న డీఈఓ, ఎంఈఓ, టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలన్నారు. విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ కార్యక్రమంలోపి.డి.ఎస్.యు.హన్మకొండ వరంగల్ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు బొజ్జ జ్యోతి, లావణ్య, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి కృషి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/గీసుకొండ:** పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల త్వరిత పరిష్కారం, ఆరోగ్యం, అరైవ్ అలైవ్ ద్వారా సురక్షిత ప్రయాణం, సంక్షేమ పథకాలు, పిల్లల భద్రత. సంరక్షణ, డ్రగ్ నియంత్రణ, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు ,పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై జిల్లా సమగ్ర అభివృద్ధికి కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఈ పది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు . ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం గీసుకొండ మండలం కోనాయిమాకులం రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో పది ముఖ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, పట్టుదల, ప్రశ్నించే తత్వం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం కోసమే వినియోగించబడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉందని, ఎలాంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1800425 3424 కు సంప్రదించవచ్చని సూచించారు. ఈ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి, సంబంధిత ఆసుపత్రుల్లో ( వర్ధన్నపేట, నర్సంపేట, ఎంజీఎం) వాయిస్ రికార్డింగ్ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. అనవసర ఖర్చులు చేయకుండా, అవసరమైన సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పొందాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, 21 గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటి చైర్మన్ నల్ల అండాలు అన్నారు. ఎమ్మెల్యే యశస్విනిరెడ్డి ఆదేశాల మేరకు ఏడునూతుల, హక్యతండా ఐకేపీ సెంటర్ల ద్వారా వరిధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లతో కలిసి అండాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్నరకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్, సర్పంచ్‌లు ఉమా అంజయ్య, బొందమ్మ, వీరేష్ నాయక్, నాయకులు బిక్షపతి, నాగరాజు, వెంకన్న, యాకోబ్ నాయక్, ఖలీం, శ్రీకాంత్, రవీందర్, రాగ్యా నాయక్, భోజ్య నాయక్, శ్రీనివాస్, వెంకన్న, పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు

కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/ములుగు:** ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, పదవ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యామ్న భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తుందని దివ్యాంగుల విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్దిదారుల వివరాలు, పథకాల ప్రయోజనాల గురించి లబ్దిదారులు స్వయంగా వారి మాటలలోనే అందరికి తెలియజేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం విద్య, సామాజిక భద్రత, మహిళల ఆర్థిక అభివృద్ధి వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని నూతన సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతుందని స్పష్టం చేశారు. గతంలో కేవలం హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకే మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేవారని, ఇప్పుడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహన భోజనంతో పాటు, ఉదయం పూట అల్పాహారం కూడా అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. దివ్యాంగులకు చేయూతను అందించాలనే లక్ష్యంతో ఇంజర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు, వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అనే నూతన పథకాన్ని ప్రవేశపెడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ కృపాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఎంపివో, తహసీల్దారు, మండల స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## కెటిపిపిలో అగ్ని ప్రమాదం

ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని చెల్పూర్ సమీపంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీపీ)లో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన రిజెక్ట్ కోల్ (బొగ్గు చూర) ఒక్కసారిగా అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వేసవి తీవ్రత కారణంగా ఎండ వేడికి బొగ్గు నిల్వల్లో మంటలు పుట్టినట్లు తెలుస్తోంది. గాలి ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపించి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. కిలోమీటర్ల మేర నల్లని పొగ మేఘాలు కనిపిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి విఘాతం కలగకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. మంటల ధాటికి ప్లాంట్ పరిసరాల్లో ఉష్ణోగ్రత ఒక్కసారిగా పెరిగింది. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
17-04-2026
www.prajapaksham.in

"సందీప్ కిషన్ హీరోగా 'పవర్ పేట' హీరో సందీప్ కిషన్ చిత్ర పరిశ్రమలో 16 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఒక మైలురాయిని చేరుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రతిభావంతుడైన రచయిత-దర్శకుడు కృష్ణ చైతన్యతో కొత్త చిత్రాన్ని చేయనున్నట్టు ప్రకటించారు."

రీల్



## ఆలస్యంగా వస్తున్న 'పెద్ది'

ఏప్రిల్ నుంచి జూన్‌కు మారిన సినిమా రామ్ చరణ్ తాజా పాన్‌ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన రెండు పాటలు బ్లాక్‌బస్టర్‌లుగా నిలిచాయి, రెండు గ్లింప్స్‌లో రామ్ చరణ్ డిఫరెంట్ అవతార్స్‌లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం విడుదల దిశగా ముందుకు సాగుతోంది. సినిమా విడుదల వాయిదా పడినట్లు చిత్ర బృందం ఇప్పుడు అధికారికంగా ధృవీకరించింది. మేకర్స్ నుండి వచ్చిన ఒక అధికారిక ప్రకటన ప్రకారం 'పెద్ది' జూన్లో థియేటర్లలోకి రానుంది.

మహేష్ బాబు చేతుల మీదుగా

## 'శ్రీనివాస మంగాపురం' టీజర్



దర్శకుడు అజయ్ భూపతి తాజా లవ్ స్టోరీ 'శ్రీనివాస మంగాపురం'. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. .'ఉయ్యి అమ్మ' పాటతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆమె ఈ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. డా. మోహన్ బాబుఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనున్నారు. అశ్విని దత్ సమర్పణలో, పి.కిరణ్ నిర్మాణం లో రూపొందుతున్న ఈ చిత్రం ప్రధాన తారాగణం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ల విడుదలతోనే ఇప్పటికే ఆసక్తి నెలకొంది. సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ టీజర్‌ను లాంచ్ చేశారు. తిరుపతి దేవాలయ పట్టణంలో సాగే ఈ కథ వాసు బాబు, మంగా అనే ఇద్దరు స్నేహితులు ప్రేమికులుగా మారి ఆనందంగా జీవించే ప్రయాణాన్ని చూపిస్తుంది. కానీ అనూహ్యమైన సంఘటన వారి జీవితాన్ని మలుపు తిప్పుతుంది. మంగాను వదిలి వెళ్లలేని వాసు బాబు, తన ప్రేమ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమవుతాడు. రాజీ పడని స్టోరీ టెల్లింగ్‌కి పాపులర్ అయిన అజయ్ భూపతి, ఈ చిత్రంలో యూత్ఫుల్ లవ్ స్టోరీని యాక్షన్, భావోద్వేగాలతో మిళితం చేశారు. ట్రెండీ రొమాన్స్‌కు బలమైన భావోద్వేగాలను జోడిస్తూ కథ సాగుతుంది. ప్రేమను ప్రకటించేందుకు గాల్లో తుపాకీ కాల్చే సన్నివేశాలు, తర్వాత హీరోపై తుపాకీ గురిపెట్టే విజువల్స్ అజయ్ భూపతి ప్రత్యేక శైలిని చూపించాయి. మోహన్ బాబు విలన్‌గా కనిపిస్తూ కథలో ఉత్కంఠను పెంచారు. సినిమాటోగ్రాఫర్ జయకృష్ణ తిరుపతి వాతావరణాన్ని సహజంగా, అద్భుతంగా చూపించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం ప్రేమ, యాక్షన్ రెండింటికీ మరింత బలం చేకూర్చింది. మాధవ్ కుమార్ గుళ్లపాటి ఎడిటింగ్ నిర్వహించగా, సాహి సురేష్ ఆర్ట్ డైరెక్షన్‌తో ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించారు. రియల్ సతీష్ యాక్షన్ సన్నివేశాలను ఇంపాక్ట్ ఫుల్ తెరకెక్కించారు. 'చందమామ కథలు' బ్యానర్‌పై నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి.



## 'పళ్లిచట్టంబి'

### తెలుగులోనూ గ్రాండ్ సక్సెస్ అవుతుంది

#### నిర్మాతల ఆశాభావం

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటించిన 'పళ్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సిక్యాబ్ బ్రోస్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య, చైతన్య, చరణ్ నిర్మించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే మలయాళంలో 'పళ్లిచట్టంబి' సినిమా రిలీజై బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈనెల 17న తెలుగులో ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కు వస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ప్రొడ్యూసర్స్ చాణక్య, చైతన్య, చరణ్, అసోసియేట్ ప్రొడ్యూసర్ మేఘ శ్యామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ చైతన్య మాట్లాడుతూ ఈ సినిమా కోసం మేము ఏడాదిన్నరగా కష్టపడ్డాం. చివరకు సినిమా మీ ముందుకు తీసుకొస్తున్నాం. మలయాళంలో ఇప్పటికే ఈ మూవీ మంచి విజయాన్ని సాధించింది. తెలుగు ఆడియెన్స్ కూడా అదే స్థాయి ఘన విజయాన్ని మాకు అందిస్తారని ఆశిస్తు న్నాం అన్నారు. అసోసియేట్ ప్రొడ్యూసర్ మేఘ శ్యామ్ మాట్లాడుతూ 'పళ్లిచట్టంబి' సినిమాకు మన మీడియా మిత్రులు బాగా సపోర్ట్ చేశారు. మలయాళంలో ఈ మూవీ రిలీజై బ్లాక్‌బస్టర్ అయ్యింది. తెలుగులోనూ ఘన విజయం దక్కుతుందని ఆశిస్తున్నాం అన్నారు. ప్రొడ్యూసర్ చరణ్, ప్రొడ్యూసర్ చాణక్య ఈ ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు.



## 24న 'వాలా-2'

### తెలుగులో రిలీజ్

కేరళ, ఇతర ప్రాంతాల్లోనూ అద్భుతమైన విజయాన్ని కనమోదు చేసిన మలయాళ సంచలనం 'వాలా 2' ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. సావిన్ ఎస్ ఏ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హాషీర్ హెచ్, అలన్ బిన్ సిరాజ్, అజిన్ జాయ్, వినాయక్ వంటి యువ నటీనటులు ఆకట్టుకున్నారు. వీరి నటనకు ప్రేక్షకుల నుండి విశేష ప్రశంసలు లభించాయి. సాహు గారపాటి తన 'షైన్ స్క్రీన్స్' బ్యాన ర్‌పై, విపిన్ దాస్, హారిస్ దేశం, పిబి అనిష్, ఆదర్శ్ నారాయణ్, ఐకాన్ స్టూడియోస్‌తో కలిసి నిర్మించిన ఈ చిత్రం, విడుదలైన మొదటి వారంలోనే వంద కోట్ల రూపాయల మైల్ స్టోన్‌ని అధిగమించి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయ పరంపరను కొనసాగిస్తూ, 'వాలా 2 తెలుగు వెర్షన్ ఈ నెల 24న థియేటర్లలో విడుదల కానుందని నిర్మాత సాహు గారపాటిఅధికారికంగా ప్రకటించారు.

## 'మిస్టర్ ఎక్స్'

### ప్రీయాక్షన్ థ్రిల్లర్

#### ప్రీ రిలీజ్ ఈవెంట్లో హీరో ఆర్య





ఆర్య, గౌతమ్ కార్తీక్ లీడ్ రోల్స్ నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'మిస్టర్ ఎక్స్'. ఎఫ్ఐఆర్ సినిమాతో ఆకట్టుకున్న మను ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మ ణ్ కుమార్ నిర్మించారు. మంజు వారియర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్న ఈ చిత్రంలో అతుల్య రవి, రైజా విల్సన్, అనఘ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 17న తెలుగు, తమిళ్‌లో వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ఆర్య మాట్లాడుతూ దాదాపు మూడేళ్ల తర్వాత నా సినిమా తెలుగులో రిలీజ్ అవుతోంది. సైంధవ్‌లో ఒక గెస్ట్ రోల్ చేశాను. పూర్తిస్థాయిలో 'మిస్టర్ ఎక్స్‌తో రావడం చాలా ఆనందంగా ఉంది. మిస్టర్ ఎక్స్ ఒక థియేటర్ ఎక్స్‌పీరియన్స్ సినిమా. డైరెక్టర్ మను ఆనంద్ ఎఫ్ఐఆర్ సినిమా నాకు చాలా ఇష్టం. ఆయన మిస్టర్ ఎక్స్ కథ చెప్పినప్పుడు చాలా నచ్చింది. ఇందులో యాక్షన్, ఎమోషన్స్, క్యారెక్టర్స్ అన్నీ కలిసి గొప్ప అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దారు. గౌతమ్ చాలా కొత్త క్యారెక్టర్ చేశాడు అని అన్నారు. మంజు వారియర్ మాట్లాడుతూ డైరెక్టర్ మను ఈ సినిమాలో నాకు చాలా బలమైన పాత్ర ఇచ్చారు. నా కెరీర్లో ఇప్పటివరకు ఇలాంటి పాత్ర చేయలేదు. ఆర్య ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. అలాగే గౌతమ్ కూడా చాలా ముఖ్యమైన పాత్ర చేశారు. ఈ సినిమాలో శరత్ కుమార్ తో కలిసి నటించే అవకాశం దొరికింది అని ఆమె చెప్పారు. గౌతమ్ కార్తీక్ ,అతుల్య రవి ,డైరెక్టర్ మను ఆనంద్ ఈ ఈవెంట్ లో పాల్గొన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

**హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 9 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసుల్లో పిరాయింపుదాలుగా చెబుతున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బిఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌లలో మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. ఆ తర్వాత రిప్లై కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. బిఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్, కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్‌రెడ్డి, టి. ప్రకాశ్‌గౌడ్ ఎ.గాంధి, తెల్లం వెంకటరావు, సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బిజెపి అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎకె సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

## మిల్లర్ల పిటిషన్‌లపై ముగిసిన వాదనలు

**హైదరాబాద్:** మిల్లింగ్ కోసం సరఫరా చేసిన వరిని దారి మళ్లించారని, అలాగే ప్రభుత్వానికి ధాన్యం నిల్వలకు సమానమైన రూ.3960 కోట్ల బకాయిలు చెల్లింపుల వివాదంలో నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ రైస్ మిల్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌లపై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. తమపై పౌరసరఫరాల కార్పొరేషన్ నమోదు చేసిన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ వందల సంఖ్యలో రైస్‌మిల్లు యజమానులు వేసిన పిటిషన్లను జస్టిస్ జె. శ్రీనివాసరావు గురువారం విచారించారు. మిల్లర్లపై కేసులు అన్యాయమని, ప్రభుత్వ విధానాన్ని అనుసరించే ధాన్యాన్ని పబ్లిక్ వేలంలో అమ్మామని లాయర్ చెప్పారు. ఈ వాదనలను పోలీసుల తరఫున పీపీ వ్యతిరేకించారు. మిల్లర్లు డబ్బును ప్రభుత్వానికి చెల్లించకుండా మళ్లించారన్నారు. వాగదనల తర్వాత హైకోర్టు తీ ర్పును వాయిదా వేసింది

## ముగ్గురు కార్మికులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

సరుకును నందమూరి నగర్ నుండి హెర్బ్యాగ్స్ వద్దకు తరలిస్తుండగా ఖమ్మం రోడ్డులోని రైతు వేదిక సమీపంలో ఖమ్మం వైపు నుండి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఊట్లపల్లికి చెందిన మరో కార్మికుడు మడకం సంతోష్(35)తో పాటు మరో ఇద్దరిని ట్రాక్టర్లు ముడి సరుకు ఆన్‌లోడింగ్ చేసేందుకు వెళ్తుండగా ఎదురెదురుగా లారీ ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో పక్కనే వెళ్తున్న వెళ్తున్న ఆటో కూడా తగలడంతో ఆటో పల్టీ కొట్టి ఆటో డ్రైవర్ రోడ్డుపై పడిపోయి తలకు తీవ్రగాయాలయ్యాయి. ట్రాక్టర్‌లో మరో ఇద్దరితో పాటు ముగ్గురు వ్యక్తులకు తీవ్రగా గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన తీరు ప్రజల హృదయాలను కలిచి వేసింది. ఈ సంఘటన పట్టణంలో వ్యాపించడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఆసుపత్రికి వద్దకు చేరుకున్నారు. ఈ ప్రమాదం జరగానికి ముందు వెళ్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ వాహనం రైతు వేదికలోకి వెళ్లేందుకు స్లో అవడంతో ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టినట్లు ప్రత్యక్షసాక్షులు తెలుపుతున్నారు. ఎస్సై యయాతి రాజు తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరురుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి క్షతగాత్రులను ప్రాథమిక చికత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు. కెమిలాడిస్ ఫ్యాక్టరీ మేనేజర్ సుబ్రహ్మణ్యం విషయం తెలిసిన వెంటనే కంపెనీ క్యాషియర్ రామానుజం, ఇన్‌చార్జి శ్రీనివాసరాజులను సిబ్బందిని సంఘటనాస్థలానికి పంపించి క్షతగాత్రులను దగ్గరుండి చూసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయడంతో దగ్గరుండి అన్ని విధాలుగా మృతుల కుటుంబాలనకు క్షతగాత్రులకు సహకరించారు. కార్మికులకు ఫ్యాక్టరీ నుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తీరును ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు.

## మళ్ళీ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఎంతకాలమైతే అంతకాలం దిగ్బంధనం కొనసాగిస్తామని, ఇరాన్ ఇక తెలివిగా నిర్ణయం తీసుకోవాలని, చర్చల ఒప్పందాన్ని తిరస్కరిస్తే దాడులకు సిద్ధంగా ఉండాలని హెగ్సెత్ హెచ్చరించారు. ఇరాన్‌పై మరిన్ని తీవ్రమైన దాడులు చేస్తామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరించారు. వ్యతిరేక వాతావరణం ఉన్నప్పటికీ, రెండు రోజులుగా వైరి వర్గాల నుండి సానుకూల సంకేతాలు వస్తూ ఉండటంతో పశ్చిమాసియా సమస్య పరిష్కారానికి ఒక ఒప్పందం కుదురుతుందన్న అంచనాలు మొదలయ్యాయి. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆ దేశ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్ పశ్చిమాసియా దేశాల్లో వేరువేరుగా పర్యటనలు చేస్తూ దౌత్య కార్యకలాపాలను ముందుకు తీసుకువెళుతున్నారు. పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్ టెహ్రాన్ చేరుకుని ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలపై ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబాఫ్‌తో చర్చించారు. వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఇంకోవైపు ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న తరుణంలో గాజా భవితవ్యం కూడా లెబనాన్‌తోనే ముడిపడి ఉందని వార్తల్లో ముఖ్యాంశంగా ముందుకు వచ్చింది.కాగా, ఇరాన్‌లో కాల్పుల విరమణ రెండో దశ చర్చల్లో లెబనాన్ అంశం కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏప్రిల్ 13న హోర్ముజ్ జలసంధి పరిధిలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం ప్రారంభమైన తర్వాత నాలుగోరోజు గురువారం కూడా విజయవంతంగా నౌకలను అడ్డుకున్నామని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఒక్క నౌక కూడా అమెరికా దిగ్బంధనాన్ని దాటి వెళ్ళేందుకు సాహసం చేయలేదని ప్రకటించింది. ఈ నాలుగు రోజుల్లో పది నౌకలను గమ్యాలకు వెళ్ళనీయకుండా వెనక్కు తరిమికొట్టామని తెలిపింది. ఒకవేళ రాకపోకలు జరిగితే ఇరాన్ తీరానికి వెళ్ళే, అక్కడి నుండి వచ్చే నౌకలను ముందుకు గమ్యంవైపు వెళ్ళనీయకుండా వెనక్కు తరిమి కొడతామని తెలిపింది. ఇరాన్‌తో సంబంధంలేని ఇతర ప్రాంత నౌకలను మాత్రం స్వేచ్ఛగా వదిలేస్తామని తెలిపింది. ఇరాన్‌తో వ్యాపారం చేసే నౌకలను హోర్ముజ్ జలసంధిలో అడ్డుకోవడం ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, నౌకల నుండి సుంకాలు వసూలు చేయకుండా అడ్డుకోవడం, ఇరాన్ చమురు ఎగుమతులను గణనీయంగా తగ్గించడం ద్వారా ఆ దేశంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాలని అమెరికా గట్టి ప్రయత్నం చేస్తోంది. అమెరికా చేపట్టిన దిగ్బంధనానిన "సముద్ర దొంగతనం"గా విమర్శిస్తున్న ఇరాన్, ఎర్ర సముద్రం,గల్ఫ్, ఒమన్ గల్ఫ్ ప్రాంతాలలో నౌకాయాన్ని స్తంభింపజేస్తామని, వ్యాపారాలు సాగకుండా అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించింది.

**నౌకాస్వేచ్ఛకు భరోసా ఇవ్వండి**

మొదటిసారి ఇరాన్‌ను కోరిన చైనా

హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛకు భరోసా ఇవ్వాలని ఇరాన్‌ను చైనా కోరింది. అమెరికాతో నిండా యుద్ధంలో మునిగి ఉన్న ఇరాన్‌ను,మొదటిసారి చైనా ఈ మేరకు ఒక హామీ ఇవ్వాలని కోరింది. చైనా విదేశీవ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి వాంగ్ యీ గురువారం ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో ఫోన్‌లో సంభాషించారు. ఈ జలసంధిలో ఫిబ్రవరి నాటి సాధారణ నౌకా కార్యకలాపాల పునరుద్ధరణతో పాటు నౌకా స్వేచ్ఛ,భద్రతకు భరోసా ఇవ్వాలని అబ్బాస్‌ను కోరారు. ప్రపంచంలో నౌకావాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలాల్లో స్వేచ్ఛకు భరోసా ఇవ్వాలని ఆయన కోరారు. ముందురోజు మంగళవారం వాంగ్ యీ అమెరికా చర్యలను కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. హోర్ముజ్‌లో దిగ్బంధనం అత్యంత ప్రమాదకరం,బాధ్యతారాహిత్యం అని విమర్శించారు. గడచిన 48 రోజులుగా హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఐ.ఆర్.జి.సి తీవ్రమైన ఆంక్షలు అమలు చేస్తోంది. దీనిని ప్రతిగా ఇరాన్ నౌకలను కట్టడి చేయడం ద్వారా ఆ దేశ ఎగుమతుల ఆదాయాన్ని దెబ్బతీసి లొంగదీసేందుకు ఏప్రిల్ 13 నుండి అమెరికా కూడా దిగ్బంధనం అమలు చేయడం ప్రారంభించింది. ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చల సన్నాహాల నిమిత్తం పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ మధ్యవర్తి హోదాలో ఇరాన్‌ను ఒప్పించేందుకు టెహ్రాన్‌కు చేరుకున్న తరుణంలో వాంగ్ యీ ఈ ప్రకటన చేశారు. కేవలం 55 కి.మీ వెడల్పు మాత్రమే ఉండే హోర్ముజ్ జలసంధిలో ప్రతిరోజూ కొన్ని వందల నౌకలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ప్రపంచానికి అవసరమైన ఇరవై శాతం చమురును ఈ జలసంధి ద్వారా నౌకలు తీసుకువెళుతూ ఉంటాయి. ఈ జలసంధిని తెరవడం ట్రంప్ ఎజెండాలో రెండవ డిమాండ్‌గా ఉంది.

**అమెరికా-ఇజ్రాయెల్ లక్ష్యం ఒక్కటే**

ఇరాన్‌తో చేస్తున్న యుద్ధంలో అమెరికా-ఇజ్రాయెల్‌కు ఉన్న లక్ష్యం ఒకటేనని, వేరు వేరు లక్ష్యాలు లేవని ఇజ్రాయెల్ ఆ దేశ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు. తాము నిరంతరం అమెరికాతో సంభాషణలు చేస్తూ, అందుబాటులో ఉంటున్నామన్నారు. ఇరాన్‌లో ఉన్న శుద్ధిచేసిన యురేనియంను అక్కడి నుండి తొలగించాలని, వారి వద్ద అణ్వాయుధం ఉండకూడదన, కీలకమైన నౌకావాణిజ్య కార్యకలాపాలు యథాతథంగా కొనసాగేలా భరోసా ఉండాలని అన్నారు. "మా రెండు దేశాల లక్ష్యం ఒకటే, శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ నుండి బయటకు తరలించాలి, యురేనియం శుద్ధి చేయడానికి ఇరాన్‌కు ఉన్న శక్తిసామర్థ్యాలను నిర్మూలించేలా చూడటం మా రెండు దేశాల ప్రధాన ఉద్దేశం, హోర్ముజ్ జలసంధిని తెరిపించేలా చూడటం మా లక్ష్యం అన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ ఎనిమిదో తేదీన కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈనెల 22వ తేదీతో ముగుస్తుంది. ఈలోపే రెండో విడత చర్చలకు ఇరాన్‌ను తీసుకు రావాలని ఆయన పట్టుదలతో ఉన్నారు.

## 18న నిరసన ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతుందని, తద్వారా దక్షిణాది రాష్ట్రాల మద్దతు లేకుండానే పార్లమెంట్‌లో సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయన్నారు. ఇదే జరిగితే భవిష్యత్‌లో దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశం చీలిక వచ్చే ప్రమాదం ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "సమాఖ్య రాజ్యాంగానికి తూట్లు పొడిచే డీలిమిటేషన్"అంశంపై తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజా ప్రాణహిత ఆడిటోరియంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహ, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, ప్రొఫెసర్ గాలి వినోద్, న్యాయ నిపుణులు మాడభూషి శ్రీధర్, పర్యావరణ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, హైకోర్ట్ న్యాయవాది శారదగౌడ్, సినీ దర్శకులు సయ్యద్ రఫీ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు రాములు తదితరులు హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయి అధ్యక్షత వహించారు.

**రాజకీయకుట్ర,కుతంత్రాలతోనే 'డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల' బిల్లు: పల్లా వెంకట రెడ్డి**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక రాజకీయ కుట్ర, కుతంత్రంతోనే మహిళా, డీలిమిటేషన్ బిల్లును కలిపి ప్రవేశపెట్టిందని పల్లా వెంకట రెడ్డి విమర్శించారు. డీలిమిటేషన్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి, శాస్త్రీయ పద్ధతిలో ఎలా చేపట్టాలనే అంశాన్ని భారతదేశం ముందు చర్చకు పెడితే బాగుండేదని, కానీ అలా చేయకుండా సిఎం స్వయంగా ప్రతిపాదించారని తెలిపారు. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగానే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న సీట్లలో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. డీలిమిటేషన్‌కు 2031 సంవత్సరం వరకు గడువు ఉన్నప్పటికీ 2029 సంవత్సరానికి హడావుడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నాటి సిపిఐ ఎంపి గీతా ముఖర్జీ నాయకత్వంలోని కమిటీ చేసిన సిఫార్సులను ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో బిల్లులను ప్రవేశపెట్టడం ఒక రాజకీయ కుతంత్రామేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ బిల్లులో ఎటువంటి స్పష్టత లేదని, ఈ పక్రియ మరో ఏడాది వరకు కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఎ కూటమిలో భాగస్వాములుగా ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో పాటు ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్ కూడా కేంద్రంలోని బిజెపికే మద్దతునిస్తున్నాయన్నారు. జనాభా నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు స్వచ్ఛందంగా అమలు చేశాయని, ఉత్తరాది రాష్ట్రాలలో అమలు చేయలేదని, ప్రస్తుతం జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది,ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని పల్లా వెంకట రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

**కొన్ని రాష్ట్రాలను బలోపేతం చేస్తే..మిగతా రాష్ట్రాల పరిస్థితి ఏమిటి..:కోదండరామ్**

ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలను బలోపేతం చేయాలని, అదానీ, అంబానీలు బాగుపడాలని, తామే ఎప్పటికీ సీట్లలో కూర్చోవాలనే ఉద్దేశం మంచిది కాదన్నారు. రెండు, మూడు కార్పొరేట్ కంపెనీల కోసం పెత్తనం చేలాయిస్తే, మిగతా రాష్ట్రాల పరిస్థితులు ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ 131వ సవరణను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్‌పై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి కమిషన్ డీలిమిటేషన్‌లో ముఖ్యభూమిక పోషించి, నివేదిక ఇస్తే ఆ నివేదిక ఎవరికి అనుకూలంగా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమం, కేరళంలో వామపక్ష ఉద్యమం, తమిళనాడులో ద్రవిడ ఉద్యమం ఇలా ఒక్కో రాష్ట్రానికి ఒక్కో అస్తిత్వం ఉంటుందని వివరించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ 2026 జనాభా లెక్కల ప్రకారం, అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ఎవరికీ ఇబ్బందులు లేకుండా డీలిమిటేషన్ పక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లను తాము సమర్థిస్తున్నామని, కానీ డీలిమిటేషన్ బిల్లును కేంద్రం ఏకపక్షంగా అప్రజాస్వామికంగా ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. కె.గోవర్ధన్ మాట్లాడుతూ వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశమే హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడమని, బిజెపి, ఆర్ఎస్ఎస్ తమ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టాయని ఆరోపించారు. ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ పేరుతో మరణ శాసనంగా మారుస్తున్నారని మండిపడ్డారు. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఉత్తరాది ఆదిపత్యాన్ని కాపాడుకునేందుకే డీలిమిటేషన్‌ను చేపడుతున్నారన్నారు. పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రస్తుత డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలు అంతర్గత వలస పాలనలో ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com